PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 102 | విజయవాడ, ఆదివారం 12 నవంబర్ 2023 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 12 November 2023 | Rs

ఫొటో : కె రాజేష్, విశాఖ

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు

ప్రజాశక్తి

దీపావళి శుభాకాంక్షలు

నేడు మా కార్యాలయానికి సెలవు. సోమవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం.

- చీఫ్ జనరల్ మేనేజర్

చంద్రమోహన్ కన్నుమూత

- రేపు అంత్యక్రియలు

ముస్లిముల సాధికారతే లక్ష్యం

- మౌలానా ఆజాద్ జయంతిలో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

లోపలి పేజీలో...

తక్షణమే కాల్పుల విరమణ

- పాలస్తీనా సంఘీభావ ర్యాలీలో వామపక్షాల డిమాండ్
- ఇజ్రాయిల్‌కు మోడీ ప్రభుత్వం మద్దతివ్వడం గర్హనీయం

లోపలి పేజీలో...

ధాన్యం కొనేదెప్పుడు?

- కేంద్రాల ఏర్పాటుతోనే సరి!
- అయినకాడికి దళారులకు అమ్ముకుంటున్న రైతులు

లోపలి పేజీలో...

చట్టసభల్లో కమ్యూనిస్టులుండాలి

- మా అభ్యర్థులను అసెంబ్లీకి పంపండి
- బిఆర్ఎస్, కాంగ్రెస్‌తో పొత్తుకు మేం వెంపర్లాడలేదు
- మీట్ ద ప్రెస్‌లో సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

మూతపడిన బొర్రా గుహలు

- టూరిజం కార్మికుల సమ్మె
- ఫలించని చర్చలు

ప్రజాశక్తి-అరకు, అనంతగిరి (అల్లూరి జిల్లా)/ అమరావతి బ్యూరో

తమ సమస్యలు పరిష్కరించాలని పర్యాటక శాఖ కాంట్రాక్టు, మ్యాన్‌పవర్, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ కార్మికులు శనివారం సమ్మె బాటపట్టారు. దీంతో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలోని పర్యాటకశాఖ హరిత హిల్ రిసార్ట్స్, పున్నమి వ్యాలీ రిసార్ట్స్, రెస్టారెంట్లు, అనంతగిరి మండలంలోని బొర్రా గుహలు, టైడా మూతపడ్డాయి. అరకులోయలోని హరిత హిల్ రిసార్ట్స్, పున్నమి వ్యాలీ రిసార్ట్స్ ముఖద్వారాల వద్ద సమ్మె శిబిరాలు ఏర్పాటు చేసి కార్మికులు కూర్చున్నారు. విధులు బహిష్కరించి కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో పర్యాటక శాఖ అతిథి గృహాలు వెలవెలపోయాయి. టూరిజం కార్మికుల సమ్మె శిబిరాలను ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, కాంగ్రెస్ నాయకులు పి.చిన్నస్వామి తదితరులు సందర్శించి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు మొండి వైఖరి అవలంభిస్తున్నారని, డిమాండ్లు నెరవేరే వరకూ సమ్మె విరమించేది లేదని పర్యాటకశాఖ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.గంగరాజు, ప్రధాన కార్యదర్శి వి.బాబూరావు, అల్లూరి జిల్లా టూరిజం కార్మికుల సంఘం అధ్యక్షుడు నరసింహారాజు, ప్రధాన కార్యదర్శి అంజలిరావులు స్పష్టం చేశారు. సమ్మెతో ఆర్‌ఆర్ టూర్ (రైలు కం రోడ్డు) ప్యాకేజీ టూర్‌ను అధికారులు రద్దు చేశారు. అరకులోయలోని హరిత వ్యాలీలో చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర సందర్శించి మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక శాఖ బోర్డు సమావేశం ఏర్పాటు చేసి తక్షణమే టూరిజం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టూరిజం ఎండి కన్నబాబుతో చర్చలు జరిగినప్పుడు 15 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామన్నారని, అల్లూరి జిల్లా కలెక్టర్ సుమీత్‌కుమార్ సమక్షంలో కార్మికులతో యాజమాన్య తరుపున టూరిజం ఇడి చర్చలు జరిపి నవంబర్ 5వ తేదీ లోపు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేశారని పేర్కొన్నారు. అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు డి.గంగరాజు, పర్యాటకశాఖ ఆర్‌డి సమక్షంలో శుక్రవారం చర్చలు జరిపినా సఫలం కాకపోవడంతో కార్మికులు సమ్మెకు వెళ్లారని తెలిపారు. కార్మికులు చేపట్టిన సమ్మెకు సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు, టోకురు సర్పంచ్ కె.మోస్య మద్దతు తెలిపారు. బొర్రా గుహలు, టైడా, అనంతగిరి, హరితహిల్ రిసార్ట్స్, అరకు, గోష్టి, మయూరి, చింతపల్లి, లంబసింగిలో గత 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, రాయితీలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

అరకులోయలోని సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర,

అనంతగిరి మండలంలో తెరుచుకోని బొర్రా గుహలు

టూరిజం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

అల్లూరి సీతారామరాజు జిల్లా (ఎఎస్‌ఆర్) అరకు ప్రాంతంలోని టూరిజం కాంట్రాక్ట్, మ్యాన్‌పవర్, డైలీవేజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమస్యలు పరిష్కారం కోసం ఉద్యోగులు ఎపి టూరిజం కాంట్రాక్ట్, మ్యాన్‌పవర్, డైలీవేజ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నారని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందర్నీ రెగ్యులరైజ్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, కాంపాషినేట్ అపాయింట్‌మెంట్ ఇవ్వాలని, చనిపోయిన వారి దహన సంస్కారాలకు రూ.25 వేలు చెల్లించాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, బ్యాక్‌లాగ్ పోస్టుల్లో గిరిజనులనే నియమించాలని, టూరిజం భవనాలకు మరమత్తులు చేపట్టాలని, ఏజెన్సీ కార్మికులకు బస్సు పాస్, ఏజెన్సీ అలవెన్సు వంటి వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని టూరిజం యూనిట్లతో ప్రత్యేక డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అరకు, బొర్రా, అనంతగిరి, టైడా తదితర గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగులు అనేక ఏళ్లుగా సేవలందిస్తున్నారని తెలిపారు. రెండేళ్లుగా ఎన్ని వినతిపత్రాలిచ్చినా యాజమాన్యం స్పందించక పోవడంతో సమ్మె అనివార్యమైందని తెలిపారు. వెంటనే ఉద్యోగుల సమస్యలపై యూనియన్ ప్రతినిధులతో టూరిజం కార్పొరేషన్ చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్.పి.రామరాజు, తదితరులు

డిసెంబరు 12 నుండి బాలోత్సవ్

- 55 అంశాల్లో చిన్నారులకు పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ)

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు డిసెంబరు 12, 13, 14 తేదీల్లో అమరావతి బాలోత్సవం పిల్లల పండుగ నిర్వహించనున్నట్లు అమరావతి బాలోత్సవం అధ్యక్షులు ఎస్.పి.రామరాజు తెలిపారు. బాలోత్సవ్ 6వ పిల్లల పండుగకు సంబంధించిన పోస్టర్‌ను విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ.. 2017 నుండి ఐదేళ్లుగా అమరావతి బాలోత్సవ్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆరవ పిల్లల పండుగను మొగల్‌రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ బాలోత్సవ్‌కు 'దేశభక్తి' థీమ్‌ను నిర్ణయించామని, 39 ఎకడమిక్ ఈవెంట్స్, 16 కల్చరల్ ఈవెంట్స్ కలిపి 55 ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్, ప్రతి స్కూలుకు జ్ఞాపిక బహూకరించనున్నామని పేర్కొన్నారు. విజయవాడ నగరంతోపాటు నగరం చుట్టుపక్కల ఉన్న ఎన్‌టిఆర్, గుంటూరు, కృష్ణా, ఏలూరు జిల్లాలోని విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. పోటీల్లో పాల్గొనే పాఠశాలలు ఎంట్రీలు డిసెంబరు 8వ తేదీలోగా పంపాలన్నారు. బాలోత్సవంలో మున్సిపల్, జిల్లా పరిషత్, ఎయిడెడ్, కార్పొరేట్, మిషనరీ పాఠశాలల విద్యార్థులంతా పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బాలోత్సవ్ ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు, సభ్యులు వి.సాంబిరెడ్డి, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, పలువురు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థకు ప్రభుత్వం చేసింది శూన్యం

- ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

విద్యావ్యవస్థ, ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగిలో శనివారం జరిగిన యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేస్తామని, ఏటా డిఎస్‌సి ప్రకటిస్తామని, జనవరి నెలలో జాబ్ కేలండర్ విడుదల చేస్తామని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఈ నాలుగున్నరేళ్లలో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. సుమారు ఏడు సంవత్సరాల నుంచి డిఎస్‌సి లేక కొన్ని ప్రాథమిక పాఠశాలలు ఒక్క టీచర్‌తోనే నడుస్తున్నాయని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాల్సిన ప్రభుత్వం నెలలో ఏదో ఒక రోజు చెల్లిస్తున్నాంలే అనే పరిస్థితికి వచ్చిందని ఎద్దేవాచేశారు. ప్రత్యేక హోదా విషయాన్ని పక్కన పెట్టేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించలేని పరిస్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందన్నారు. దేశాన్ని అమ్మేయడానికి పార్లమెంట్‌లో మోడీ ప్రవేశపెట్టే బిల్లులన్నింటికీ వైసిపి ఎంపిలు బలపరుస్తుండడం సరికాదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తామని జగన్ హామీ ఇచ్చారని, నాలుగున్నర సంవత్సరాల తరువాత ఇప్పుడు పదివేల మందిని మాత్రమే రెగ్యులర్ చేస్తామనడం సమంజసమా? అని ప్రశ్నించారు. సిపిఎస్ ఏడు రోజుల్లో రద్దు చేస్తామని హామీ ఇచ్చి జిపిఎస్ తెచ్చారని, దీన్ని ఏ ఉద్యోగి ఆమోదించారో చెప్పాలని అన్నారు.

తిరుమల కల్యాణ కట్టలో కెఒడి రద్దు

- రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తల డిమాండ్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుమలలో పనిచేసే కల్యాణకట్ట క్షురకులను టిటిడి యాజమాన్యం వేధింపులకు గురిచేయడం సరికాదని, కెఒడి (కెప్ట్ ఆన్ డ్యూటీ)ని రద్దు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేసింది. తిరుపతిలోని యశోదానగర్ వేమన విజ్ఞాన కేంద్రంలో శ్రీవారి కల్యాణకట్ట నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ.. కల్యాణకట్టలో 849 మంది క్షురకులు పని చేస్తున్నారని, కెఒడి పేరిట 49 మందికి డ్యూటీలు ఇవ్వకుండా తొలగించడం దారుణమన్నారు. వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యానికి అనుకూలంగా టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య, మరికొందరు మాట్లాడటం సరికాదన్నారు.

క్షురకులకు న్యాయం చేయాలని, ఈ విషయంపై టిటిడి ఇఒ ధర్మారెడ్డి, ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్పందించాలని కోరారు. పది రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే తిరుపతిలోని టిటిడి ఎడి బిల్డింగ్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.నాగరాజు, శ్రీవారి కల్యాణకట్ట నాయీ బ్రాహ్మణ సంఘం కార్యదర్శి ప్రసాద్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాధాదేవి, సంఘం జిల్లా అధ్యక్షులు గంగులప్ప, బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నేత బుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.

10న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ

- ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి మహాసభ డిసెంబరు 10న విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో జరగనుందని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నూతన కమిటీని ఎన్నుకుంటామని ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్ర మహాసభ విజయవంతంపై శనివారం విజయవాడ రెవెన్యూ భవన్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి ఛైర్మన్ కె సుమన్, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బొప్పరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేటు ఏజెన్సీల దోపిడీ నుండి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రక్షించి, ఆప్కాస్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు మెరుగైన సేవలు అందిస్తున్న విధానాన్ని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్‌టిఆర్ జిల్లా రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ, విఆర్‌ఎ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

యువతను మోసం చేస్తున్నారు

- జగన్‌పై లోకేష్ ధ్వజం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతను మోసం చేస్తున్నారని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ధ్వజమెత్తారు. మాయమాటలు నమ్మి మోసపోయిన యువత బలవన్మరణాలకు పాల్పడుతోందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగం రాలేదని మనస్తాపంతో అనంతపురం జిల్లా కుందుర్పికి చెందిన శ్రీకాంత్ అనే నిరుద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసి తీవ్ర విషాదంలో మునిగిపోయాయని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఆత్మహత్యలన్నీ జగన్ చేసిన హత్యలే అని విమర్శించారు. ఏటా జనవరి 1న ఇస్తామన్న జాబ్ కేలండరు లేదని, టీచర్ పోస్టుల భర్తీకి ఒక్క ప్రకటనా రాలేదని తెలిపారు. నిరుద్యోగ యువత అఘాయిత్యాలకు పాల్పడొద్దని కోరారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా ఇంకెన్ని రోజులు నిరుద్యోగుల ఉసురు పోసుకుంటావని సిఎం జగన్‌ను మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ మరో ప్రకటనలో ప్రశ్నించారు.

ఇంకెంతమంది బలికావాలి?

అసమర్ధపాలనకు ఇంకెంతమంది బలికావాలని సిఎం జగన్‌ను లోకేష్ మరో ప్రకటనలో ప్రశ్నించారు. భీమవరం సమీపంలోని వీరవాసరంలో ఆర్‌టిసి బస్సు అదుపు తప్పి ధాన్యం వ్యాపారి కాజా శ్రీనివాసరావును ఢీకొనడంతో ఆయన మరణించారని పేర్కొన్నారు. ప్రమాదానికి గురైన బస్సు బ్రేకుల్లో సమస్య ఉన్నట్లు డ్రైవర్లు ముందుగా చెప్పినా స్పేర్ పార్టులకు డబ్బుల్లేవని, మరమ్మతులతో ప్రభుత్వం సరిపెట్టడం వల్లే ప్రమాదం సంభవించిందని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి సరైన పరిహారం అందజేసి; ఆర్‌టిసి గ్యారేజీల్లో మెయింటెనెన్స్‌కు నిధులు విడుదల చేయాలని కోరారు.

మితిమీరిన అప్పులు : యనమల

వైసిపి ప్రభుత్వం మితిమీరిన అప్పులు చేస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఊబిలోకి నెట్టిందని శాసనమండలి ప్రతిపక్ష నేత, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు విమర్శించారు. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వాస్తవ ఆర్థిక పరిస్థితిని విశ్లేషించకుండా పదేపదే అబద్ధాలను వల్లెవేస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలో ఎపి 8 నుంచి 11వ స్థానానికి పడిపోయిందని డాయిష్ బ్యాంకు ముఖ్య ఆర్థికవేత్త కౌశిక్ దాస్ తన నివేదికలో పేర్కొన్నారని తెలిపారు.

సిఐడి, కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాలు పరిధిదాటి చట్టవిరుద్ధంగా పనిచేస్తున్నాయని టిడిపి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విమర్శించారు. సిఎం జగన్ మెప్పు కోసం ఈ విభాగాల డిజిలు పనిచేస్తున్నారని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆరోపించారు. జూపూడి ప్రభాకర్ కులాల మధ్య వైషమ్యాలు రేకెత్తించేలా మాట్లాడటం సరికాదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు.

టిడిపి కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం జయంతి వేడుకలు

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు టిడిపి కార్యాలయంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి, మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలానా ముష్తాఖ్ అహ్మద్, అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ తదితరులు పాల్గొన్నారు. మైనార్టీలపై వేధింపులు, దాడులు నిత్యకృత్యమయ్యాయని విమర్శించారు.

ముగిసిన ఇంజనీరింగ్ ప్రత్యేక కౌన్సిలింగ్

- ఎపిఇఎపిసెట్ కన్వీనర్ నాగరాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఇఎపిసెట్-2023లో భాగంగా ఇంజనీరింగ్ అడ్మిషన్ల కోసం నిర్వహించిన ప్రత్యేక దశ కౌన్సిలింగ్ శనివారంతో ముగిసిందని, 1510 మందికి సీట్లు కేటాయించామని సెట్ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఈ కౌన్సిలింగ్‌లో 1735 మంది ఐచ్చికాలను నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. తొలి, మలి దశ కౌన్సిలింగ్, స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశం పొందలేని విద్యార్థులు మాత్రమే ఈ ప్రత్యేక దశ కౌన్సిలింగ్‌ను సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ ప్రవేశాలకు కన్వీనర్ కోటాతో సమానంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అన్ని రకాల ప్రభుత్వ పథకాలూ అమలవుతాయని పేర్కొన్నారు. సీట్లు కేటాయించిన కళాశాలల్లో ఈ నెల 14వ తేదీలోపు విద్యార్థులు వ్యక్తిగతంగా రిపోర్టు చేయాల్సి ఉందని వెల్లడించారు.

హెచ్చు చమురు ధరలపై ఫిచ్ హెచ్చరిక

న్యూఢిల్లీ : అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడి చమురు ధరలు ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోసే అవకాశాలున్నాయని అమెరికన్ రేటింగ్ సంస్థ హెచ్చరించింది. అధిక ద్రవ్యోల్బణంతో 2024లో గ్లోబల్ జిడిపి 0.4 శాతం, 2025లో 0.1 శాతం తగ్గిపోయే అవకాశం ఉందని విశ్లేషించింది. సరఫరాల్లో లోపాలతో 2024లో బ్యారెల్ చమురు ధర 120 డాలర్లుగా, 2025లో 100 డాలర్లుగా ఉండొచ్చని అంచనా వేసింది.

తెలుగు రాష్ట్రాల్లో ప్రయివేటుకు గోదాములు

- సిడబ్ల్యుసితో నైట్ ఫ్రాంక్ ఒప్పందం

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్య (పిపిపి) విధానంలో గోదాముల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (సిడబ్ల్యుసి)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సేవల సంస్థ నైట్ ఫ్రాంక్ వెల్లడించింది. ఈ భాగస్వామ్యంలో తెలంగాణలోని 2 ప్రాంతాలు, ఆంధ్రప్రదేశ్‌లోని 4 ప్రాంతాలు సహ దేశంలోని మొత్తం 54 ప్రదేశాల్లో వేర్ హౌసింగ్‌లను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా గోదాము సదుపాయాల విస్తరణ చేపట్టనున్నట్లు పేర్కొంది. ఎపిలోని పెదకాకాని, రాయనపాడు, అనకాపల్లి, నెల్లూరుల్లో గోదాములను ఏర్పాటు చేయనుంది. ఇందుకు సంబంధించిన స్థలాలను సిడబ్ల్యుసి ఎంపిక చేసిందని వెల్లడించింది. ఈ గోదాముల ప్రాజెక్టు వ్యయం రూ.181.33 కోట్లుగా అంచనా వేసింది. తెలంగాణలో వరంగల్, నాంపల్లిలో కొత్త గోదాములు ఏర్పాటు చేయనుంది. వీటి నిర్మాణానికి రూ.71.16 కోట్లుగా అంచనా వేసింది. గోదాముల నిర్మాణాలు, నిర్వహించాలని భావించే రియల్ ఎస్టేట్ వర్గాలకు మంచి అవకాశమని నైట్ ఫ్రాంక్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గులామ్ జియా తెలిపారు. నేషనల్ మానిటైజేషన్ ప్లాన్ కింద, సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఈ గోదాములను 45 ఏళ్ల పాటు పిపిపి పద్ధతిలో ప్రయివేటు పెట్టుబడిదారులకు అప్పగించనుంది.

రూ.50 వేల కోట్ల పసిడి వ్యాపారం

- ధన్‌తేరస్ వేళ అమ్మకాలు

న్యూఢిల్లీ : ధన త్రయోదశి సందర్భంగా దేశవ్యాప్తంగా బంగారం రిటైల్ అమ్మకాలు భారీగా జరిగాయి. శుక్రవారం ఒక్క రోజులోనే దేశ వ్యాప్తంగా రిటైల్ మార్కెట్‌లో రూ.50వేల కోట్లకు పైగా వ్యాపారం నమోదయ్యిందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సిఎఐటి) వెల్లడించింది. ఇందులో ఒక ఢిల్లీలోనే రూ.5,000 కోట్ల విలువైన క్రయ, విక్రయాలు జరిగాయి. గతేడాది ధన త్రయోదశి సమయంలో రూ.35వేలకోట్ల వ్యాపారం జరిగిందని సిఎఐటి తెలిపింది. ఈ ఏడాది మెరుగైన వృద్ధి చోటు చేసుకుందని సిఎఐటి జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే 43 శాతం అధిక అమ్మకాలు నమోదయ్యాయని వెల్లడించారు. అదే విధంగా రూ.5,000 కోట్ల విలువైన వాహనాలు, రూ3వేల కోట్ల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు, రూ.300 కోట్ల పూజా సామగ్రి అమ్మకాలు జరిగాయన్నారు. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల విక్రయాలు గతేడాది కంటే 15 నుంచి 20 శాతం ఎక్కువగా జరిగాయన్నారు. దేశ వ్యాప్తంగా దాదాపు నాలుగు లక్షల చిన్న, పెద్ద ఆభరణాల వ్యాపారులున్నారన్నారని ఆల్ ఇండియా జ్యువెలర్స్ అండ్ గోల్డ్ స్మిత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు పంకజ్ అరోరా తెలిపారు. ధన్‌తేరస్‌లో 41 టన్నుల బంగారం, 400 టన్నుల వెండి ఆభరణాలు, నాణేలు అమ్ముడయ్యాయని వెల్లడించారు.

నేడు ముహురత్ ట్రేడింగ్

- సాయంత్రం 6 గంటలకు ప్రారంభం

ముంబయి : దీపావళి పండుగ సందర్భంగా స్టాక్ మార్కెట్లలో ముహురత్ ట్రేడింగ్ జరగనుంది. పండగ రోజున పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయనే విశ్వాసంతో ఇన్వెస్టర్లు స్టాక్స్‌ను కొనుగోలు చేసే ఆనవాయితి ఉంది. దీపావళి పండుగ ఆదివారం రావడంతో సెలవు దినం అయినప్పటికీ బిఎస్‌ఇలో ఎప్పటి తరహాలోనే గంట సేపు ట్రేడింగ్ జరగనుంది. సాయంత్రం 6 గంటల నుంచి 7.15 వరకు ముహురత్ ట్రేడింగ్ జరగనుందని బిఎస్‌ఇ వెల్లడించింది. ఇందులో 15 నిమిషాలు ప్రీ మార్కెట్ సెషన్ ఉంటుంది. ఈక్విటీ, కమోడిటీ డెరివేటివ్‌లు, కరెన్సీ డెరివేటివ్‌లు, ఈక్విటీ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్‌లు, సెక్యూరిటీల లెండింగ్ అండ్ బారోయింగ్ తదితర విభాగాల్లో ట్రేడింగ్‌కు వీలుంటుంది. గత పది ముహూర్తపు ట్రేడింగ్ సెషన్‌లలో ఏడుసార్లు స్టాక్ మార్కెట్‌లు లాభాలను నమోదు చేయగా.. మూడు సార్లు ప్రతికూలతను చవి చూశాయి.

గతేడాదిలో 9% వృద్ధి

గతేడాది దీపావళి నుంచి ఇప్పటి వరకు భారత ఈక్విటీ మార్కెట్లు 9 శాతానికి అటూ, ఇటుగా లాభపడ్డాయి. ఒక దీపావళి నుంచి తదుపరి దీపావళి వరకు ట్రేడింగ్ కాలాన్ని సంవత్‌గా వ్యవహరిస్తారు. 2079 సంవత్ ట్రేడింగ్ శుక్రవారంతో పూర్తయింది. ఈ ఏడాది 2080 సంవత్ ప్రారంభం కానుంది. గడిచిన ఏడాదిలో సెన్సెక్స్ 5,073.02 పాయింట్లు లేదా 8.47 శాతం, నిఫ్టీ 1,694 పాయింట్ల 9.55 శాతం చొప్పున రాణించాయి. చొప్పున లాభాలు నమోదు చేశాయి. ఇదే సమయంలో బిఎస్‌ఇ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.43.81 లక్షల కోట్లు పెరిగి రూ.320.29 లక్షల కోట్లకు చేరింది.

బిఎస్‌ఇ లాభాలు నాలుగు రెట్ల వృద్ధి

ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బిఎస్‌ఇ) నికర లాభాలు నాలుగు రెట్లు పెరిగి రూ.118.41 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.29.39 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.197.72 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ2లో రూ.314.51 కోట్లకు పెరిగాయి. సంస్థ వ్యయాలు మాత్రం యథాతథంగా రూ.204 కోట్లుగా నమోదయ్యాయి.

ప్రొఫెసర్ పోస్టుల భర్తీలో రిజర్వేషన్లకు ఎసరు!

- రోస్టర్ విధానం పాటించని ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల భర్తీలో రాష్ట్ర ప్రభుత్వం చట్టానికి తూట్లు పొడిచిందనే విమర్శలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాసంస్థ (అధ్యాపకుల శ్రేణిలో రిజర్వేషన్) చట్టం-2021))లోని నిబంధనలను ప్రభుత్వం ఉల్లంఘించినట్లు అభ్యర్థులు విమర్శిస్తున్నారు. ఈ చట్టం ప్రకారం రాష్ట్ర విద్యాసంస్థల్లో ప్రత్యక్ష నియామకాల్లో పోస్టులకు రిజర్వేషన్ ఉండాలి. కానీ ప్రస్తుతం ఇచ్చిన ప్రకటనల్లో ఖాళీ పోస్టులకు మాత్రమే రిజర్వేషన్ రోస్టర్ ప్రకటించారు. రాష్ట్రంలో 18 విశ్వవిద్యాలయాల్లో కలిపి మంజూరు పోస్టులు 4,330 ఉన్నాయి. వీటిల్లో భర్తీ చేస్తున్న 3,220 పోస్టులకు మాత్రమే రిజర్వేషన్ రోస్టర్ అమలు చేస్తున్నారు. ఈ చట్టంలోని సెక్షన్ 2(6) ప్రకారం మంజూరు చేసిన సిబ్బంది సంఖ్య అంటే ప్రభుత్వ ఆమోదంతో అధ్యాపకుల కేడర్‌లో మంజూరు చేసిన పోస్టుల సంఖ్య అని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. సెక్షన్ 3(2) ప్రకారం పోస్టుల రిజర్వేషన్ నిమిత్తం విశ్వవిద్యాలయానికి మంజూరు చేసిన పోస్టులను ఒక యూనిట్‌గా పరిగణించాలి. ఇందుకు భిన్నంగా ఈ చట్టాన్ని ఉల్లంఘించి మంజూరైన పోస్టులకు బదులుగా ఖాళీ పోస్టులకు మాత్రమే రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లు అమలు చేస్తున్నారు. దీంతో ఎస్‌సి, బిసి, మైనార్టీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్ విభాగాలను వేర్వేరు యూనిట్లుగా గుర్తించి రిజర్వేషన్ రోస్టర్ అమలు చేసేవారు. ప్రస్తుతం వర్సిటీని ఒకే యూనిట్‌గా పరిగణించి రిజర్వేషన్ ప్రకటించారు. ఇందుకోసం ఇప్పటి వరకు అమలు చేసిన రోస్టర్‌ను రద్దు చేసి కేవలం ఖాళీ పోస్టులకు ఒకటి నుంచి వంద వరకు రిజర్వేషన్ ఇచ్చారు. దీని కారణంగా రిజర్వేషన్ పోస్టులు మారిపోయాయి. ఆరు యూనివర్సిటీల్లో 29 హిస్టరీ పోస్టులను భర్తీ చేసేందుకు ఉన్నత విద్యాశాఖ నోటిఫికేషన్లను విడుదల చేసింది. ఈ సబ్జెక్టులో అసిస్టెంట్ ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ ఖాళీ పోస్టుల్లో బిసి-బికి ఒక్క పోస్టు కూడా లేదు. దీంతో వీరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పోస్టుల కోసం ఎదురుచూస్తున్న తమకు ఒక్క పోస్టు కూడా కేటాయించకపోవడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ 29 పోస్టుల్లోనే 8 ఒసి పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వం తమ వారికి ప్రయోజనం కల్పించేందుకు ఈ విధానం అమలు చేస్తున్నట్లు అభ్యర్థులు విమర్శిస్తున్నారు. రాష్ట్ర వర్సిటీలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వ అధికారిక మెమొరాండం-1997 ప్రకారం అమలు చేయాలని విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యుజిసి) సూచిస్తోంది. దీని ప్రకారం పోస్టుల ఆధారంగా రిజర్వేషన్ పాటించాల్సి ఉంటుంది. ఈ ఏడాది జూన్ 12న ఇచ్చిన సూచనల్లోనూ యుజిసి ఇదే స్పష్టం చేసింది. వర్సిటీల్లో విలీనం చేసిన విభాగాల్లో సైతం పనిభారంతో సంబంధం లేకుండా ప్రొఫెసర్లు, అసోసియేట్ ఆచార్యుల నియామకాల్లో లబ్ధి చేకూర్చేందుకు పోస్టుల సంఖ్యను నిర్ణయించి రోస్టర్ పాయింట్లు నిర్ణయించారనే ఆరోపణలు ఉన్నాయి. అన్ని విశ్వవిద్యాలయాల్లో విభాగాల పేర్లు ఒకే విధంగా ఉండాలని ఉన్నత విద్యాశాఖకు గతంలో ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. కొన్ని వర్సిటీల్లో కామర్స్, మేనేజ్‌మెంట్ కలిసి ఉంటే మరికొన్నింటిలో వేరు చేయడంపైనా విమర్శలు ఉన్నాయి.

ANDHRA PRADESH STATE GOVERNMENT EMPLOYEES MUTUALLY AIDED COOPERATIVE HOUSE BUILDING SOCIETY LIMITED (REGD. NO.AMC/KNA/DCO/2016/122)
Door No.54-16-3/3, Plat No.48, Loyola gardens colony, Road No.3, Opp: Loyola College, VIJAYAWADA 520 008, NTR District, A.P.,

NOTICE

The powers conferred under Resolution No.03, Dated:05.11.2023 of the Board meeting of the above Society, the under signed has appointed Sri. M.Nagendra Sagar Babu, B.A, LLB, S/o Kondala Rao, Advocate, Vijayawada (cell No.90109 61085) as Election officer vide proceeding No. ELECTIONS / 2 / 2023/ PRE-1, Dated: 06.11.2023 for conducting of elections of five (5) Director posts of the Society. The Schedule for elections (short notice) is as follows:
1) Publication of draft voters list, calling claims & objections from: 20.11.2023 10.00 AM to 27.11.2023 03.00 PM
2) Publication of voters list after rectification of claims & objections filed by members on: 28.11.2023 at 10.00 AM
3) Final list of voters shall be handed over to Election officer by under signed on: 30.11.2023
4) Election Notice shall be published by Election officer in Form-I along with voters list on 30.11.2023
5) Date of polling, counting of votes, declaration of results on: 30.12.2023
6) Place of Elections: Malineni Nageswara Rao A/c Library Hall, NTR & Veterinary colony Association Vijayawada - 8, NTR District (nearly 1/2 KM distance from Society Regd. office)

All eligible voter members of the Society are requested to file claims & objections if any on voters list to under signed following said schedule. The claims received after the prescribed period including postal delay if any will not be allowed & will be rejected, For further details contact the under signed during office hours.

Sd/-Addala Subba Raju, President
Ref: ELECTIONS /2/2023/PRE-6, Dated: 11.11.2023

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 102 | విజయవాడ, ఆదివారం 12 నవంబర్ 2023 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol 43 No 102 | Vijayawada, Sunday 12 November 2023 | Rs 7.00

నెదర్లాండ్స్‌తో భారత్ ఢీ నేడు

- తొమ్మిదో విజయంపై భారత్ గురి

● క్రీడలు పేజీలో..

చంద్రమోహన్ కన్నుమూత

- రేపు అంత్యక్రియలు

ప్రజాశక్తి- యంత్రాంగం

కథానాయకుడిగా, హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తెలుగు వెండితెరపై తనదైన ముద్రవేసిన ఒకప్పటి హీరోయిన్ల లక్కీ హీరో చంద్రమోహన్ (82) ఇకలేరు. కొంతకాలంగా హృద్రోగ సమస్యతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో హైదరాబాద్‌జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆస్పత్రి నుంచి శనివారం మధ్యాహ్నం ఫిల్మ్‌నగర్‌లోని చంద్రమోహన్ నివాసానికి భౌతికకాయాన్ని తరలించారుఈ విషయం తెలియడంతో తెలుగు చిత్రసీమలో విషాదవాతావరణం నెలకొంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు సంతాపం తెలియచేశారు. చంద్రమోహన్‌కు భార్య జలంధర, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అమెరికాలో సైకాలజిస్టుగా ఉన్న పెద్ద కుమార్తె మధుర మీనాక్షి వచ్చిన తర్వాత సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన మేనల్లుడు కృష్ణప్రసాద్ తెలిపారు. చిన్న కుమార్తె మాధవి చెన్నైలో వైద్య వృత్తిలో ఉన్నారు. 1966లో రంగులరాట్నం సినిమాతో అరంగేట్రం చేసిన చంద్రమోహన్ 55 ఏళ్ల సినీ కెరీర్‌లో దాదాపుగా 932 సినిమాల్లో నటించారు. మూడు సంవత్సరాల క్రితం విడుదలైన ఆక్సిజన్ ఆయన చివరి సినిమా! ఎక్పష్టా జిల్లా పమిడిముక్కలలో 1943 మే 23న జన్మించిన చంద్రమోహన్ అసలు పేరు మల్లంపల్లి చంద్రశేఖర్ రావు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు.. పలు తమిళ సినిమాల్లోనూ నటించారు. తన నటనకుగానూ ఫిలింఫేర్, నంది అవార్డులు అందుకున్నారు. 'పదహారేళ్ల వయసు', 'సిరిసిరిమువ్వ' సినిమాల్లో ఆయన నటనకు ఉత్తమ నటుడిగా ఫిలింఫేర్ అవార్డులు దక్కాయి. 1987లో 'చందమామ రావే' సినిమాకు ఉత్తమ హాస్యనటుడిగా నంది అవార్డు, 2005లో 'అతనొక్కడే' సినిమాకు ఉత్తమ సహాయ నటుడిగా అవార్డు అందుకున్నారు.

ప్రముఖుల సంతాపం

చంద్రమోహన్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. నటులు పవన్‌కల్యాణ్, ఆర్.నారాయణమూర్తి, శివకృష్ణ, నటి ప్రభ, సినీ రచయిత పరచూరి గోపాలకృష్ణ తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. చంద్రమోహన్ మృతికి సంతాపం ప్రకటిస్తూ పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సామాజిక మాధ్యమాల్లో స్పందించారు. . మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, నటులు చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, జూనియర్ ఎన్‌టిఆర్, సాయి ధరమ్ తేజ్, కల్యాణ్‌రామ్, టిడిపి నేత లోకేశ్, ఎంపి రఘురామకృష్ణరాజు

మిగతా 5లో

ముస్లిముల సాధికారతే లక్ష్యం

- మౌలానా ఆజాద్ జయంతిలో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముస్లిముల సాధికారతే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మైనార్టీల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాల్లో సిఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధికారత దిశలో తమ ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో పనులు చేసిందన్నారు. ఈ దిశలో రాజకీయ, ఆర్థికంగా, విద్యా రంగాల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక మార్పులు తీసుకువచ్చినట్లు చెప్పారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా చేసిన సేవలకు గుర్తుగా జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. 2008లో రాజశేఖరరెడ్డి సిఎంగా

మిగతా 5లో

ధాన్యం కొనేదెప్పుడు?

- కేంద్రాల ఏర్పాటుతోనే సరి!
- అయినకాడికి దళారులకు అమ్ముకుంటున్న రైతులు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లాలో వరి మాసూళ్లు ప్రారంభమైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం లేదు. కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మిగిలాయి. దీంతో, రైతులు దళారులను ఆశ్రయించి పంటను అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తోంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్లో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, దెందులూరు, పెదపాడు వంటి మండలాల్లో ఇప్పటికే వరి మాసూళ్లు ప్రారంభమయ్యాయి. ఉంగుటూరు మండలం బొమ్మిడి, బాదంపూడి వంటి గ్రామాల్లో దాదాపు 50 శాతం వరకూ మాసూళ్లు పూర్తయినట్లు రైతులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 394 రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఉంగుటూరు మండలంలోనూ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ప్రజాప్రతినిధులు హడావుడి చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సంచులు ఇవ్వడం లేదు. ధాన్యాన్ని తరలించడానికి లారీలు సిద్ధంగా లేవు. రైతులు అడిగితే పూర్తిస్థాయిలో ఆదేశాలు రాలేదని, కొనుగోలుకు కొంత సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఒకపక్క తుపాను హెచ్చరిక, మరోపక్క గత రబీలో పడిన ఇబ్బందుల దృష్ట్యా రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించేస్తున్నారు. ప్రభుత్వం 'ఎ' గ్రేడ్ ధాన్యానికి 75 కిలోల బస్తాకు రూ.1,652, కామన్ రకానికి రూ.1,637 మద్దతు ధర ప్రకటించింది. ఈ ధర రైతులకు ఏ మాత్రమూ గిట్టుబాటు కాదు. అయినా, ఈ ధరను కూడా దళారులు చెల్లించడం లేదు. 75 కిలోల బస్తాకు రూ.1,370 ఇస్తున్నారు. రైతులు గట్టిగా అడిగిన చోట బస్తాకు రూ.1,500 వరకూ చెల్లిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సంచులిచ్చి, లారీలు ఏర్పాటు చేస్తే దళారులకు ఆశ్రయించాల్సిన అవసరం ఉండదని రైతులు చెబుతున్నారు. దళారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోన్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉంగుటూరు మండలంలో బాదంపూడిలో ఆరబెట్టిన ధాన్యం

వెంటనే కొనుగోలు చేయాలి :మడే కేశవ, బొమ్మిడి

ఖరీఫ్‌లో 15 ఎకరాల్లో వరి సాగు చేశాను. వరి మాసూళ్లు పూర్తయ్యాయి. ఆర్‌బికెలో ధాన్యం కొనుగోలు చేయడం లేదు. 75 కిలోల బస్తాకు దళారులు రూ.1,350 మాత్రమే ఇస్తామంటున్నారు. ఈ ధరకు అమ్ముకుంటే గిట్టుబాటు కాదు. అయినా, మా గ్రామంలో కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు ధాన్యాన్ని అమ్మేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్‌బికెల ద్వారా మద్దతు ధాన్యం కొనుగోలు చేయాలి.

ధాన్యం కొనుగోలుకు ఆదేశాలిచ్చాం: మంజుభార్గవి, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల శాఖ

ధాన్యం కొనుగోలుకు అన్ని ఆర్‌బికెలకూ ఆదేశాలు ఇచ్చాం. సంచులు సరిపడా కొనుగోలు కేంద్రాలకు పంపించాం. తేమ శాతం పరిశీలించి కొనుగోలుకు ధాన్యం అనుకూలంగా ఉంటే రైతులకు అధికారులు సంచులు ఇస్తారు. ఇప్పటి వరకూ జిల్లాలో 30 టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. ఉంగుటూరు మండలం బొమ్మిడి, బాదంపూడిలో 126 రకం విత్తనం ముందుగా మాసూళ్లకు వచ్చింది. అక్కడ తడి, పొడి ధాన్యం రైతులు వ్యాపారులకు విక్రయించారు.

తక్షణమే పాలస్తీనాపై యుద్ధం ఆపాలి

- వామపక్షాల నిరసన కార్యక్రమంలో వక్తలు
- ఇజ్రాయిల్‌కు మోడీ ప్రభుత్వం మద్దతివ్వడం గర్హనీయం

విజయవాడ లెనిన్‌సెంటర్‌లో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా వామపక్షాల నిరసన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశం అనుసరిస్తున్న విదేశాంగ విధానానికి భిన్నంగా మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించడం గర్హనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు తక్షణమే నిలుపుదల చేయాలని కోరుతూ విజయవాడ లెనిన్ సెంటర్‌లో శనివారం వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అమెరికాతో చేరి ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటించి ప్రపంచంలో మనం ఒంటరి వారమవుతున్నామని అన్నారు. హమాస్ దాడికి ప్రతీకారం పేరుతో ఇజ్రాయిల్ దాడి అని చెప్పడంలో వాస్తవం లేదని, 40 ఏళ్లుగా పాలస్తీనా అస్తిత్వాన్ని దెబ్బతీస్తూ వారి సొంత దేశంలో కూడా వారు శరణార్థులుగా ఉన్నారన్నారు. పాలస్తీనాకు అండగా భారత ప్రభుత్వం నిలబడాలని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ముస్లిం వ్యతిరేకతతో మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు మద్దతు తెలుపుతోందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. ఇజ్రాయిల్, పాలస్తీనాపై యుద్ధాన్ని ఆపేందుకు మోడీ ప్రభుత్వం పూనుకోవాలన్నారు. ఇజ్రాయిల్ దాడుల్లో పసిపిల్లలు, చిన్నారులు చనిపోతున్నారన్నారు. యుద్ధం వల్ల 3.90 లక్షల మంది ఉద్యోగులు, కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. నిరసన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, జయరాం, హరికిశోర్, సిఐటియు నాయకులు ఉమామహేశ్వరరావు, వివిఎల్ నరసింహులు, సిపిఐ నగర సమితి నాయకులు జి కోటేశ్వరరావు, ఎంసిపిఐ(యు) నాయకులు ఖాదర్ బాషా, ఎంసిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు రవిచంద్ర, ఎస్‌యుసిఐ నాయకులు సుధీర్‌కుమార్, మహిళా నాయకులు కె స్వరూపరాణి, పి దుర్గాంబ, భారతి, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి కళాకారులు పాటలు పాడారు. ఇజ్రాయిల్ తక్షణమే యుద్ధాన్ని నిలుపుదల చేయాలని, పాలస్తీనాకు మద్దతుగా భారత్ నిలవాలని, యుద్ధం వద్దు.. శాంతిని కాపాడాలని నినాదాలు చేశారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - పెదకూరపాడు (పల్నాడు జిల్లా)

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన పెదకూరపాడులో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..పల్నాడు జిల్లా పెదకూరపాడు గ్రామానికి చెందిన బెల్లంకొండ రమేష్ (40) తన సొంత పొలం 75 సెంట్లతో పాటు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి పంటలు సాగుచేశారు. సాగు నిమిత్తం దాదాపు రూ.15 లక్షల మేర అప్పు చేశారు. గత నాలుగు సంవత్సరాల నుంచి పంటలు దక్కకపోవడం, ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో పంటలు దెబ్బతిన్నాయి. అప్పులకు వడ్డీ భారం అధికమైంది. రుణదాతల ఒత్తిడి తాళలేక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మూతపడిన బొర్రా గుహలు

- టూరిజం కార్మికుల సమ్మె
- ఫలించని చర్చలు

● లోపలి పేజీలో..

చట్టసభల్లో కమ్యూనిస్టులుండాలి

- మా అభ్యర్థులను అసెంబ్లీకి పంపండి
- బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌తో పొత్తుకు మేం వెంపర్లాడలేదు
- మీట్ ద ప్రెస్‌లో సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనసభ ఎన్నికల్లో సిపిఎంను ఆశీర్వదించాలని, తమ పార్టీ అభ్యర్థులను అసెంబ్లీకి పంపించాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చట్టసభల్లో కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యముండాలని అన్నారు. బిజెపిని ఓడించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ ఎన్నికల్లో వామపక్ష, ప్రజాతంత్ర, సామాజిక, లౌకిక, పోరాడే శక్తులకు మద్దతు ఇస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'మీట్ ద ప్రెస్'లో తమ్మినేని పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఐజెయు అధ్యక్షులు కె శ్రీనివాస్‌రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. ప్రజలు సంపూర్ణంగా అభివృద్ధి చెందాలన్న సమగ్ర ప్రణాళిక బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల వద్ద లేదన్నారు. ఆ పార్టీలతో తాము పొత్తుకు వెంపర్లాడలేదని స్పష్టం చేశారు. మునుగోడు ఎన్నికల సందర్భంగా కలిసి పనిచేద్దామంటూ సిఎం కెసిఆర్ ఆహ్వానించారని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వ నియంతృత్వ విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా సిపిఎం పోరాడుతున్నదని చెప్పారు. అంబానీ, అదానీల ప్రయోజనాల కోసమే బిజెపి పనిచేస్తోందని విమర్శించారు. దేశ సమగ్రత, సమైక్యతను కేంద్రం దెబ్బతీస్తున్నదని అన్నారు.

రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి మనుధర్మం అమలు చేయాలని భావిస్తున్నదని విమర్శించారు. బిజెపిని ఓడించేందుకే మునుగోడులో బిఆర్‌ఎస్‌కు మద్దతిచ్చామని వివరించారు. అప్పుడు బిజెపి గెలిస్తే కాంగ్రెస్‌కు ఇప్పుడున్న పరిస్థితి ఉండేది కాదన్నారు. కమ్యూనిస్టుల వల్లే మునుగోడులో బిఆర్‌ఎస్ గెలిచిందని, బిజెపి ఓడిందని చెప్పారు. బిఆర్‌ఎస్ వర్సెస్ బిజెపి అన్న పరిస్థితి నుంచి బిఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గా మారిందని అన్నారు. కర్ణాటక ఫలితాలు, ఇతర కారణాలతో కాంగ్రెస్

మిగతా 5లో

దర్గా తరలించొద్దు

రైల్వే నోటీసులపై గుజరాత్ హైకోర్టు

అహ్మదాబాద్ చారిత్రక దర్గా

అహ్మదాబాద్ : రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పేరుతో అహ్మదాబాద్‌లో 500ఏళ్ళ నాటి చారిత్రక దర్గాను ఖాళీ చేయాల్సిందిగా రైల్వే అధికారులు ఇచ్చిన నోటీసులపై గుజరాత్ హైకోర్టు స్టే విధించింది. ప్రస్తుతానికి యథాతథ పరిస్థితి కొనసాగించాల్సిందిగా అధికారులను ఆదేశించింది. అహ్మదాబాద్‌లోని కాలూపూర్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో గల హజరత్ కాలూ షహీద్ దర్గా అనధికార నిర్మాణమంటూ రైల్వే అధికారులు చేస్తున్న వాదనలు తప్పని నిరూపించడానికి తమ వద్ద పత్రాలు వున్నాయని దర్గా యాజమాన్యం తెలిపింది. త్వరలోనే అహ్మదాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులు చేపట్టాలనుకుంటున్నామని, అందుకే 14 రోజుల్లోగా అక్కడ నుండి దర్గాను తొలగించాల్సిందిగా దర్గా యాజమాన్యాన్ని ఆదేశించామని పశ్చిమ రైల్వే సీనియర్ సెక్షన్ మేనేజర్ తెలిపారు. అక్టోబరు 26న ఈ మేరకు నోటీసులు జారీ అయ్యాయి. అనధికార నిర్మాణంగా పేర్కొంటూ దర్గాలు ఈ నోటీసులు ఇచ్చారు. స్టేషన్ ఆవరణలో ఈ దర్గా వుంటుంది. హజ్రాత్ కాలూ షహీద్ దర్గా పేరుమీదనే కాలూపూర్ రైల్వే స్టేషన్, కాలూపూర్ బస్తీ అని పేర్లు వచ్చాయని యాజమాన్యం తెలిపింది. 500ఏళ్ల నాటిదైన ఈ దర్గాను ప్రతి రోజూ దాదాపు 500మంది సందర్శిస్తూ వుంటారు. శతాబ్దాల తరబడి దర్గా ఆవరణలోనే గల మసీదులో ముస్లింలు ప్రార్ధనలు చేస్తూ వుంటారని, రాత్రికి రాత్రే దర్గా ఎలా అక్రమ నిర్మాణమై పోతుందని దర్గా సంరక్షకులు మన్జూర్ మలేక్ ప్రశ్నించారు. అనేక ఏళ్లుగా వుంటున్నందున లౌడ్‌స్పీకర్లు ఉపయోగించడానికి, విద్యుత్ కనెక్షన్ వంటి అన్ని అనుమతులు కూడా తెచ్చుకున్నామని చెప్పారు.

చికున్‌గున్యాకు ఫస్ట్ వ్యాక్సిన్ !

- అమెరికా ఆమోదం



వాషింగ్టన్ : దోమ కాటుతో వచ్చే చికున్‌గున్యాకు ప్రపంచంలోనే మొదటి వ్యాక్సిన్‌ను అమెరికా ఆరోగ్య శాఖ ఆమోదించింది. ఈ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఆరోగ్య ముప్పుగా ఆవిర్భవించనుందని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ) హెచ్చరించింది. యూరప్‌కు చెందిన వాల్నెవా కంపెనీ ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధిపరిచింది. ఇక్స్‌చిక్ పేరుతో దీన్ని మార్కెటింగ్ చేస్తారు. 18ఏళ్లకు పైబడిన వారికి మాత్రమే ఈ వ్యాక్సిన్ వేసేందుకు అనుమతించారు. ఇక్స్‌చిక్ వ్యాక్సిన్‌కు అమెరికా గురువారం ఆమోదముద్ర వేయడంతో ఇక వైరస్ ప్రబలంగా వున్న దేశాల్లో వ్యాక్సిన్ పంపిణీ వేగమందుకుంటుందని భావిస్తున్నారు. జ్వరంతో పాటూ తీవ్రమైన జాయింట్ల నొప్పిని కలిగించే ఈ చికున్‌గున్యా ఎక్కువగా ఆఫ్రికా, ఆగ్నేయాసియా, అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తుంది. గత 15 ఏళ్లలో భారత్‌సహా వివిధ దేశాల్లో 50లక్షల మంది ఈ వ్యాధి బారిన పడ్డారు.

కల్తీ మద్యానికి 18 మంది బలి

- ఏడుగురి అరెస్ట్

చండీగఢ్ : హర్యానాలో కల్తీ మద్యం తాగి 18 మంది ప్రాణాలు కోల్పోయారు. గత 24 గంటల్లో ఆరుగురు, అంతకుముందు మరో 10 మంది మరణించారు. అంబాలాలో మరో ఇద్దరు చనిపోయారు. యమునానగర్ అదనపు పోలీసు సూపరింటెండెంట్ హిమద్రి కౌశిక్ శనివారం మీడియాతో మాట్లాడుతూ యమునానగర్ జిల్లాలో ఇప్పటివరకూ కల్తీ మద్యం తాగి 16 మంది మరణించారని చెప్పారు. ఈ కేసులో ఇప్పటివరకూ ఏడుగురిని అరెస్టు చేశామన్నారు. అరెస్టు చేసిన వారిలో కాంగ్రెస్ నేత, జననాయక్ జనతా పార్టీ (జెజెపి) నేత కుమారులు కూడా ఉన్నారు. యమునానగర్‌లోని మండేబారి, పంజేటో కా మజ్రా, ఫూస్‌గఢ్, సరస్ గ్రామాల్లోనూ, అంబాలాలోని పలు గ్రామాల్లో ఈ మరణాలు సంభవించాయి. దీంతో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. లిక్కర్ డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రభుత్వ తీరుపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. గతంలో జరిగిన ఇటువంటి ఘటనల నుండి గుణపాఠం నేర్చుకోవడంలో హర్యానా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రస్తుతం పోలీసులు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. లిక్కర్ డీలర్స్ గురించి సమాచారం అందించేందుకు గ్రామస్తులు భయపడుతున్నారు. తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఓ గ్రామస్తుడు పేర్కొన్నారు.

అంబాలా జిల్లాలో ఉత్తరప్రదేశ్‌కి చెందిన ఇద్దరు కార్మికులు కల్తీ మద్యంతో గురువారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. అంబాలాలోని నిషేధిత ఫ్యాక్టరీలో తయారు చేస్తున్న సుమారు 200 మద్యం డబ్బాలను సీజ్ చేశామని చెప్పారు. మద్యం తయారికి వాడిన వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ కేసును విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ని ఏర్పాటు చేసినట్లు యమునా నగర్ పోలీసులు ప్రక టించారు.

నిమిషాల దూరంలో పొంచిన మృత్యువు

- అల్ షిఫా ఆస్పత్రిలో దయనీయ పరిస్థితులు
- విద్యుత్ లేక నవజాత శిశువు మృతి, మరో 45మందీ అదే పరిస్థితి
- అత్యవసరంగా సమావేశమైన అరబ్ నేతలు

● లోపలి పేజీలో..●

డిసెంబరు 12 నుండి బాలోత్సవ్

- 55 అంశాల్లో చిన్నారులకు పోటీలు

● లోపలి పేజీలో..●

సంపాదకీయం

పర్యావరణ దీపావళి

'చీకటి వెలుగుల రంగేళీ/ జీవితమే ఒక దీపావళి/ మన జీవితమే ఒక దీపావళి/ అందాల ప్రమిదల/ ఆనంద జ్యోతుల/ ఆశలు వెలిగించు దీపాలవెల్లి' అంటాడు సినీకవి ఆత్రేయ. ఆబాలగోపాలాన్ని అలరించే ఈ పాట దీపావళిని మన కళ్లముందు ఆవిష్కరింపజేస్తుంది. జీవితమంటే వెలుగు మాత్రమే కాదు...చీకటి కూడా వుంటుందని బోధిస్తుంది. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా కూడా దీపావళి నిలుస్తుంది. అలాగే...చీకటి తర్వాత వెలుగు తప్పక వస్తుందన్న ఆశలను కళ్లలో మతాబుల్లా వెలిగిస్తుంది. మిరుమిట్లు గొలిపే దీపకాంతుల ఆనందహేళి... సామరస్యతకు ప్రతీక... ఈ వెలుగుల దీపావళి. దీపావళి అంటే- దీపాల వరుస అని అర్థం. శోభాయమానంగా వెలిగే ప్రమిదల వరుసలు, చిటపటమంటూ వెలుగులు చిమ్మే కాకర పువ్వొత్తులు, తెల్లని కాంతులు వెదజల్లే మతాబులు... ఎన్నెన్ని వెలుగులో... జన జాగృతిని చైతన్యవంతం చేసే ఎన్నెన్ని కాంతులో ఈ దీపావళిని జనరంజకం చేస్తాయి. అసలు భారతీయ సంస్కృతిలోనే పండుగలకు ఒక ప్రత్యేకత వుంది. ప్రజల జీవన విధానంలో యాంత్రికతను పక్కన పెట్టి తమ వారందరితో సంతోషంగా గడపడమనే ప్రక్రియలోనే ఎన్నెన్నో అనుబంధాలు పెనవేసుకొని వుంటాయి. 'దివ్వెల కాంతులు, వెల్గుల భ్రాంతులు, తేజము నిండగ నెల్లెడలన్/ రివ్వున జువ్వలు, రవ్వల రువ్వులు, రిక్కలు పొంగగ నింగి పయిన్/ దవ్వుల, దాపుల, సవ్వడి, సందడి దద్దరిలంగను నల్దిశలున్/ నవ్వుల పువ్వులు, తియ్యని బువ్వలు నల్వురు మెచ్చగ రమ్యముగన్' అంటారు కవి మిస్సన్న. మన పండుగల పరమార్థమే... ఎంతో చిక్కని స్నేహభావం. మరెంతో చక్కని లౌకికతత్వం.

కాలానుగుణంగా వచ్చిన మార్పులు దీపావళి అంటేనే భయపడేలా చేస్తోంది. ఒకప్పుడు దీపావళి అంటే... పర్యావరణహితంగా జరిగేది. ఇప్పుడు ఏటేటా దీపావళి రోజున పరిమితికి మించిన కాలుష్యం వెలువడుతోంది. రెండు గంటలు మాత్రమే టపాసులు కాల్చాలంటూ...తాజాగా సుప్రీంకోర్టు ఆదేశించింది. అయినా పాటిస్తున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. అర్ధరాత్రి దాటినా టపాసుల మోత దద్దరిల్లిపోతోంది. దీంతో కాలుష్యం తారాస్థాయికి చేరుతోంది. దీపావళి రోజున అతి ప్రమాదకరమైన సూక్ష్మ ధూళి కణాల స్థాయి ఎక్కువగా నమోదవుతోందని పిసిబి నివేదిక చెబుతోంది. భూమి, గాలి, నీరు కలుషితమౌతోందని పర్యావరణవేత్తలు మొత్తుకుంటున్నా... పట్టించుకునేవారే లేరు. అందుకు ప్రతిగా మూల్యం చెల్లించుకునే స్థితికి మనంతట మనమే నెట్టబడ్డాం. దీపావళి రోజునే కాకుండా ఏ సంబరమైనా, సందర్భమైనా నాలుగు టపాసులు కూడా కాల్చలేని విధంగా గాలిని కలుషితం చేసేశాం. ఇప్పటికే ప్రకృతిసిద్ధంగా లభించే నీటిని కొనుక్కునే స్థాయికి దిగజారిపోయాం. ఇప్పుడు ప్రాణాధారమైన గాలిని కూడా కొనుక్కునే పరిస్థితి వస్తే...ఆ ఊహ కూడా ఊపిరి సలపనంత భయాన్ని కలిగిస్తోంది.

మన చుట్టూ కాలుష్యం కమ్ముకొని వుంది. దేశ రాజధాని నగరమే కాలుష్యంలో మునిగిపోయింది. ప్రాణవాయువును కలుషితం కాకుండా కాపాడుకోవడం ఇప్పుడు మన కర్తవ్యం. టపాసులు పేల్చే ముందు చిన్నారి పిల్లలు, వృద్ధుల గురించి ఆలోచించాలి. శ్వాసకోశ సంబంధిత రుగ్మతలతో బాధపడేవారికే కాదు... మామూలు వారిలోనూ కొన్ని శ్వాస సంబంధమైన సమస్యలు తప్పవంటున్నారు వైద్యులు. గాలి కాలుష్యం కారణంగా గుండె, ఊపిరితిత్తుల సమస్యలతో సంభవించే మరణాలే ఎక్కువవుతాయని వారు చెబుతున్నారు. అందుకే- ఆనందోత్సాహాల సందడిలో... విషాదాన్ని కొని తెచ్చుకోవద్దు. పర్యావరణానికి హాని కలిగించని టపాసులు కూడా వున్నాయి. గ్రీన్ క్రాకర్స్, మట్టి ప్రమిదలు పర్యావరణానికి ఎలాంటి హానీ కలిగించవు. నువ్వుల నూనె, కొబ్బరి నూనె, నెయ్యి-ఇలా ఏదైనా నూనె పోసి దీపాలు వెలిగించాలి. ఈ దీపకాంతులతో ఇంటిని అలంకరిస్తే... ఇల్లంతా ఆహ్లాదకరంగా వుంటుంది. నూనెతో వెలిగించే దీపాలు చూడటం కూడా కళ్లకు మంచిదని డాక్టర్లు చెబుతుంటారు. అందుకే విద్యుత్ దీపాల కంటే నూనె దీపాలు పర్యావరణహితంగా, ఆరోగ్యకరంగా వుంటాయి. వీటివల్ల ఖర్చు తక్కువ... అందం, ఆనందం ఎక్కువ. పైగా పర్యావరణానికి మేలు చేస్తాయి. 'విరిసిన ఆనంద దీపావళీ/ మెరిసిన అనురాగ దీపాలివి/ వెతలకు దూరాలు... వెలుగుల తీరాలు/ మమతలు మా యింటి దీపావళి' అంటారో కవి. ఈ దీపావళిని వెతలకు దూరంగా, వెలుగుల తీరంగా, పర్యావరణహితంగా మార్చుకోవాలి. భవిష్యత్తరాలకు కాలుష్య రహిత ఆనందాల దీపావళిని అందించాలి.

మహనీయుల మాట



చిరునవ్వే దయాగుణానికి సంబంధించిన అంతర్జాతీయ భాష.
చెవిటి వాళ్ళు వినగలిగేది,
గుడ్డి వాళ్ళు చూడగలిగేది కేవలం
దయాగుణాన్ని మాత్రమే.

- మార్క్ ట్వైన్,
ప్రపంచ ప్రసిద్ధ రచయిత.

అటు ఎన్నికల హోరు, ఇటు రక్షణ భేరీలు

ప్రస్తుతం

తెలకపల్లి రవి

మరో ఇరవై రోజులలోపే తెలంగాణ శాసనసభ ఎన్నికల పోలింగ్ జరగనుంది. శుక్రవారంతో నామినేషన్ల ఘట్టం ముగిసింది. నవంబరు 30న ఓటేయడానికి ప్రజలు సంసిద్ధులవుతుండగా రాజకీయ పార్టీలు ప్రచారంలో మునిగిపోయాయి. క్రమేణా రూపు మారుతున్న ప్రచార పద్ధతులూ, మీడియా-సోషల్ మీడియా సాధనాలు, నాయకుల పర్యటనలూ అన్నీ అదే దిశలో హోరెత్తుతున్నాయి. ప్రజల తీర్పు ఎలా వుంటుందనేదానిపై అనేక రకాల సర్వేలు వెలువడుతున్నా ఇవేవీ ప్రభంజనం వస్తుందని చెప్పడం లేదు. పాలక పార్టీ బిఆర్‌ఎస్ గెలుస్తుందని కొన్ని సర్వేలు చెప్పగా కాంగ్రెస్ తప్పక విజయం సాధిస్తుందని ఇంకొన్ని సర్వేలు చెప్పాయి. అయితే విషయమేమంటే అసలు సర్వేలపై విశ్వసనీయత బాగా తగ్గడం. టీవీ చర్చలలో ఆ యా పార్టీల నాయకులు తమ ఓటమిని సూచించిన సర్వేలను తోసిపారేయడమే గాక ఎదురుదాడి చేస్తున్నారు. హఠాత్తుగా పుట్టుకొచ్చిన స్పాన్సర్డ్ సర్వే సంస్థల మాటకు విలువే వుండబోదని తెలంగాణ పరిస్థితిని బట్టి స్పష్టమవుతున్నది. బిఆర్‌ఎస్ కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోటీ అనేదానిపై మాత్రం ఏకాభిప్రాయం కనిపిస్తుంది. కాంగ్రెస్ ప్రభంజనం నెలకొందన్న కథనాలతో అతి విశ్వాసం పాలైన ఆ పార్టీ ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో చివరి వరకూ చర్చల ప్రహసనం జరిపి తాము అనుకున్నట్టు జరిపించడానికి పాచికలు విసిరింది. దానికీ కావలసినంత వ్యవధి ఇచ్చిన తర్వాత సిపిఎం గట్టి వైఖరి తీసుకోవడంతో కాంగ్రెస్ ఎత్తు పారలేదు. సిపిఐకి ఒక స్థానం కేటాయించినా అక్కడ కూడా ఆ పార్టీకి ఏ మేరకు సహకరిస్తుందనేది ఎవరికీ నమ్మకం లేని విషయం. ఎందుకంటే మా వాళ్లు మీకు సీటిచ్చినా ఓటు వేయరని కాంగ్రెస్ నాయకులు బాహాటంగానే కమ్యూనిస్టు నేతలకు చెప్పేశారు. విధానపరమైన విజ్ఞత అటుంచి అవగాహనను అమలు చేసే ఆనవాయితీ లేదని వారే ఒప్పుకుంటున్నారంటే ఇక ఇతరులు ఎలా నమ్మడం? అసలు కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపిలలో ఎవరు వుంటారో ఏ క్షణంలో మరోచోటికి దూకేస్తారో అర్థం గాని అయోమయావస్థ. తెలంగాణలో రాజకీయ మార్పునకు సంకేతమై నిలిచిన మునుగోడు లోనే ఇదివరకు కాంగ్రెస్ నుంచి దూకి బిజెపి తరపున పోటీ చేసిన కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి ఇప్పుడు మళ్లీ పాత పార్టీలో దూకి ఇటు నుంచి చేస్తున్నారు. బిఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలలో టికెట్ రానివారందరూ అటోఇటో దూకేస్తున్నారు. కొత్తగా టికెట్టివ్వడానికి పెద్ద అవకాశం లేని బిఆర్‌ఎస్ కూడా ఇతర పార్టీలలోని అసంతృప్త నేతలను ఆఖరి క్షణంలో చేర్చుకోవడం నిత్యకృత్యమైంది. ఎన్నికల తరుణంలో ఇవన్నీ గతంలోనూ జరిగాయి గాని ఇప్పుడు ఆ మోతాదు చాలా ఎక్కువగా వుంది. ప్రజాస్వామ్య లౌకిక విలువల పట్ల విధానపరమైన నిబద్ధత, రాజకీయ విలువలు లేకపోవడం వల్ల ఎన్నికల పోరాటం కాస్త అధికారం కోసం ఆరాటంగానే తయారైంది.

సందేహాస్పద రాజకీయం

బిజెపి మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా జరిగే జాతీయ పోరాటంలో బిఆర్‌ఎస్ ఒక కీలక భాగస్వామి అవుతుందనే నమ్మకం మునుగోడు ఎన్నిక కలిగించింది. ఆ సమయంలోనే ఆపరేషన్ ఫాం హౌస్, లిక్కర్ స్కాం కేసు వంటివి రంగం మీదకు వచ్చాయి. బిజెపి నేతలు ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబంపైనా తీవ్ర స్థాయిలో దాడి చేశారు. వారి బెదిరింపులూ మతోన్మాద భాషణలూ పరాకాష్టనందుకున్నాయి. తర్వాత రకరకాల కథనాల మధ్య ఈ వాతావరణం మారిపోయింది. కెసిఆర్‌తో సహా ఆ పార్టీ నేతలు ఇండియా,

> కేంద్రం వివక్షనూ, దీర్ఘకాలిక సమస్యలను, మౌలికాంశాలను పక్కకు నెట్టి పరస్పర వివాదాలకే పరిమితమై మోడీకి మూడు ప్రాంతీయ పార్టీలూ బిజెపితో మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకున్నాయని సిపిఎం కార్యదర్శి శ్రీనివాసరావు సూటిగానే చెప్పారు. ఒక్క విషయంలోనైనా బిజెపి మతతత్వాన్ని, కేంద్ర నిరంకుశత్వాన్ని ప్రశ్నించడానికి ఈ పార్టీలేవీ సిద్ధం కాని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రయోజనాల రక్షణ కోసం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం సిపిఎం రాష్ట్రవ్యాపితంగా నిర్వహించిన ప్రజా రక్షణ భేరి ప్రాధాన్యత సంతరించుకుంది. ఒక ప్రత్యామ్నాయ రాజకీయ భావనను, పోరాట సందేశాన్ని ప్రజల ముందుంచింది.

> ఒక విధంగా మూడు శిబిరాల మధ్య స్వతంత్ర పాత్ర కాపాడుకుంటూ ఆత్మగౌరవం, విధాన స్పష్టతతో ముందుకు పోవడం, సిపిఐ పోటీ చేసే కొత్తగూడెంలో వారికే మద్దతు నిస్తామని కూడా సిపిఎం చెప్పడం లౌకిక శక్తుల, వామపక్ష వాదుల మన్నన పొందుతున్నది. ఈ పరిస్థితికి కారణమైన బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు ఓట్ల చీలిక పర్యవసానాలకు మూల్యం చెల్లించవలసి రావచ్చు.

బిజెపిల మధ్య సమదూరం సిద్ధాంతం ఆలపించసాగారు. కాంగ్రెస్ మా ప్రధాన ప్రత్యర్థి గనక ఇలా అంటున్నామని పైకి చెబుతున్నా మోడీ నిరంకుశ పోకడలపై విమర్శ ఎందుకు తగ్గిందనేది ప్రశ్న. ఎ.పి లో చంద్రబాబు నాయుడు అరెస్టు తర్వాత ఆ మూలాలున్న వారి ఓట్ల ప్రభావం, కులపరమైన లెక్కలు ముందుకొచ్చాయి. ఈ క్రమంలోనూ బిఆర్‌ఎస్ ఓట్లను కాపాడుకోవడం కోసం అనేక విధాల వ్యూహాలు, మాటలు మార్చలేక తంటాలు పడుతోంది. కెసిఆర్ దాదాపు బిజెపి ప్రస్తావనే చేయడం లేదు. కెటిఆర్ అప్పుడప్పుడూ బిజెపి పైనా విమర్శలు వినిపిస్తూ వారితో తమకు ఎప్పుడూ ఎలాంటి బంధం లేదంటున్నా బిఆర్‌ఎస్‌పై ఆ విధమైన సందేహాలు కొనసాగుతూనే వున్నాయి. ప్రధాని మోడీతో సహా బిజెపి నేతలు మాత్రం పాలక పార్టీపై దాడి తీవ్రంగానే సాగిస్తున్నా కాంగ్రెస్‌కు అవకాశం లేకుండా చేయడమే వారికి కీలకమని పరిశీలకులు సరిగానే గుర్తిస్తున్నారు. వారి ఎత్తుగడలు ఏమైనా అసలు కాంగ్రెస్ శిబిరంలోనే ఐక్యత లేకపోవడం, అనేక మంది ముఖ్యమంత్రులు ముందుకు రావడం షరామామూలుగా సాగుతున్నది. మరో వంక మజ్లిస్ నేత ఒవైసీ బిఆర్‌ఎస్‌కే తమ మద్దతు వుంటుందని ప్రకటిస్తున్నారు. హంగ్ మాటలు కూడా వచ్చినపుడు మజ్లిస్ మద్దతు అవసరం కావచ్చనే అభిప్రాయం బలంగా వినిపిస్తుంది. అయితే అలాంటి పరిస్థితి వస్తే అప్పటి అవకాశాలను బట్టి ఆ యా పార్టీలు వ్యవహరిస్తాయి తప్ప చెప్పిన దానికే కట్టుబడి వుంటాయనుకోవడం పొరబాటు. బిజెపితో చేతులు కలిపి జనసేన పవన్ కళ్యాణ్ కూడా ఎనిమిది స్థానాల్లో పోటీ చేస్తుండడం, బిజెపి తెలుగు రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలను తన చుట్టూ తిప్పుకోవడం ఇక్కడ విస్మరించరాని విషయం. బిఆర్‌ఎస్‌గా పేరు మార్చుకుని జాతీయ పాత్ర నిర్వహిస్తామని హడావుడి చేసిన కెసిఆర్ ఇటీవల ప్రాంతీయ పార్టీలే కీలకమని వ్యాఖ్యానించడం కూడా బిజెపికి రాజకీయ సంకేతం కోసమేనా అన్న ప్రశ్నలు తలెత్తాయి. కాంగ్రెస్‌ను బలపరుస్తూ షర్మిల వైఎస్‌ఆర్‌టిపి, ప్రొఫెసర్ కోదండరామ్ టిజెఎస్ కూడా పోటీ నుంచి తప్పుకోవడం, గతంలో పాలక పార్టీగా వున్న తెలుగుదేశం ఇప్పుడు పోటీ నుంచి విరమించుకోవడం కూడా ఈ రాజకీయ విన్యాసాలలో భాగమే.

సిపిఎం విస్పష్ట వైఖరి

ఇంత విశృంఖలంగా తయారైన రాజకీయ నేపథ్యంలో సిపిఎం బిజెపిని ఓడించడానికి బిఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేకత విధానాలపై పోరాడటానికి స్వంతంగా పోటీ చేస్తున్నది. ఖమ్మం జిల్లాలో అన్ని స్థానాలలోనూ ఇతర చోట్ల కూడా నామినేషన్లు దాఖలు చేసిన ఆ పార్టీ అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. కీలక నాయకులు ప్రచారంలో పాల్గొంటున్నారు. మొదట బిఆర్‌ఎస్ తర్వాత కాంగ్రెస్ వామపక్షాలతో పొత్తు సంకేతాలిచ్చి తర్వాత ప్లేటు మార్చడం బిజెపి మతతత్వంపై పోరాటానికి హాని కలిగించిన తీరును వారు నిశితంగా విమర్శిస్తున్నారు. ఒక విధంగా మూడు శిబిరాల మధ్య స్వతంత్ర పాత్ర కాపాడుకుంటూ ఆత్మగౌరవం విధాన స్పష్టతతో ముందుకు పోవడం, సిపిఐ పోటీ చేసే కొత్తగూడెంలో వారికే మద్దతు నిస్తామని కూడా సిపిఎం చెప్పడం లౌకిక శక్తుల, వామపక్ష వాదుల మన్నన పొందుతున్నది. ఈ పరిస్థితికి కారణమైన బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు ఓట్ల చీలిక పర్యవసానాలకు మూల్యం చెల్లించవలసి రావచ్చు. గతవారం ఇదే శీర్షికలో చెప్పుకున్నట్టు ఎన్నికలు జరిగే ఇతర రాష్ట్రాలలో కూడా కాంగ్రెస్ ఇలాంటి పరిస్థితికి కారణం కావడం గమనించదగ్గది. ఇక బిఆర్‌ఎస్, బిజెపి సంబంధాలు ఎలా వుండేది భవిష్యత్తు చెబుతుంది గానీ ఇప్పటికైతే బిజెపిపై విమర్శ తగ్గిందనేది నిర్వివాదాంశం. ఎంఎల్‌సి కవితను అరెస్టు చేయకపోవడానికి ఇదే కారణమని కాంగ్రెస్ ఆరోపించడమే గాక కెసిఆర్ సర్కారుపై సిబిఐ దర్యాప్తు జరిపించాలని కూడా అడపాదడపా అంటున్నది. వాస్తవానికి భిన్నంగా ఏదో బిఆర్‌ఎస్ కోసం స్వంతంగా పోటీ చేస్తున్నదని వచ్చిన ఆరోపణలను సిపిఎం నిశితంగా ఖండించింది. బిజెపిని ఓడించడమేగాక స్వంత పునాదిని కాపాడుకోవడం ఒక కీలక కర్తవ్యమని కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మీట్ ద ప్రెస్‌లో గుర్తుచేశారు. పోలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులుతో సహా సిపిఎం నేతలు ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటూ తమ పోటీ ప్రాధాన్యతను వివరిస్తున్నారు.

ఎ.పి లో ప్రజారక్షణ భేరి

ఇదే సమయంలో ఎ.పి లో ఎన్నికలు లేకున్నా రాజకీయ వివాదాలు, కేసులు తీవ్రంగానే నడుస్తున్నాయి. పాలక వైసిపి, టిడిపిలు నిరంతరం ఈ తగాదాలలోనే మునిగి తేలుతూ నిజమైన సమస్యలను, కేంద్రం చేసిన అన్యాయాలను గాలికి వదిలేస్తున్నాయి. బిజెపి ఎన్‌డిఎ కూటమిలో భాగస్వామిగా వున్న జనసేన ఎ.పి లో మాత్రం టిడిపితో పొత్తు ప్రకటించింది. ఆ రెండు పార్టీల మధ్య రెండు దఫాలు చర్చలు జరిగాయి గాని సమస్యలపై కార్యాచరణ మాత్రం మొదలైంది లేదు. మరోవంక వైసిపి సామాజిక సాధికార యాత్రల తతంగం మొదలెట్టింది. తామే సామాజిక న్యాయానికి ప్రతిరూపమని పథకాల గురించి చెప్పుకుంటున్నది. నిజానికి ఈ సామాజిక సాధికారత నేతి బీరకాయలో నెయ్యి లాంటిదని సిపిఎం నాయకులు నిశితంగా విమర్శ చేస్తున్నారు. దళితులు, గిరిజనులు, వెనకబడిన వర్గాలు మహిళల రక్షణలో వైఫల్యాన్ని తాజా ఘటనలతో సహా వారు ప్రజల ముందు ప్రస్తావించారు. రైతులు, ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగుల సమస్యలను ఎలుగెత్తి చాటారు. పోలవరం నిర్వాసితుల సమస్యలనూ రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం వెనకబడిన ప్రాంతాల వెతలను వినిపించారు. ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలన్నారు. అమరావతిలో రాజధాని కొనసాగించాలని కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలపై పోరాడకుండా మోడీ ఆదేశాల మేరకు అదానీకి వనరుల ధారాదత్తం చేస్తున్న ప్రభుత్వ వైఖరిపై ధ్వజమెత్తారు. బిజెపి పట్ల టిడిపి వైఖరి ఏమిటో స్పష్టం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. కేంద్రం వివక్షనూ, దీర్ఘకాలిక సమస్యలను, మౌలికాంశాలను పక్కకు నెట్టి పరస్పర వివాదాలకే పరిమితమై మోడీకి మూడు ప్రాంతీయ పార్టీలూ బిజెపితో మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకున్నాయని సిపిఎం కార్యదర్శి శ్రీనివాసరావు సూటిగానే చెప్పారు. ఒక్క విషయంలోనైనా బిజెపి మతతత్వాన్ని, కేంద్ర నిరంకుశత్వాన్ని ప్రశ్నించడానికి ఈ పార్టీలేవీ సిద్ధం కాని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రయోజనాల రక్షణ కోసం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం సిపిఎం రాష్ట్రవ్యాపితంగా నిర్వహించిన ప్రజా రక్షణ భేరి ప్రాధాన్యత సంతరించుకుంది. ఒక ప్రత్యామ్నాయ రాజకీయ భావనను, పోరాట సందేశాన్ని ప్రజల ముందుంచింది. ఎక్కడికక్కడ ప్రజలు వామపక్ష వాదులు సమాదరించడం ఒక చర్చకు ప్రారంభ వాక్యమైంది. వివిధ ప్రాంతాల నుంచి మొదలైన ఈ యాత్రలు ముగింపుగా విజయవాడకు చేరుకుంటున్నాయి. నవంబరు 15న జరిగే భారీ బహిరంగ సభ ప్రదర్శనలు ఈ యాత్రలకే గాక రాష్ట్రంలో ఒక భిన్నమైన రాజకీయ చర్చకు, పునస్సమీకరణకూ నాంది పలికితే అది శుభసూచకమవుతుంది. రెండు రాష్ట్రాలలోనూ ఆయా పార్టీల అవకాశవాద పోకడలకు భిన్నంగా ఎన్నికలలోనూ ఉద్యమాలలోనూ సిపిఎం విలక్షణ పంథా అనుసరించడం అభినందనీయం. ప్రజలు ఈ ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తారని, అన్ని వామపక్ష, ప్రజాస్వామిక శక్తులు, సామాజిక తరగతులూ తోడవుతారని ఆశించాలి.

★

గ్రంథాలయాలను మరిచిన పాలకులు

సందర్భం

గ్రంథాలయ వ్యవస్థ స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ప్రారంభమైన గ్రంథాలయ ఉద్యమం నుండి పుట్టింది. ప్రభుత్వ విధానాల మూలంగా ఆ వ్యవస్థ నేడు నిర్వీర్యమైపోతోంది. రాష్ట్రం విడిపోయిన తర్వాత రాష్ట్రంలో కేంద్ర గ్రంథాలయం లేకుండా పోయింది. పౌర గ్రంథాలయాల రాష్ట్ర కార్యాలయాన్ని మంగళగిరి లోని ఒక శాఖా గ్రంథాలయంలో నడుపుతున్నారు. గ్రంథాలయాలలో రిక్రూట్‌మెంట్‌పై ఆంక్షలు విధిస్తూ 1975లో ప్రభుత్వం జీవో ఇచ్చింది. 1986లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా వున్న సమయంలో ఆంక్షలు సడలిస్తూ కొంత రిక్రూట్‌మెంట్ జరిగింది. కానీ ఇప్పటికీ నియామకాలపై ఆంక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వాలు ఎన్ని మారినా సిబ్బంది నియామకాలపై ఆంక్షలు తొలగించలేదు. రాష్ట్రంలో మంజూరైన 1735 పోస్టులకు గాను ప్రస్తుతం కేవలం 723 రెగ్యులర్ సిబ్బంది మరో 216 ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో గ్రంథాలయాలు పనిచేస్తున్నాయి. ఒక్కో లైబ్రేరియన్ రెండు మూడు గ్రంథాలయాలు నడుపుతున్నారు. కొన్ని గ్రంథాలయాలలో స్వీపర్లు లైబ్రేరియన్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గ్రంథాలయాల్లో 1012 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నాలుగు సంవత్సరాల 5 నెలల కాలంలో ప్రస్తుత ప్రభుత్వం ఒక్క నియామకం కూడా చేయకపోవడాన్ని బట్టి గ్రంథాలయాల పట్ల ప్రభుత్వ వైఖరి స్పష్టం అవుతున్నది. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో నిరుద్యోగులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారు అందుకు గ్రంథాలయాలనే ఉపయోగించుకుంటున్నారు. కానీ అత్యధిక గ్రంథాలయాలలో చదువరులకు కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. సరైన వసతి, ఫర్నిచర్, పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు.

ఇంటర్నెట్ విస్తరిస్తున్న నేపథ్యంలో గ్రంథాలయాలకు భవిష్యత్తు లేదనే వాదన కొంతమందిలో ఉన్నా అది సరైనదని అనుకోలేం. ఎందుకంటే పరిపూర్ణమైన జ్ఞానం, అవగాహన రావాలంటే ఈనాటికీ పుస్తకానికి ప్రత్యామ్నాయం లేదనే అభిప్రాయాన్ని అనేకమంది మేధావులు వ్యక్తం చేస్తున్నారు అది వాస్తవం కూడా. గ్రంథాలయాల నిర్వహణకు ప్రధాన వనరు గ్రంథాలయ సెస్సు మాత్రమే.పౌరులు చెల్లిస్తున్న ఇంటి పన్నులో ఎనిమిది శాతం గ్రంథాలయాలకు సెస్సు రూపంలో చేరాలి. కానీ వసూలు చేస్తున్న సొమ్ము కార్పొరేషన్లు, స్థానిక సంస్థలు...జిల్లా గ్రంథాలయ సంస్థలకు చెల్లించకుండా మొండికేస్తున్నాయి. ఉదాహరణకు విశాఖపట్నం కార్పొరేషన్ సుమారు రూ.100 కోట్లు బకాయి పడింది. అంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థంచేసుకోవచ్చు. తమిళనాడు, కేరళ లాంటి పొరుగు రాష్ట్రాలు గ్రంథాలయాల పట్ల చూపిస్తున్న శ్రద్ధలో కనీసం గానైనా మన ప్రభుత్వాలు చూపించకపోవడం అన్యాయం. ఇంకో విచిత్రమైన పరిస్థితి ఏమిటంటే ఒకే డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న ఒకరికి ఒక న్యాయం మరొకరికి ఇంకో న్యాయం అన్నట్టు గ్రంథాలయాల సిబ్బంది పట్ల ప్రభుత్వం వివక్ష చూపిస్తున్నది. లైబ్రేరియన్‌గా చేసి ప్రమోషన్ పై జిల్లా అధికారి (కార్యదర్శి) అయిన వారికి 010 పద్దు కింద జీతాలు, సదుపాయాలు కలగజేస్తూ మిగిలిన వారికి లేకుండా చేయడం బాధాకరం. 5000 జనాభాకు ఒక గ్రంథాలయం ఉండాలని గ్రంథాలయ చట్టం చెబుతున్నా ఆచరణలో అమలు కాలేదు సరికదా ఉన్న గ్రంథాలయాలు మూసివేసే పరిస్థితి దాపురించడం బాధాకరం. ఈ వారోత్సవాల (నవంబర్ 14 నుండి 20 వరకు) సందర్భంగానైనా గ్రంథాలయాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని పౌరులు, చదువరులు, విద్యార్థులు, మేధావులు కోరుతున్నారు.

- కె. త్రిమూర్తులు,
జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు.

బ్యాంక్ ఆఫ్ బరోడా ఉదంతం కనువిప్పు కావాలి

వ్యాఖ్య

'బ్యాంక్ ఆఫ్ బరోడా' ఇటీవల తన యాప్‌కు కస్టమర్ల ఖాతాలను జోడించేందుకుగాను సిబ్బందికి టార్గెట్లు ఇచ్చింది. సిబ్బంది అప్పుడు కస్టమర్ల ఫోన్ నెంబర్లకు బదులుగా వేరే నెంబర్లను జత చేశారు. ఫలితంగా ఖాతాదారులకు తెలియకుండానే వారి డబ్బు మాయమైంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోకి ప్రైవేటు రంగ సంస్కృతిని ప్రవేశపెట్టటం దీనికి కారణం.

ప్రభుత్వ రంగ సంస్థలను జవహర్‌లాల్ నెహ్రూ ఆధునిక దేవాలయాలుగా పేర్కొన్నారు. తమ యజమానుల లాభాల కోసం మాత్రమే పనిచేస్తున్న 14 ప్రైవేటు బ్యాంకులను ఇందిరా గాంధీ 1969లో జాతీయం చేశారు. ఆ తరువాత మరో 8 ప్రైవేటు బ్యాంకులు 1980లో జాతీయం అయ్యాయి. జాతీయాకరణ వలన ప్రజల పొదుపు దేశ ప్రణాళికలకు, అభివృద్ధికి ఉపయోగపడింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు వెనుకబడిన ప్రాంతాలకు, మారుమూల గ్రామాలకు విస్తరించాయి. లక్షలాది మందికి వీటిలో ఉద్యోగాలు వచ్చాయి. బలహీన వర్గాలకు కూడా వీటిలో సేవలు అందాయి.

సరళీకరణ విధానాల ప్రవేశంతో...

సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు వచ్చిన తదుపరి ప్రజావ్యతిరేక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వ రంగాన్ని బలహీనపర్చడం మొదలైంది. ప్రత్యేకించి ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఫైనాన్స్ రంగంపై పెద్ద ఎత్తున దాడి జరుగుతోంది. ప్రపంచ ఫైనాన్స్ పెట్టుబడుల సిఫార్సులను ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో అమలు చేస్తున్నారు. మొండి బకాయిలకు తగినంత స్థాయిలో పెట్టుబడులను పెంచుకోవాలనే నిబంధనలను ప్రవేశపెట్టారు. కానీ పశ్చిమ దేశాలలో ఇటువంటి నిబంధనలను అమలు చేస్తున్నప్పటికీ అక్కడి బ్యాంకులు విఫలం అవుతున్నాయనే వాస్తవాన్ని విస్మరించి ఇక్కడి బ్యాంకుల్లో వాటిని ప్రవేశపెట్టారు. బడా కార్పొరేట్ కంపెనీలు ఎగ్గొట్టిన బకాయిల స్థానంలోకి బ్యాంకుల లాభాలను, పెట్టుబడులను మళ్ళిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ బ్యాంకులకు అవసరమైన పెట్టుబడులను బడ్జెట్ నుండి సమకూర్చటం మానేసింది. మార్కెట్ నుండి సమీకరించుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలు ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణకు దారితీస్తోంది. దేశంలో పోటీని ప్రోత్సహించాలనే పేరుతో వాణిజ్య బ్యాంకులు, చెల్లింపు బ్యాంకులు, చిన్న చిన్న ఫైనాన్స్ బ్యాంకులకు లైసెన్స్‌లను విచ్చలవిడిగా ప్రైవేటు పెట్టుబడులకు ఇచ్చారు. వివిధ రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వ రంగంలో అభివృద్ధి బ్యాంకులను ఏర్పాటుచేశారు. తదుపరి కాలంలో వాటిని మూసివేసి వాటి వ్యాపారాలను ప్రైవేటు వాణిజ్య బ్యాంకులకు బదిలీ చేశారు. మౌళిక రంగాలకు ఇచ్చే దీర్ఘకాలిక రుణాల భారాన్ని ప్రభుత్వ రంగ వాణిజ్య బ్యాంకులపై మోపారు. బడా పెట్టుబడిదారులు దీంతో లాభపడి బ్యాంకు రుణాలను ఎగ్గొట్టారు. నష్టం ప్రభుత్వ బ్యాంకులకి, లాభం ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకుగా మారింది.

కేంద్ర ప్రభుత్వ సంస్కరణల ఎజెండాను ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రవేశపెట్టారు. ఖర్చులు తగ్గించుకోవాలని, లాభాలు పెంచుకోవాలని నూరిపోశారు. లక్షలాది మంది బ్యాంకు అధికారులు, ఉద్యోగులను విఆర్‌ఎస్ పై బయటికి పంపారు. నష్టాలు వస్తున్నాయనే పేరుతో బ్యాంకు శాఖలను మూసి వేస్తున్నారు. బ్యాంకులను విలీనం చేయటం వలన కూడా శాఖలు మూత పడుతున్నాయి. కొద్ది మంది సిబ్బంది అధిక పని భారాన్ని మోస్తున్నారు. బ్యాంకుల వ్యాపారాభివృద్ధికి తమ అధికారులు, సిబ్బంది, ఎగ్జిక్యూటివ్‌లను ఉపయోగించు కోకుండా ప్రైవేటు కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులను నియమిస్తున్నారు. వారికి బ్యాంకు నిధులను దోచిపెడుతున్నారు. వ్యాపారం, లాభాల విషయంలో సాధించలేని టార్గెట్ల భారాన్ని బహుళజాతి కంపెనీల ప్రైవేటు కన్సల్టెంట్లు మోపుతూ వాటిని సాధించాలని ఒత్తిడి తెస్తున్నారు. వీరు చేస్తున్న ప్రతిపాదనలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి.

ఇటువంటి ప్రజా వ్యతిరేక సంస్కృతికి మారటానికి ప్రభుత్వ రంగ బ్యాంకుల చైర్మన్లతో సహా పూర్తికాలం డైరెక్టర్లను ప్రైవేటు రంగం నుండి నియమించుకోవడం కారణం. బ్యాంకుల సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల స్థానాలలోకి కూడా వీరు ప్రవేశిస్తున్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడాలో ముఖ్య డిజిటల్ అధికారిగా నియమితులైన ప్రైవేటు వ్యక్తిగత కన్సల్టెంట్ అఖిల్ హాండాను బాధ్యతల నుండి తొలగించమని బ్యాంకులోని అన్ని యూనియన్ల జాయింట్ కౌన్సిల్ బ్యాంకు ఎమ్‌డీని డిమాండ్ చేసింది. వివిధ స్థాయిలలో ఉన్న బ్యాంక్ నియంత్రణా అధికారులను కూడా కాదని ఆయన తన వ్యక్తిగతంగా టార్గెట్లను విధించి శాఖల చేత బలవంతంగా అమలు చేయించటంతో బ్యాంక్ ఆఫ్ బరోడాలో విపత్కర పరిణామాలు చోటుచేసుకున్నాయి.

బ్యాంక్ ఆఫ్ బరోడా జి.ఎంలు, ఎ.జి.ఎంలతో సహా అనేక మంది సీనియర్ అధికారులను, బిజినెస్ కరస్పాండెంట్లను, కన్సల్టెంట్లను కూడా సస్పెండ్ చేశారు. బ్యాంక్ యాప్ లోకి కొత్త కస్టమర్లను కలిపే పద్ధతిలో అవకతవకలు చోటుచేసుకున్నాయని బ్యాంకు అంతర్గత సమీక్షలో తేలింది.

తప్పనిసరి పరిస్థితుల్లో ముఖ్య డిజిటల్ అధికారి (ప్రైవేటు రంగం నుండి వచ్చిన) చేత బలవంతంగా రాజీనామా చేయించారు. కానీ ఆయన చేసినటువంటి హాని వెంటనే పూడ్చలేనిది. ఇటువంటి పరిణామాలు బ్యాంక్ ఆఫ్ బరోడాకు మాత్రమే పరిమితం కాలేదు. ఇతర అనేక ప్రభుత్వ రంగ బ్యాంకులలో కూడా ఇటువంటి పద్ధతులు అమలవుతున్నాయి. వీటిపై రిజర్వ్ బ్యాంకు విచారణ జరిపి నష్ట నివారణ చర్యలు చేపట్టాలి. కేంద్ర బిజెపి ప్రభుత్వం తన ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడుల అనుకూల వినాశకర విధానాలకు స్వస్తి చెప్పాలి. ప్రజల పొదుపుకు భద్రత కల్పించాలి.

('బ్యాంక్ వర్కర్స్ యూనిటీ' సౌజన్యంతో)
/స్వేచ్ఛానుసరణ/

కిడ్నీ పరిశోధనా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి- పలాస

పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ పద్మనాభపురం సమీపంలో రూ.50 కోట్లతో నిర్మించిన 200 పడకల ఆస్పత్రితో పాటు కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వైద్యులతో కలసి శనివారంపరిశీలించారు. మంత్రిని ఆస్పత్రిలోని ప్రతి విభాగాన్నీ వైద్యులకు చూపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా జగన్మోహనరెడ్డి ఉద్దాన కిడ్నీ రోగులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. కరోనా సమయంలో రెండేళ్లు పనులు నిలిచిపోయినా, ఆస్పత్రి పూర్తి చేసేందుకు అనేక ఇబ్బందులు వచ్చినా వాటిని ఎదుర్కొన్నానని పేర్కొన్నారు. అనేక బాలరిష్టాలు అధిగమించి ఈ నెల 23న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నానని తెలిపారు. జిల్లాలో వన్నె తెచ్చే విధంగా కిడ్నీ ఆస్పత్రి సేవలు రోగులకు ఉంటాయని అన్నారు. ఈయన వెంట పలాస-కాశీబుగ్గలకు చెందిన వైద్యులు మల్లేశ్వరరావు, రాజకుమార్, భీమారావు, బాలకృష్ణ, పొందల జగదీష్, కృష్ణమూర్తి, ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్, జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, వైసిపి నాయకులు అంబటి ఆనందరావు, లక్ష్మణ్, రోణంకి శ్రీనివాసరావు, హనుమంతు రామ్మోహనదొర, అల్లు వెంకటరమణ, కొర్రాయి శ్రీకాంత్, కృష్ణలు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

దేశంలో కాంగ్రెస్ గాలి వీస్తోంది

- కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోందని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి కేంద్రంలో అధికారం చేపడుతుందని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ అన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొని, శనివారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమైన పునాది అని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలు అమలవుతాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి జరుగుతుందన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, కేంద్ర మాజీ మంత్రి అబుల్ కలాం ఆజాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో సుంకర పద్మశ్రీ, రాకేష్‌రెడ్డి, నరహరిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మోడీ మరో మోసం

ఎస్‌సి వర్గీకరణకు కొత్త కమిటీ ఏర్పాటుపై మాదిగల విశ్వరూప సభలో ప్రకటన

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాని నరేంద్ర మోడీ దళితులను మరోసారి మోసగించారు. గతంలో అనేకసార్లు చెప్పినట్లే ఎస్‌సి వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని మళ్లీ వల్లెవేశారు. మాదిగల ఉద్యమాన్ని గుర్తించామన్నారు. ఎస్‌సి వర్గీకరణకు త్వరలో కొత్తగా కమిటీ వేస్తామని ప్రకటించారు. అయితే, గతంలో ఉషా మోహతా కమిటీ ఏర్పాటు కావడం, ఆ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం తెలిసింది. ముప్పై ఏళ్ల ఉద్యమానికి పరిష్కారం చూపేలా తమకు అనుకూల నిర్ణయం ప్రకటిస్తారని ఆశతో ఎదురుచూసిన మాదిగ సామాజిక తరగతి ప్రజలు ప్రధాని ప్రసంగం విన్న తర్వాత తీవ్ర నిరాశ చెందారు. మళ్లీ అదే ముచ్చట చెప్పారంటూ పెదవి విరిచారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో శనివారం మందకృష్ణ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన ఎస్‌సి ఉపకులాల విశ్వరూప మహాసభకు ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మాదిగ విరోధులని విమర్శించారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేయాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మూడు దశాబ్దాల మాదిగల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నానని తెలిపారు. మాదిగలు అంతా వన్ లైఫ్, వన్ మిషన్‌లా పోరాటం చేస్తున్నారని, వారి ఉద్యమాన్ని గౌరవిస్తున్నామని అన్నారు. మందకృష్ణ ఆశయాలకు అనుగుణంగా కలిసి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఎస్‌సి వర్గీకరణ పోరాటంలో న్యాయం ఉందన్నారు. మాదిగల హక్కుల సాధనకు త్వరలోనే కమిటీ వేసి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దళిత నేతను సిఎం చేస్తామని బిఆర్ఎస్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కెసిఆర్ ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్నారన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వలేదని, బిఆర్ఎస్ నేతలకే దళితబంధు దక్కిందని విమర్శించారు. ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వంతో కలిసి బిఆర్ఎస్ నేతలు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అవకాశవాద రాజకీయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మందకృష్ణ మాట్లాడుతూ దేశాన్ని కాపాడే విషయంలో, దేశాన్ని అభివృద్ధి చేసే విషయంలో ప్రధాని మోడీని మించిన నాయకుడు లేరన్నారు.

మోడీ సభా వేదికపైకి వస్తున్న సమయంలో మందకృష్ణ భావోద్వేగానికి గురవ్వగా... మోడీ ఆయనను ఓదార్చారు. సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి ఒబిసి మోర్చా అధ్యక్షులు డా.కె.లక్ష్మణ్, ఎంఆర్‌పిఎస్ నేతలు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఎన్ని రోజులైనా పోరాటం కొనసాగిస్తాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖ)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని పార్లమెంటు సాక్షిగా ప్రధాని మోడీ ప్రకటన చేసేవరకు ఎన్నిరోజులైనా పోరాటం చేస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 1003వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ సిఎంఎం, సిఆర్‌ఎంపి, సిఎంఇ, లూబ్రికెంట్, హైడ్రాలిక్స్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, నాయకులు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న పోరాటాలను ఉక్కుపాదంతో అణచి వేయడానికి ప్రయత్నిస్తోన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు.

రాబోవు కాలంలో కార్మికులే ఉద్యమాలను కొనసాగిస్తూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడుకోడానికి నడుము బిగించాలని కోరారు. దీక్షల్లో జి.శ్రీను, ఎస్‌వి.చిన్నంనాయుడు, సంజీవరావు, వాసు, బివిఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

దళిత శ్మశానాల కోసం స్థలాలు లేని గ్రామాలెన్నో..!

- ప్రభుత్వానికి పెరుగుతున్న వినతులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా నేటికీ రాష్ట్ర వ్యాప్తంగా వందలాది గ్రామాల్లో దళితులకు శ్మశానాలు లేవు. ప్రత్యేకంగా శ్మశాన వాటికలు లేని అనేక గ్రామాల్లో, దళిత వాడల్లో ఎవరైనా చనిపోయిన సమయాల్లో దహన సంస్కారాల కోసం గొడవలు పడుతున్న సందర్భాలు లేకపోలేదు. ప్రత్యేకంగా శ్మశానాల కోసం స్థలాలు కేటాయించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), దళిత సంఘాలు ఆందోళనలు, ప్రదర్శనలు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడో ఒకచోట నిర్వహిస్తూనే ఉన్నాయి. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు ఉన్నప్పటికీ పాలకులు దళితుల శ్మశాన వాటికల కోసం ఖర్చు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాధారణ ఎన్నికలకు కేవలం ఆరు నెలలు సమయం మాత్రమే ఉండటంతో దళితుల్లో వ్యతిరేకత రోజురోజుకూ పెరుగుతోందని గ్రహించిన ప్రభుత్వం స్థలాల కేటాయింపునకు పూనుకుంది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో కూడా దళిత శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దళిత శ్మశాన వాటికలు లేని గ్రామాలెన్ని? స్థలాలు కేటాయింపు అవసరం లేని గ్రామాలెన్ని ? దళితులు తక్కువగా ఉన్న గ్రామాలెన్ని? అనే అంశాలపై రెవెన్యూశాఖ లెక్కలు తీసింది. ప్రజా సంఘాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలంటే ఎంత స్థలం కావాలనే అంశంపై ఆశాఖ అధ్యయనం చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 1550 గ్రామాల్లో దళితులకు అత్యవసరంగా శ్మశానాలకు స్థలాలు కేటాయించాలని భావించింది. ఆయా గ్రామాలకు సంబంధించి మొత్తమ్మీద 950 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఒక్కో శ్మశాన వాటికకు స్థానికంగా లభ్యమయ్యే భూ విస్తీర్ణాన్ని బట్టి అరెకరం నుంచి ఎకరా వరకు ఇచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అత్యధికంగా అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో 150 నుంచి 250 గ్రామాలకు శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించేలా అధికారులు ఫైల్స్ సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

పాలస్తీనాపై దాడి అమానుషం

ప్రజాశక్తి-యంత్రాంగం

నెల్లూరు నిరసన ప్రదర్శన చేస్తున్న వామపక్షాల నాయకులు

పాలస్తీనా భూభాగంపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని నిరసిస్తూ సిపిఎం, సిపిఐ, న్యూ డెమోక్రసీ, పౌరహక్కుల సంఘం, సిపిఐ ఎంఎల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శనలు చేపట్టారు. నెల్లూరులో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ మీదుగా విఆర్‌సి సెంటర్‌లోని డాక్టరు బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద సభ నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ.. ఇజ్రాయిల్ చేస్తున్నటువంటి దురాక్రమణను భారత ప్రభుత్వం ఖండించకపోవడం దారుణమన్నారు. శాంతి చర్చలు నిర్వహించేందుకు యుఎన్‌ఒ ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ.. యుఎన్‌ఒ, ప్రపంచ అలీన దేశాల చొరవతో 1967లో పాలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లఘించిందన్నారు. ఇప్పటికే పాలస్తీనాకు చెందిన 70 శాతం భూభాగాన్ని ఆక్రమించిందని తెలిపారు. సిపిఐ నగర కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పౌరహక్కుల సంఘం నాయకులు అబ్బయ్యరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, సిపిఐ సీనియర్ నాయకులు రామరాజు, న్యూ డెమోక్రసీ (సిపిఐ ఎంఎల్) నాయకులు రాంబాబు, పౌరహక్కుల సంఘం నాయకులు ఎల్లంకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు శంకర్‌విలాస్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ (రెడ్‌స్టార్) పొలిట్ బ్యూరో సభ్యులు మన్నవ హరిప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, సిపిఐ కార్యదర్శి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. నందాల్య జిల్లా శ్రీశైలం మండలం సున్నిపెంటలోని కాకుల సెంటర్‌లో నిరసన తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు చిన్న మారాన్న, తదితరులు పాల్గొన్నారు.

చేతికొచ్చిన పంట చేజారేనా..!

- చి'వరి' దశలో అందని సాగునీరు
- అడుగంటిని పంట కాలువలు
- ఎండుతున్న వరి పంటలు ఆందోళనలో రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి (ఏలూరు)

అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వర్షాభావంతో చేతికొచ్చిన పంట చేజారిపోతోంది.. పంట చేతికొచ్చే సమయాన సాగునీరందక అన్నదాతలు విలవిల్లాడుతున్నారు. పాలకుల, అధికారుల అనాలోచిత నిర్ణయాలతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల శివారు పంటలకు నీరందక పంటభూములు నిలువెల్లా బీటలు వారడంతో దిక్కుతోచని స్థితిలో రైతులున్నారు. మునుపెన్నడూ లేని విధంగా మండలంలో సాగునీరందక రైతులు అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అధికారులు, పాలకులు తమపై దయచూపాలని మండల రైతాంగం చేతులెత్తి అధికారులను వేడుకుంటోంది. ముదినేపల్లి మండల రైతుల అనేక ఆటుపోట్ల మధ్య ఈ ఏడాది ఖరీఫ్ సాగు చేపట్టారు. అయితే సాగు ఆది నుండి రైతన్న ఆటుపోట్లకు గురయ్యాడు. తీవ్ర వర్షాభావం, ఎండల కారణంగా వేసిన పైరు ఎండిపోయి, వెదజల్లిన విత్తనాలు మొలకెత్తక రైతన్న అనేక పాట్లు పడ్డాడు. దీంతో రెండు, మూడు దఫాలుగా నాట్లు వేయడం, విత్తనాలు వెదజల్లారు. ప్రస్తుతం వరిచేలు చిరుపొట్ట, ఈనిక దశల్లో ఉన్నాయి. ఈ దశలో సరిపడు సాగునీరు చాలా అవసరమని రైతులు చెబుతున్నారు. కాలువల ద్వారా నీరు పుష్కలంగా రాకపోవడంతో పాటు, వంతులవారీ విధానం కారణంగా మండలంలోని శివారు భూములకు నీరందకపోవడంతో చేలు

సాగునీరు అందక ఎండిపోతున్న వరిచేను

ఎండిపోతున్నాయి. దీంతో మండలంలోని అనేక గ్రామాల రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలవ్యాప్తంగా సుమారు 15 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. అయితే 12 గ్రామాల్లో సాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో ఆయా గ్రామాల్లో చేలు ఎండిపోతున్నాయి. దీంతో పంట దిగుబడులు తగ్గిపోతాయంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలవ్యాప్తంగా రెండు వేల ఎకరాలకు పైబడి నీటి ఎద్దడి ఏర్పడినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కాలువల ద్వారా అరకొరగా నీరు రావడంతో ఆక్వా రైతులు ఇంజన్ల ద్వారా చేపల చెరువులకు ఆ నీటిని మళ్లిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో శివారు భూములకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వణుదుర్రు, దేవపూడి, ఈడేపల్లి, కొరగంటపాలెం, పొద్దువాక, వైవాక, వాడవల్లి, కోడూరు, చిన పాలపర్రు, చిగురుకోట, పెదకామనపూడి, గురజ, ముదినేపల్లి, బొమ్మినంపాడు, సింగరాయపాలెం తదితర గ్రామాల్లో ఖరీఫ్ సాగుకు నీటి సమస్య ఏర్పడింది. సాగునీటి ఎద్దడి కారణంగా చేతికి వచ్చిన వరిచేలు కళ్లెదుటే ఎండిపోవడంతో ఏమి చేయాలో పాలుపోక మండల రైతులు అయోమయ పరిస్థితిలో పడ్డారు. జల వనరుల శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేసి పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

చంద్రమోహన్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

తదితరులు సంతాపం ప్రకటించారు.

సిపిఎం సంతాపం

చంద్రమోహన్ మృతి పట్ల సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు చిత్ర రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. చంద్రమోహన్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కళారంగానికి తీరనిలోటు : పిఎన్‌ఎం

చంద్రమోహన్ మృతి సినీ, కళారంగానికి తీరని లోటని ప్రజా నాట్యమండలి ఎపి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మంగరాజు, అనిల్ సంతాపం తెలిపారు. వందలాది సినిమాల్లో వైవిధ్య భరితమైన పాత్రలు పోషించారని పేర్కొన్నారు.

పమిడిముక్కలలో విషాదఛాయలు

సినీనటుడు మల్లంపల్లి చంద్రమోహన్ మృతితో కృష్ణా జిల్లా పమిడిముక్కలలో విషాద ఛాయలు అలముకున్నాయి. పమిడిముక్కలలో జన్మించిన ఆయన మేడూరు పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. ఉద్యోగం చేస్తూ సినీ పరిశ్రమకు వెళ్లారు. మేడూరు, పమిడిముక్కల గ్రామాలకు ఆయన తరచూ వస్తుండేవారు. టివిలు అంతగాలేని ఆ రోజుల్లో చంద్రమోహన్ సినిమా విడుదలప్పుడు ఆయన బంధువులు వీరంకిలాకు వచ్చి సినిమా చూసి వెళ్లేవారు. గ్రామంలో పలువురు పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు ఆయన తప్పకుండా వచ్చేవారు. చంద్రమోహన్ మృతిపట్ల పమిడిముక్కల గ్రామ సర్పంచ్ ముళ్లపూడి సునీత సంతాపం తెలిపారు. ఆయనతో కలిసి మేడూరులో చదువుకున్న దేవరపల్లి సుబ్బారావు, మాస్టర్ బండ్లపల్లి ఏబు, పాతూరు చంద్రపాల్, గోపాల కృష్ణాపురం అప్పయ్యదాస్ తదితరులు చంద్రమోహన్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్ల కుమార్ రాజా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

యుసిసి అమలుకు సిద్ధమైన ఉత్తరాఖండ్

డెహ్రాడూన్ : వివాదాస్పద ఏకరూప పౌర స్మృతి (యుసిసి)ని అమలు చేసేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం సిద్ధమైంది. యుసిసి ముసాయిదాను ప్రవేశపెట్టేందుకు త్వరలో రాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు శనివారం సంబంధిత వర్గాలు తెలిపాయి. ముసాయిదా బిల్లులో బహుభార్యత్వాన్ని పూర్తిగా నిషేధించాలని కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. సహజీవనం చేయాలనుకునే వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్న నిబంధన పెట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

'మోడీ దేశ ద్రోహి.. అసమర్ధ నాయకుడు'

- ప్రధాని సభలో ఒయు విద్యార్థిని నిరసన

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

'మోదీ దేశ ద్రోహి. అసమర్ధ నాయకుడు' అంటూ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిని, వనపర్తి జిల్లాకు చెందిన కవిత శనివారం పరేడ్ మైదానంలో జరిగిన మాదిగల విశ్వరూప సభలో తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. కరెంట్ స్థంభం ఎక్కి పెద్దగా నినాదాలు చేయడంతో కాసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆమె దిగాలని ప్రధాని మోడీ స్వయంగా సూచిస్తూనే మరోవైపు తన ప్రసంగాన్ని కొనసాగించారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఆమెను బలవంతంగా కిందకు దించారు. అయినా, కవిత తన నిరసనను ఆపలేదు. మీడియా అంతా ఆమె చుట్టూ పోగవ్వడంతో పోలీసులు కూడా ఆమెను ఏమీ అనలేకపోయారు. 'మోడీ పాలన వచ్చాక దేశంలో కులమతాల పేరిట విద్వేషాలు పెరిగిపోయాయి. దేశంలో రోజుకో చోట యువతులపైనా, చిన్నారులపైనా అత్యాచారాలు జరుగుతున్నాయి. ఎక్కడ చూసినా హత్య, హత్యాచారాలు జరుగుతున్నాయి. బాధితులకు న్యాయం కూడా జరగట్లేదు. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ధర్మం కరెక్టుగా ఉండి ప్రభుత్వం సరిగా పనిచేస్తే ఇలా జరుగుతుందా? సహజీవన చట్టం చేయడమేంటి? మన దేశం ఎటుపోతున్నది? ముస్లింలు, క్రైస్తవులు చనిపోతున్నారు. మనుషులమంతా ఒక్కటే. ఈ చీలికలేంటి? ఒకే మతాన్ని ఎందుకు ప్రోత్సహిస్తున్నారు? ఓ వైపు దేశంలో ధరలు పెరిగిపోతున్నాయి. మరోవైపు యువతకు ఉద్యోగాలు లేవు ఉన్న ఉద్యోగాలు పోతున్నాయి. బతికేదెట్టా? దేశం ఇలా ఉంటే మోడీ సమర్ధ నాయకుడు ఎలా అవుతాడు? ఆయన అసమర్ధ నాయకుడు' అంటూ నిరసన గళాన్ని వినిపించింది. దళితులను రాజకీయంగా వాడుకోవడానికే సభ పెట్టారని ఆరోపించింది. ఆమెను మీడియాతో మాట్లాడనీయకుండా ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు.

ఈస్టర్న్ ఫ్లీట్ కమాండ్ కమాండింగ్ అధికారిగా రాజేష్ ధన్‌కర్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ

ఈస్టర్న్ ఫ్లీట్ కమాండ్ కమాండింగ్ అధికారిగా రియర్ అడ్మిరల్ రాజేష్ ధన్‌కర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆ స్థానంలో పనిచేస్తున్న రియర్ అడ్మిరల్ గురుచరణ్ సింగ్ నుంచి బాధ్యతలు తీసుకునానరు. నేవల్ డాక్ యార్డులో గార్డుల మార్పు కార్యక్రమం జరిగింది. రియర్ అడ్మిరల్ రాజేష్ ధన్‌కర్ 1990 జులై 1న భారత నావికాదళంలో నియమితుతయ్యారు. నావిగేషన్, డైరెక్షన్లో ఆయన నిపుణుడు.

రష్మిక ఫేక్ వీడియా కేసు

మెటా, ఇతర సైట్ల నుంచి వివరాల సేకరణ

న్యూఢిల్లీ : ప్రముఖ హీరోయిన్ రష్మికకు సంబంధించిన ఓ ఫేక్ వీడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఫేక్ వీడియోపై ఢిల్లీ పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై కేసు నమోదు చేశారు. తాజాగా ఆ వీడియో ఏ అకౌంట్ నుంచి తొలుత అప్‌లోడ్ అయ్యిందో దానికి సంబంధించిన యూఆర్ఎల్ వివరాలు అందజేయాలంటూ ఫేస్‌బుక్ మాతృసంస్థ 'మెటా'కు లేఖ రాశారు. అలాగే ఇతర సైట్ల నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నారు. ఆ నకిలీ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసినవారి వివరాలు కూడా కోరినట్లు సమాచారం. 'వీడియో ఎక్కడి నుంచి జనరేట్ అయ్యిందో ఆ అకౌంట్‌కు సంబంధించిన యూఆర్ఎల్ ఐడీ వివరాల కోసం మెటాకు లేఖ రాశాం' అని ఒక పోలీసు అధికారి వెల్లడించారు. ప్రత్యేక అధికారుల బృందం ఈ కేసును దర్యాప్తు చేస్తోందని, త్వరలోనే దీన్ని ఛేదిస్తామని తెలిపారు. ఈ వీడియోకు సంబంధించి ఢిల్లీ మహిళా కమిషన్ కూడా పోలీసులకు నోటీసు పంపింది. ఈ చర్యకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ వీడియోపై రష్మిక సైతం ఆవేదన వ్యక్తం చేశారు.

చట్టసభల్లో కమ్యూనిస్టులుండాలి

(మొదటి పేజీ తరువాయి)

పుంజుకుందన్నారు. కెసిఆర్ వైఖరి మారడానికి ఇదో కారణమన్నారు.

కుట్రపూరితంగా వ్యవహరించిన కాంగ్రెస్

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి ఠాక్రే తనకు స్వయంగా ఫోన్ చేసి ఈ ఎన్నికల్లో కలిసి పనిచేద్దామన్నారని తమ్మినేని గుర్తు చేశారు. ఆ తర్వాత కుట్ర పూరితంగా ఆ పార్టీ వ్యవహరించిందని విమర్శించారు. ఖమ్మంలో సిపిఎం ఉనికినే ప్రశ్నార్థకం చేయాలనుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు బలమున్న ఖమ్మం, నల్లగొండలో సీట్లు ఇవ్వకుండా కాంగ్రెస్‌కు సహకరించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. తమ ప్రాధాన్యత పదవులు కాదనీ, ప్రజలని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ వైఖరి వల్లే పొత్తులు విఫలమయ్యాయని విమర్శించారు. అనివార్య పరిస్థితుల్లోనే 19 స్థానాల్లో స్వతంత్రంగా పోటీ చేస్తున్నామని వివరించారు. సిపిఎం అభ్యర్థులను గెలిపించాలనీ, అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ప్రజల గొంతును వినిపించాలంటే కమ్యూనిస్టులకు చట్టసభల్లో ప్రాతినిధ్యముండాలని చెప్పారు. వామపక్ష ఐక్యతలో భాగంగా కాంగ్రెస్‌తో పొత్తున్నా కొత్తగూడెంలో సిపిఐకి తాము మద్దతు ఇస్తున్నామని వివరించారు. ఇతర వామపక్షాలకు, బిఎస్‌పి, పోరాడే శక్తులు, లౌకిక వాదులకు మద్దతిస్తామని చెప్పారు. అనంతరం విలేకర్లు అడిగిన పలు ప్రశ్నలకు తమ్మినేని సమాధానమిచ్చారు. బిఆర్ఎస్‌కు మేలు చేయడం కోసమే తాము స్వతంత్రంగా పోటీ చేస్తున్నామన్న అభిప్రాయం తప్పు అని అన్నారు. బిఆర్ఎస్‌కు మేలు చేయడం కోసం పొత్తు కుదరకుండా కొందరు కాంగ్రెస్ నాయకులు చేసి ఉండొచ్చు కదా?అని ప్రశ్నించారు. 2004లో కాంగ్రెస్‌తో పొత్తున్నా ఖమ్మం స్థానంలో అది సాధ్యం కాలేదని అన్నారు. అయితే కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం పోటీ చేస్తే తాను గెలిచానని చెప్పారు. రేపు పాలేరులోనూ ఇదే జరగబోతుందన్నారు. టియుడబ్ల్యుజె ప్రధాన కార్యదర్శి కె విరాహత్‌అలీ వేదికపైకి నాయకులను స్వాగతించారు.

ముస్లిముల సాధికారతే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఉండగా నవంబరు 11ను మైనార్టీ దినోత్సవంగా ప్రకటించారని, దాన్ని కూడా జరుపుకుంటున్నామని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత మైనార్టీలకు మంత్రి పదవులు ఇచ్చామని, ఎమ్మెల్సీలుగా నియమించామని తెలిపారు. నామినేటెడ్ పదవుల్లోనూ మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చామని వివరించారు. భారతదేశం ఏడు అడుగుల ఇంద్రధనస్సు అని అనేక రాష్ట్రాలు, భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు, కులాలు, అభిప్రాయాలు ఉన్నా, అందరం కలిసికట్టుగా ఉంటున్నామని తెలిపారు. అదే మనబలమని చెప్పారు. అల్పసంఖ్యాకంగా ఉన్నవారికి అండగా నిలబడటం, అన్నదమ్ముల ఆత్మీయతను పెంచడం అందరికీ బలమని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన 53 నెలల కాలంలో దేశంలో ఎప్పుడూ జరగని విధంగా, రాష్ట్రంలో ముందెన్నడూ జరగని విధంగా పాలన చేస్తున్నామని తెలిపారు. నాలుగేళ్ల కాలంలో రూ.2.40 లక్షల కోట్లు అక్క చెల్లెమ్మల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. గతంలో పాలకులు ఇలా ఎందుకు చేయలేదో ఆలోచించాలని కోరారు. లంచాలు, వివక్ష లేని పాలన చేస్తున్నామని వివరించారు. మైనార్టీల ఖాతాల్లో రూ.12,375 కోట్లు వేశామని పేర్కొన్నారు. నాన్ డిబిటి పథకాల కింద ఇళ్లస్థలాలు, విద్యాకానుక, సంపూర్ణ పోషణ వంటివి కూడా కలుపుకుంటే మరో రూ.10,800 కోట్లు, మొత్తం రూ.23,176 కోట్లు మైనార్టీ అక్క చెల్లెమ్మల ఖాతాల్లో వేశామని పేర్కొన్నారు. పిల్లల చదువులకు అండగా ఉంటున్నామని వివరించారు. ఇంగ్లీషు మీడియం, ఆరోతరగతి నుండి ఐఎఫ్‌పి డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటుచేసి స్కూళ్లను మార్పు చేస్తున్నామని పేర్కొన్నారు. ద్విభాషా పుస్తకాలు తీసుకొచ్చామని పేర్కొన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఉర్దూను రెండో అధికార భాషగా గుర్తించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మైనార్టీస్ కాంపొనెంట్ పథకం ద్వారా సబ్‌ప్లాను తీసుకొచ్చామని పేర్కొన్నారు. విజయవాడ నుండే హజ్ యాత్రను ప్రారంభించామని చెప్పారు. ప్రయాణ ఖర్చు రూ.14 కోట్లు ఎక్కువ అవుతుందంటే అది కూడా ఇచ్చామన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తుల రక్షణ కోసం జిఓ 60 జారీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బొత్సకు ఓపెన్ హార్ట్ సర్జరీ

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణకు శనివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గుండె శస్త్రచికిత్స జరిగింది. ఇటీవల శృంగవరపుకోటలో జరిగిన వైసిపి సామాజిక సాధికార బస్సుయాత్రలో ఆయన అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను విశాఖ తరలించగా, గుండె సంబంధిత సమస్య ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు చేసిన వైద్యులు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని సూచించారు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఆపరేషన్ జరిగింది. నెల రోజులు వరకు హైదరాబాద్ ఆసుపత్రిలోనే విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు తెలిసింది.

టిఆర్ఎన్‌వలసలో ఏనుగుల తిష్ట

ప్రజాశక్తి -గరుగుబిల్లి

కొమరాడ, జియ్యమ్మవలస మండలాల నుంచి తరలివచ్చిన ఏనుగులు గడిచిన కొద్ది రోజుల నుంచి గొట్టివలస, దళాయివలస పరిసర ప్రాంతాల్లో సంచరించిన ప్రస్తుతం తులసిరామినాయుడువలస సమీపాన గల మామిడి తోటను ధ్వంసం చేస్తున్నాయి. అలాగే శనివారం మధ్యాహ్నం పార్వతీపురం - గరుగుబిల్లి ఆర్ అండ్ బి రహదారి పక్కన ఏనుగులు సంచరిస్తూ ఉండడంతో వాహన చోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తులసిరామినాయుడువలస సమీపంలో గడిచిన కొద్ది రోజుల నుంచి ఏనుగులు సంచరిస్తుండంతో గ్రామస్తులు బిక్కుబిక్కు మంటున్నారు. రాత్రి సమయంలో ప్రధాన రహదారిపై ఉంటున్న ఏనుగులు తెల్లవారిన అనంతరం సమీపలోని కొండ వద్దకు, అలాగే తోటల్లోకి వెళుతున్నాయి. ఏనుగులు ప్రస్తుతం సంచరిస్తుండంతో తులసిరామినాయుడువలస, దలాయివలస, గొల్లవానివలస, తదితర గ్రామాలకు చెందిన రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి తరలించేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఒంటిరి ఏనుగుతో అప్రమత్తం

గత వారం రోజులుగా ఒడిశాలో ఉన్న ఒంటరి ఏనుగు హరి మరో రెండు రోజుల్లో తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, కావున ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో గల గ్రామాలు చాలా జాగ్రత్తగా ఉండాలని అటవీ శాఖకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. ఏడు ఏనుగుల గుంపు ప్రస్తుతం తులసీరాంనాయుడువలస వద్ద ఉందని, చుట్టుపక్కల గ్రామాలైన ద్వైవియాస, ఉద్దవోలు, బురద వెంకటాపురం, గొల్లవాని వలస, గొట్టివలస, సీమలవాణివలస, ఉల్లిభద్ర, మరిపెంట, సంభానవలస, ఈరనగుడి గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. దీపావళి సందర్భంగా ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో అధిక శబ్దాలు చేసే బాంబులను ఉపయోగించొద్దని అటవీ శాఖ గ్రామస్తులను కోరింది. రాత్రి 8 గంటల్లోపు బాణాసంచా కాల్చడం పూర్తి చేయాలని, ఈ బాంబులను ఉపయోగించి ఏనుగులను ఎవరూ ఆటపట్టించకూడదని, హాని చేయకూడదని సూచించారు. అలాగే చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

IDBI BANK **IDBI బ్యాంక్ లిమిటెడ్**
(CIN) : L65190MH2004G0I148838
గవర్నర్‌పేట బ్రాంచ్, డోర్ నెం.27-37-20, సంభవ్ ఎన్‌క్లేవ్ రాజగోపాలచారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520002

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు) రూల్ 8(1)

ఇందుమూలముగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద **IDBI బ్యాంక్ లిమిటెడ్,** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 (54 యొక్క 2002) మరియు రూల్ 3తో చదువుకోవలసిన సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసులు అందిన తేదీ నుండి 60 రోజులలోపు ఆ నోటీసులో పేర్కొనబడిన **రూ.27,95,172/- (అక్షరాలా ఇరవై ఏడు లక్షల తొంభై ఐదు వేల నూట డెబ్భై రెండు రూపాయలు మాత్రమే)** ఆపై వర్తించు వడ్డీ మరియు ఛార్జీలతో తిరిగి చెల్లించవలసిందిగా **ఋణగ్రహీత : శ్రీ కంచెర్ల నాగ రవి చంద్ర శేఖర్, తండ్రి : కంచెర్ల రాజేశ్వర రావు & శ్రీమతి కంచెర్ల అనురాధ, భర్త : కంచెర్ల నాగ రవి చంద్ర శేఖర్** వారికి **తేది.28.08.2023 న డిమాండ్ నోటీసును** జారీ చేసినారు.

ఋణగ్రహీతలు సొమ్మును సదరు సమయములోపుగా తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సదరు నిబంధనలోని నిబంధన 8 తో చదువుకోవల్సిన సదరు చట్టం 13 సబ్-సెక్షన్ (4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు **తేది.07.11.2023** న దిగువ వివరించిన ఆస్తులపై **స్వాధీనత** తీసుకున్నారు.

ముఖ్యంగా ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవరు ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తులకు సంబంధించిన ఏవిధమైన లావాదేవీలైననూ **తేది.05.11.2023 నాటికి రూ.28,40,943/-** ఆపై వర్తించు వడ్డీ మరియు ఛార్జీలతో **IDBI బ్యాంక్ లిమిటెడ్** వారి చార్జీకి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించవలెను.

స్థిరాస్తి వివరములు

(ఏ) తనఖా ఉంచిన ఆస్తి : (ఆస్తి యజమాని శ్రీ కంచెర్ల రాజేశ్వర రావు, అమ్మకపు దస్తావేజు నెం.2235/2020, రిజిస్ట్రేషన్ తేది.09.03.2020 ప్రకారం శ్రీ కంచెర్ల రాజేశ్వర రావు, తండ్రి : కె యల్లమంద చారి గారి ఆస్తి).

గుంటూరు, శ్రీనివాస రావు తోట, పాత వార్డు నెం.17, కొత్త వార్డు నెం.22, బ్లాక్ నెం.18, అసెస్‌మెంట్ నెం.36162, టిఎస్ నెం.518, డి.నెం.25-17-361 వద్ద ఉన్న 75.00 చ॥గ॥లు లేదా 62.71 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం అందుగల టైల్డ్ ఇల్లు యావత్తు ఆస్తి.
రెసిడెన్షియల్ ఇల్లు నకు హద్దులు : తూర్పు : సోమవరపు సీతా రామయ్య గారి ఆస్తి, **పడమర** : కలపాల వెంకటేశ్వర రావు గారి ఆస్తి, **ఉత్తరం** : మున్సిపల్ రోడ్, **దక్షిణం** : కంచెర్ల రాజ్యలక్ష్మి గారి ఆస్తి. దానిపై ఉన్న అన్ని నిర్మాణాలు మరియు భూమికి అనుసంధానించబడిన అన్ని వస్తువులు లేదా భూమికి అనుసంధానించబడిన ఏదైనా శాశ్వతంగా కట్టుబడి ఉంటాయి.

తేది : 07.11.2023 | అధీకృత అధికారి,
ప్రదేశం : విజయవాడ | IDBI బ్యాంక్ లిమిటెడ్

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
నందివెలుగు బ్రాంచ్, (బ్రాంచ్ కోడ్ : 21794), గుంటూరు జిల్లా

స్వాధీనత ప్రకటన
APPENDIX IV (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 రూల్ 8(1) క్రింద)

1) HTL ఖాతా నెం.62413164663, 2) Top Up ఖాతా నెం.38151890634

ఇందుమూలంగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002& సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుకోవలసిన సదరు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **భారతీయ స్టేట్ బ్యాంక్, నందివెలుగు బ్రాంచ్, గుంటూరు జిల్లా** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు నోటిసులో పేర్కొన్న బకాయి **తేది.08.03.2023** నాటికి **(1) HTL రూ.8,61,668/- (అక్షరాల ఎనిమిది లక్షల అరవై ఒక్క వేల ఆరు వందల అరవై ఎనిమిది రూపాయలు మాత్రమే), తేది.08.03.2023** నాటికి **(2) Top Up రూ.7,59,968/- (అక్షరాల ఏడు లక్షల యాభై తొమ్మిది వేల తొమ్మిది వందల అరవై ఎనిమిది రూపాయలు మాత్రమే) మొత్తం రెండు లోన్‌లకు కలిపి రూ.16,21,636/- (అక్షరాల పదహారు లక్షల ఇరవై ఒక్క వేల ఆరు వందల ముప్పై ఆరు రూపాయలు మాత్రమే)** కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీరేటు, కాస్ట్స్, ఛార్జీలు మొ॥నవి. సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత : శ్రీ కనుగోలు వెంకటేశ్వర్లు గారి కుమారుడు రాము,** ఇ.నెం.9-135, ధూళిపాళ్ల బజార్, నందివెలుగు మండలం, గుంటూరు జిల్లా, ఆంప్ర-522306 వారిని కోరుతూ **తేది.08.03.2023 న డిమాండ్ నోటీసు** జారీచేసినారు.

డిమాండ్ నోటీసు జారీ చేసిన తరువాత ఋణగ్రహీత చెల్లించిన మొత్తము **HTL రూ.77,500/- & Top Up రూ.58,800/-** మరియు ఋణగ్రహీత/హామీదారు ప్రస్తుత బకాయి **తేది.08.11.2023** నాటికి **1) HTL రూ.8,38,473/- (అక్షరాల ఎనిమిది లక్షల ముప్పై ఎనిమిది వేల నాలుగు వందల డెబ్భై మూడు రూపాయలు మాత్రమే) & తేది.08.11.2023** నాటికి **2) Top Up రూ.7,40,338/-(అక్షరాలా ఏడు లక్షల నలభై వేల మూడు వందల ముప్పై ఎనిమిది రూపాయలు మాత్రమే) మొత్తం రెండు లోన్‌లకు కలిపి రూ.15,78,811/- (అక్షరాల పదిహేను లక్షల డెబ్బై ఎనిమిది వేల ఎనిమిది వందల పదకొండు రూపాయలు మాత్రమే)** + తదుపరి జమకూడు వడ్డీ + కాస్ట్స్, ఛార్జీలు మొదలగునవి.

ఋణగ్రహీత మరియు హామిదారు సదరు ఋణాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. ఋణగ్రహీతకు/ హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్‌లో 8 & 9 తో చదివే సదరు యాక్ట్‌లోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ సంతకందారు బ్యాంకునకు తనఖా ఉంచిన దిగువ వివరించిన ఆస్తిని **ది.08.11.2023 న లాంఛనాత్మకంగా స్వాధీనం** చేసుకున్నారు.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతకు/హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరు ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తులకు సంబంధించిన ఎట్టి లావాదేవీలైనను **తేది.08.11.2023** నాటికి **1) HTL రూ.8,38,473/- (అక్షరాల ఎనిమిది లక్షల ముప్పై ఎనిమిది వేల నాలుగు వందల డెబ్భై మూడు రూపాయలు మాత్రమే) & తేది.08.11.2023** నాటికి **2) Top Up రూ.7,40,338/-(అక్షరాలా ఏడు లక్షల నలభై వేల మూడు వందల ముప్పై ఎనిమిది రూపాయలు మాత్రమే) మొత్తం రెండు లోన్‌లకు కలిపి రూ.15,78,811/- (అక్షరాల పదిహేను లక్షల డెబ్బై ఎనిమిది వేల ఎనిమిది వందల పదకొండు రూపాయలు మాత్రమే)** + వడ్డీతో ఖర్చులు, కాస్ట్స్, చార్జీలు మొ॥నవి సహా **భారతీయ స్టేట్ బ్యాంక్, నందివెలుగు బ్రాంచ్, గుంటూరు జిల్లా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీత'లు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) లోని నిబంధనలు గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, తెనాలి రిజిస్ట్రేషన్ జిల్లా, దుగ్గిరాల సబ్-జిల్లా, నందివెలుగు గ్రామ పంచాయితీ, నందివెలుగు గ్రామ డి.నెం.334/2, బ్లాక్ నెం.9, ఉత్తరం వైపు డోర్ నెం.9-136లో ఉన్న విస్తీర్ణం 155 చ॥గ॥లు (129-59 చ॥మీ॥లు) నందు ఖాళీ స్థలం యావత్తు ఆస్తి. **హద్దులు : తూర్పు** : పంచాయితీ బజార్ 30-0", **పడమర** : వీరెల్ల పున్నయ్య గారికి చెందిన స్థలం 30-0", **ఉత్తరం** : పంచాయితీ బజార్ 46-6", **దక్షిణం** : కనుగోలు నాగమ్మ మరియు ఇతరులకు చెందిన ఆస్తి 46-6".

పైన పేర్కొన్న హద్దుల నందు బ్లాక్ నెం.9 ఉత్తరం వైపున డోర్ నెం.9-136 వద్ద 155 చ॥గ॥లు (129-59 చ॥మీ॥లు) విస్తీర్ణం గల ఖాళీ స్థలము ఉన్నది.

తేది : 08.11.2023 | సం/- అధీకృత అధికారి
ప్రదేశం : నందివెలుగు | భారతీయ స్టేట్ బ్యాంక్

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

- బయటకు రానివ్వకుండా చక్రం తిప్పిన ఎంఇఒ?
- విచారణ చేపట్టిన విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, పూసపాటిరేగ

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువు విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం ఎంపియుపి పాఠశాలలో పని చేస్తున్న శంకర్ నాయుడు అనే ఉపాధ్యాయుడు విద్యార్థినులపట్ల లైంగిక వేదింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఇదే విషయమై మండల విద్యాశాధికారులకు కూడా గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన గత మంళవారం జరగ్గా విషయం బయటకు రాకుండా గ్రామస్థులతో రహస్య మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. విద్యార్థిని తల్లిదండ్రులను, ఫిర్యాదు చేసేందుకు వచ్చిన యువకులను అదే ఊరిలో ఓ ఇంటిలో సమావేశపరిచి విషయం బయటకు రాకుండా ఆ ఉపాధ్యాయుడ్ని కాపాడే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. శనివారం సాయంత్రం జిల్లా విద్యాశాఖాధికారులకు విషయం తెలియడంతో ఉపాధ్యాయుడి తీరుపై విద్యాశాఖ కార్యలయంలో చర్చకు దారితీసింది.

చక్రం తిప్పిన ఎంఇఒ?

ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాల్సిన ఎంఇఒ రాజ్‌కుమార్ విషయం బయటకు రాకుండా చక్రం తిప్పినట్లు ప్రచారం జరుగుతోంది. విద్యార్థినులు, తల్లిదండ్రులు మంగళవారం మండల విద్యాశాధికారికి ఫిర్యాదు చేయగా, రాత పూర్వక ఫిర్యాదు తీసుకోకుండా తాను వచ్చి చూస్తానని చెప్పి తల్లిదండ్రులకు నచ్చచెప్పి స్కూలు సమయం అయిన తర్వాత ఆ గ్రామానికి వెళ్లి ఓ ఇంట్లో తల్లి దండ్రులను, పెద్దలను , ఉ పాధ్యాయుడిని కూర్చోబెట్టి చర్చించినట్లు తెలిసింది. ఉపాధ్యాయుడిని మందలించి. తల్లిదండ్రులను ఒప్పించి గొడవ సద్దుమణిగేలా ఎంఇఒ చక్రం తిప్పినట్లు తెలిసింది. ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు తీసుకోవాల్సిన అధికారి ఈ విధంగా వ్యవహరించడం పట్ల కొంత మొత్తం చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారణ చేపట్టిన అధికారులు

విద్యార్థులపై ఉపాధ్యాయుడు శంకరనాయుడు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనపై డిఇఒ లింగేశ్వరరెడ్డి స్పందించి విచారణకు ఆదేశించారు. గ్రామంలో విచారణ చేసి రిపోర్ట్ ఇవ్వాలని పూసపాటిరేగ హెచ్‌ఎం శంకరావుకు ఆదేశాలు జారీ చేశారు. దాంతో ఆయన శనివారం పాఠశాలకు చేరుకొని హెచ్‌ఎం వై. జయంతిమాలతో పాటు ఉపాధ్యాయులను, గ్రామంలో ఫిర్యాదుదారులను, ఎస్ఎంసి ఛైర్మన్ పైడిరాజును, సర్పంచి కొత్తకోట శ్రీరాములును పాఠశాలకు పిలిపించి విచారణ చేసారు. ఉపాధ్యాయుడిపై వచ్చినవి ఆరోపణలు కాదని, వాస్తవంగా జరిగిందని ఎంఇఒకు ఫిర్యాదు చేసామని గ్రామస్తులు తెలిపారు.

బ్యాడ్ టచ్, గుడ్ టచ్ ఏదో తెలియని విద్యార్థులను లైంగికంగా వేధిస్తున్నది వాస్తవమని తెలిపారు. అయితే లైంగికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులను మీ ముందుకు తీసుకురాలేమని, అవసరమైతే ఒక్కొక్కరిని మీ ముందు ఉంచే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఇలాంటి విషయాలు బయటకు రాకూడదని ఉద్దేశంతోనే ఎంఇఒకు కూడా ఓరల్‌గా ఫిర్యాదు చేసామన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే పేరెంట్ మీటింగ్ పెట్టామని ఎస్ఎంసి చైర్మన్ పి.పైడిరాజు తెలిపారు. ఈ విషయం బయటకు రాకూడదనే ఉద్దేశంతో గ్రామ సర్పంచికి కూడా చెప్పలేదన్నారు. ఈ విషయం తెలిస్తే మిగతా తల్లిదండ్రులు పిల్లలను మాన్పిస్తారని ఆవేదన వ్యక్తం చేసారు. సర్పంచి శ్రీరాములు స్పందించి ఇకపై ఇలాంటి చెడ్డపనులు చేసి మా ఊరుకు, ఉపాధ్యాయ వృత్తికి మచ్చతేవొద్దని హెచ్చరించారు. నివేదికను డిఇఒకు పంపుతామని హెచ్‌ఎం తెలిపారు.

మొదటి నుంచి వివాదాస్పదుడే?

శంకర్ నాయుడు మొదటి నుంచి వివాస్పదుడుగానే ముద్ర పడ్డాడు. విజయనగరం కెఎల్ పురంలో ఉంటున్న ఆయన గతంలో సాధారణ ఎన్నికల్లో ఓ రాజకీయ పార్టీకి మద్దతిచ్చి ఎన్నికల్లో బాహటంగానే తిరిగి విద్యాశాఖనుంచి మోమో అందుకున్నారు. గంట్యాడ మండలంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన సమయంలో ఎంఇఒ సంతకం ఫోర్జరీ చేశాడు. ఆయన ఎక్కడి పని చేస్తే అక్కడ వివాదాలు తెచ్చుకోవడం పరిపాటిగా మారింది.

జీవనాధార భూములు లాక్కోవద్దు

- గొర్రెలు, మేకల పెంపకందారుల ధర్నా

ప్రజాశక్తి-దత్తిరాజేరు (విజయనగరం)

చిన్నచామలాపల్లిలో గొర్రెలు, మేకల పెంపకందారులకు జీవనాధారమైన భూములను కృషి విజ్ఞాన కేంద్రం కోసం లాక్కోవద్దని కోరుతూ శనివారం మానాపురం సంతతోట వద్ద జాతీయ రహదారిపై సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు చిన్నచామలాపల్లిలో గొర్రెలు, మేకలు పెంపకంపై ఆధారపడిన కొండ భూమిని లాక్కోవడం జీవాలను చంపడమేనని ఆందోళన వ్యక్తంచేశారు. ఆ నిర్ణయం వృత్తిదారుల జీవనం తుంగలో తొక్కడమేనని, జీవించే హక్కుని హరించి వేయడమేనని చెప్పారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో ప్రభుత్వం భూమిని సేకరించిందని, ఆ భూముల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయడానికి ఆటంకమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను కంపెనీలకు ఇచ్చేసి మూగజీవాల భూములు లాక్కోవడం సిగ్గుచేటన్నారు. చుట్టూ ఉన్న అనేక ప్రాంతాల్లో సేకరించిన ప్రభుత్వ భూముల్లో కెవికె ఏర్పాటుకు సిద్ధం కావాలి తప్ప చిన్నచామలాపల్లి కొండ భూమికి వస్తే వృత్తిదారులు ఊరుకోరని హెచ్చరించారు. ఈ విషయంపై ఇప్పటికే తహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్‌కు వినతులు అందజేసినా, మొండిగా భూమి సేకరణకు సిద్ధం కావడం చాలా దుర్మార్గమని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెంపకందారులకు సిపిఎం అండగా నిలుస్తుందని స్పష్టంచేశారు. వీరికి అన్ని పార్టీలు మద్దతు తెలియజేసి సహకరించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్, రాకోటి రాములు, రాము, దుర్గాప్రసాద్, హర్ష, మాజీ ఎంపిటిసి ఎం.ఎరుకు నాయుడు, తిరుపతిరావు, శంకరరావు, లక్ష్మణ, మహేష్, పాల్గొన్నారు.

శ్రీశైలంలో ప్రముఖులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ శనివారం దర్శించుకున్నారు. ముందుగా ఉప ముఖ్యమంత్రి తమ అనుచర బృందంతో కలిసి స్వామి అమ్మ వార్లను దర్శించుకునేందుకు కృష్ణదేవరాయ రాజగోపురం వద్దకు చేరుకున్నారు. అక్కడ వీరికి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చక్రపాణి రెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, ప్రధానార్చకులు, వేదపండితులు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం భ్రమరాంబ దేవిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వేద ఆశీర్వచనం మండపంలో డిప్యూటీ సిఎంకు వేద పండితులు ఆశీర్వచనం పలికారు.

మల్లన్నను దర్శించుకున్న సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను శనివారం సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్‌వి రమణ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వీరు స్వామి అమ్మవార్లను దర్శించు కునేందుకు ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగానే దేవస్థానం ఇఒ పెద్దిరాజు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వేద పండితులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామివారిని, అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో నిట్ విద్యార్థికి కాంస్య పతకాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా)

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం గర్వించదగ్గ విషయమని నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి తెలిపారు. నిట్ కళాశాలలో ఇసిఇ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి టి.మంజునాథ్ పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీల్లో కాంస్య పతాకాలను సాధించాడు. కలకత్తాలోని ఎన్ఐటి దుర్గాపూర్‌లో ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకూ నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ ఎన్ఐటి పోటీలకు దేశంలోని 28 ఎన్ఐటిల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో తాడేపల్లిగూడెం నిట్ విద్యార్థి మంజునాథ్ 100వ విభాగంలో పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్‌లో ప్రతిభ కనబర్చి కాంస్య పతకాలను కైవసం చేసుకున్నాడు. ఇతనికి జిమ్ ట్రెయినీగా ఎం.సూర్యప్రకాష్ వ్యహహరించాడు. నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, మంజునాథ్‌ను, అలాగే వివిధ పోటీల్లో నాలుగు, ఐదు స్థానాలు సాధించిన క్రీడాకారులను శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి నిట్ ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింపజేయడం అభినందనీయమన్నారు. మంజునాథ్ స్ఫూర్తితో మిగిలిన క్రీడాకారులు కూడా వివిధ పోటీల్లో రాణించి సంస్థకు పేరు తేవాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, సాస్ ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కిరణ్ తీపర్తి, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ జి.కిరణ్ కుమార్, డాక్టర్ యువరాజు పాల్గొన్నారు.

**IN THE COURT OF
THE HON'BLE V ADDL. DISTRICT
AND SESSIONS JUDGE AT VIJAYAWADA
E.P. No. 724/2019
IN
A.O.P. No. 1261/2016**

Between:
M/s. Shriram Transport Finance Co. Ltd.,
Rep. by its Authorized Signatory ...D.Hr/Claimant
Vs
1. Singamaneni Sudha Rani
2. Basha Shaik ... J.Drs/Respondents

NOTICE TO JDR NO.1&2/ RESPONDENT

1. Singamaneni Sudha Rani, w/o Venkata Chalamayya, D.No. 9-170,Flotno:2,Padmavathi Gardens, Phase1 Poranki, Penammaluru mandalam, Krishna Dist.
2. Basha Shaik, S/o. Hameed Shaik, D. No. 5-48, Yanamalakuduru, Indiranagar-1, Vijayawada, Krishna Dist.

Take notice that the above Execution Petititon filed by the DHR/ Climant praying orders against JDR -1 and JDR-2. The same is posted to 21-11-2023 for your appearance on that day you should attend the court in person or through an advocate at 10.30 A.M. failing which the matter will be decided in your absence by the Hon'ble Court.

(BY ORDER OF THE HON'BLE COURT)
V. BRAHMAJI, Advocate,
D.NO: 8-268, Near vijayalakshmi Theatre, Kanuru Road, Kamaiahthopu, Krishna District, Vijayawada-520007. Cell No: 9440636278

Piramal Capital & Housing Finance
పిరమల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో దీవాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా పేరుగలది)
సిఐఎన్: ఎల్65910ఎంహెచ్1984పిఎల్‌సి032639
రిజిస్టర్డు ఆఫీసు: యూనిట్ నం. 601, 6వ అంతస్తు, పిరమల్ అమిటీ బిల్డింగ్, పిరమల్ అగస్త్యా కార్పొరేట్ పార్క్, కామని జంక్షన్, ఫైర్ స్టేషన్ ఎదురుగా, ఎల్‌బిఎస్ మార్గ్, కుర్ల (వెస్ట్), ముంబయి-400070, టెలి: +91 22 3802 4000.
బ్రాంచి ఆఫీసు: డోర్ నం.7-1-615, 616 & 617/ఎ, ఇంపీరియల్ టవర్స్, 4వ అంతస్తు, అమీర్‌పేట్ మెయిన్ రోడ్, హైదరాబాద్-500016, తెలంగాణ.
సంప్రదించాల్సిన వ్యక్తి: 1. దుర్గా విజయ ప్రసాద్ వానచర్ల-9493330003, 2. రమణ రావు-9849271633, 3. విశాల్ కెటెలె-9584966653.

ఇ-వేలం అమ్మకపు ప్రకటన- తాజా అమ్మకం

పిరమల్ క్యాపిటల్& హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో డిహెచ్ఎఫ్ఎల్‌గా పేరుగలది) యొక్క అధీకృత అధికారిచే ఇందు దిగువ పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్ స్వాధీనం అనుసరించి, **ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002** క్రింద, ఋణగ్రహీతల నుండి బకాయి మొత్తాల రికవరీ కొరకు, క్రింది సంతకందారు ఇందు దిగువ వివరించినట్లు స్థిరాస్తులను కొనుట కొరకు ఆఫర్లను ఆహ్వానిస్తున్నారు, ఏదైతే భౌతికంగా స్వాధీనంచేసుకొన్నారు, **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన విక్రయించబడుతుంది, ఏవైతే, వివరాలు ఇందు దిగువ ఇవ్వబడినవి:

లోన్ కోడ్/బ్రాంచి/ రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారులు	డిమాండ్ నోటీసు తేదీ & మొత్తాలు	ఆస్తి చిరునామా-ఫైనల్	రిజర్వు ధర	ధరావత్తు డిపాజిట్ (ఇఎండి) (ఆర్‌పిలో 10%)	బకాయి మొత్తాలు (09.11.2023)
లోన్ కోడ్ నం. 06600002487, రాజమండ్రి (బ్రాంచి), బోసుబాబు పలభాల్ల (రుణగ్రహీత), దయారాణి పలబాల్ల (సహ-రుణగ్రహీత-1)	తేది: 12.05.2021, రూ.14,83,425/- (రూపాయలు పద్నాలుగు లక్షల ఎనభై మూడు వేల నాలుగు వందల ఇరువై ఐదు మాత్రమే)	వేంపాడు గ్రామం, కొక్కిరపాడు గ్రా.పం., ఎన్‌హెచ్-5, ఏలూరు, రామచంద్ర కాలేజి ఎదురుగా, ఏలూరు, కృష్ణా, ఆం.ప్ర.-520008 వద్ద హైవే సిటీ ఫేజ్2, ప్లాట్ నం.151, విస్తీర్ణం కలిగియున్న ఆస్తి యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నం.152, దక్షిణం: ప్లాట్ నం.150, తూర్పు: 33అ.ల రోడ్డు, పడమర: ప్లాట్ నం.162.	రూ.12,33,000/- (రూపాయలు పన్నెండు లక్షల ముప్పై మూడు వేలు మాత్రమే)	రూ.1,23,300/- (రూపాయలు ఒక లక్ష ఇరువై మూడు వేల మూడు వందలు మాత్రమే)	రూ. 20,98,432/- (రూపాయలు ఇరువై లక్షల తొంభై ఎనిమిది వేల నాలుగు వందల ముప్పై రెండు మాత్రమే)
లోన్ కోడ్ నం.02400006514, విజయవాడ (బ్రాంచి), రమణ తిరుమలకొండ (రుణగ్రహీత), వినోష్ తిరుమలకొండ (సహ-రుణగ్రహీత-1) పెద్దవెంకన్న తిరుమలకొండ (సహ-రుణగ్రహీత-2)	తేది: 30.04.2021, రూ.25,87,338/- (రూపాయలు ఇరువై ఐదు లక్షల ఎనభై ఏడు వేల మూడు వందల ముప్పై ఎనిమిది మాత్రమే)	కమలమ్మ బజార్, మురళి నగర్, కానూరు, విజయవాడ, కృష్ణా, ఆం.ప్ర.-521108 వద్ద సంధ్య రెసిడెన్సీ, రెండవ అంతస్తు, ఎస్ఎఫ్-3, విస్తీర్ణం కలిగియున్న ఆస్తి యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: ఒపెన్ టు స్కై, దక్షిణం: ఫ్లాట్ నం.ఎస్ఎఫ్-4, తూర్పు: ఉమ్మడి కారిడార్, పడమర: ఒపెన్ టు స్కై.	రూ. 23,67,000/- (రూపాయలు ఇరువై మూడు లక్షల అరవై ఏడు వేలు మాత్రమే)	రూ.2,36,700/- (రూపాయలు రెండు లక్షల ముప్పై ఆరు వేల ఏడు వందలు మాత్రమే)	రూ. 37,77,037/- (రూపాయలు ముప్పై ఏడు లక్షల డెబ్బై ఏడు వేల ముప్పై ఏడు మాత్రమే)

ఇ-వేలం తేది: 29.11.2023, ఉ॥11.00గం.ల నుండి మ॥ 2.00గం.ల వరకు (ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో), బిడ్ దాఖలుచేయుట కొరకు చివరి తేది: 28.11.2023న, సా॥4.00గం.లకు ముందు.

అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& షరతుల కొరకు, దయచేసి **www.piramalfinance.com** లో ఇవ్వబడిన లింకును పరిశీలించండి లేదా www.piramal.auction@piramal.com పై మాకు ఇమెయిల్ చేయవచ్చును.

రుణగ్రహీత/హామీదారు/తాకట్టుదారుకు షార్ఫసీ యాక్ట్ క్రింద చట్టబద్ధ 15 రోజుల అమ్మకపు ప్రకటన

పై పేర్కొన్న రుణగ్రహీత/ హామీదారులు వేలం తేదీకి ముందు తేదీ వరకు వేసిన వడ్డీతో పూర్తిగా నోటీసు యొక్క సెక్షన్ 13(2)లో పేర్కొన్నట్లు మొత్తాలను చెల్లించవలసిందిగా ఇందుమూలంగా గమనించగలరు, ఏదైతే విఫలం చెందినచో ఆస్తిని వేలంవేయుట/అమ్మకం నిర్వహించి రికవరీచేయబడుతుంది మరియు ఏవేని మిగతా బకాయి ఉన్నచో రుణగ్రహీత/ హామీదారు నుండి వడ్డీ మరియు ఖర్చులతోసహా రికవర్‌చేయబడుతుంది.

సం/-
తేది: 12.11.2023, (అధీకృత అధికారి)
ప్రదేశం: ఆం.ప్ర. పిరమల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.

सत्यमेव जयते
MINISTRY OF
SOCIAL JUSTICE & EMPOWERMENT
GOVERNMENT OF INDIA

సామాజిక న్యాయం మరియు సాధికారత విభాగం

ప్రకటిస్తున్నది

69 లక్షల షెడ్యూల్డ్ కులాలకు స్కాలర్‌షిప్‌లు

కింద ఉన్నత విద్యను అభ్యసించడానికి విద్యార్థులు

2023-24 సంవత్సరానికి ఎస్‌సి విద్యార్థుల కొరకు

పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల పథకం

అర్హత
- తల్లిదండ్రులు/ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు మించకూడదు
- గుర్తింపు పొందిన కళాశాలలు/ పాఠశాలల్లో కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు

పరిధి
- 11వ తరగతి నుండి అన్ని గుర్తింపు పొందిన కోర్సులు
- దరఖాస్తులు రాష్ట్ర ప్రభుత్వం/ యూనియన్ టెర్రిటరీ ద్వారా ఆమోదించబడతాయి మరియు ధృవీకరించబడతాయి
- పేద కుటుంబాలకు సంబంధించి కవరేజ్

ఎన్‌టైటిల్‌మెంట్
- తిరిగి ఇవ్వబడని ఫీజు తప్పనిసరి (ట్యూషన్ ఫీ తో సహా)
- సంవత్సరానికి రూ.2500 నుండి రూ.13500 వరకు విద్యా భత్యం
- దివ్యాంగుల (ప్రత్యేక సామర్థ్యం గల) విద్యార్థులకు 10% అదనపు భత్యం

- విద్యార్థులు వారి సంబంధిత రాష్ట్రాల స్కాలర్‌షిప్ పోర్టల్‌లలో దరఖాస్తు చేసుకోవాలి
- విద్యార్థులు చెల్లుబాటు అయ్యే మొబైల్ నంబర్, ఆధార్ నంబర్ (యుఐడి), ఆధార్ సీడెడ్ బ్యాంక్ ఖాతా, ఆదాయ ధృవీకరణ పత్రం మరియు కుల ధృవీకరణ పత్రాన్ని కలిగి ఉండాలి.

- పథకం మార్గదర్శకాలు మరియు వివరణాత్మక అర్హత ప్రమాణాలు అందుబాటులో ఉన్నాయి.
http://socialjustice.gov.in/schemes/25

cbc 38101/11/0046/2324

119 నియోజకవర్గాలు... 4810 నామినేషన్లు

- 15వరకు ఉపసంహరణకు గడువు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో మొత్తం 4,810 నామినేషన్లు దాఖలయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ అసెంబ్లీ స్థానంలో అత్యధికంగా 145 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆ తర్వాత మేడ్చల్ నియోజకవర్గంలో అత్యధిక నామినేషన్లు దాఖలయ్యాయి. అతి తక్కువగా భద్రాచలం నియోజకవర్గంలో నామినేషన్లు వేశారు. నామినేషన్ల దాఖలుకు తుది గడువైన శుక్రవారం ఒక్కరోజే మొత్తం 2,327 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈనెల 13వ తేదీ నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అసంపూర్తిగా నామినేషన్ పత్రాలు నింపితే, అలాంటి అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరిస్తారు. అదే రోజు నామినేషన్ల తుది జాబితా విడుదల అవుతుంది. 15వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. ఆ తర్వాత అసలు బరిలో ఉండే మొత్తం అభ్యర్థుల సంఖ్య ఖరారవుతుంది. 30వ తేదీ పోలింగ్, డిసెంబర్ 3వ తేదీ ఫలితాలు వెల్లడయ్యే విషయం తెలిసిందే. ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకున్న పత్రికా ప్రకటనలు, వీడియోలు కాకుండా, వాటిని మార్చివేసి ప్రసారం చేస్తున్న 15 రాజకీయ ప్రకటనల్ని నిలిపివేస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో రూ.544.27 కోట్ల విలువైన సొత్తు పట్టుబడింది. అక్టోబర్ 9 నుంచి నవంబర్ 11వ తేదీ ఉదయం వరకు నిర్వహించిన తనిఖీల్లో నగదుతోపాటు బంగారం, వెండి, ఇతర ఆభరణాలు, చీరలు, క్రీడాసామాగ్రి, కుక్కర్లు, బియ్యం వంటి వాటిని ఎన్నికల తనిఖీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

త్వరలో కాంగ్రెస్‌లోకి విజయశాంతి : మల్లు రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రాజకీయ పునరేకీకరణ జరుగుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి చెప్పారు. అందులో భాగంగానే బిజెపి నేత విజయశాంతి వంటి నేతలు కాంగ్రెస్‌లోకి వస్తున్నారని తెలిపారు. శనివారం గాంధీభవన్‌లో కంటోన్మెంట్ అభ్యర్థి వెన్నెల, పార్టీ నేత వచన్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 85-95 స్థానాల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఇంగ్లండ్ పర్యటనకు జైశంకర్

న్యూఢిల్లీ : ఐదు రోజుల ఇంగ్లండ్ పర్యటన కోసం కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ శనివారం బయలుదేరి వెళ్లారు. ద్వైపాక్షిక సంబంధాల్లో వివిధ అంశాలను సమీక్షించే లక్ష్యంతో ఈ పర్యటన జరగనుంది. మరికొద్ది నెలల్లో బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునక్ భారత్‌కు రానున్న నేపథ్యంలో జైశంకర్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. సునక్ భారత పర్యటనకు సన్నాహకంగానే జైశంకర్ పర్యటన సాగుతుందని భావిస్తున్నారు. జైశంకర్ తన పర్యటనలో బ్రిటన్ మంత్రి సర్ జేమ్స్ క్లేవర్లీ, ఇతర ప్రముఖులతోనూ చర్చలు జరపనున్నారు. జైశంకర్ పర్యటన ఇరు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలకు కొత్త ఊపునిస్తుందని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం ఆస్తులు రూ.447 కోట్లు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి ఈనెల 17న రెండో విడత ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో 253 మంది కోటీశ్వరులు. ఈ జాబితాలో కాంగ్రెస్ సీనియర్ నేత, డిప్యూటీ సీఎం టీఎస్ సింగ్ దేవ్ రూ.447 కోట్లతో మొదటి స్థానంలో నిలిచారు. మొత్తం 958 మందికిగాను 953 మంది అభ్యర్థులు ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో వెల్లడించిన ఆస్తుల వివరాలను విశ్లేషించినట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫారమ్స్ (ఎడిఆర్)తెలిపింది. అభ్యర్థుల ఆస్తుల సరాసరి రూ.2 కోట్లని తెలిపింది. అత్యంత ధనికులైన ముగ్గురు అభ్యర్థులు కూడా కాంగ్రెస్‌కు చెందిన వారేనని పేర్కొంది. సుర్‌గ్రుజా రాచకుటుంబ వారసుడైన టీఎస్ సింగ్ దేవ్ రూ.447 కోట్ల ఆస్తులతో మొదటి స్థానంలో ఉన్నారు. అంబికాపూర్ నుంచి పోటీ చేస్తున్న ఈయన 2018 ఎన్నికల సమయంలో రూ.500 కోట్ల ఆస్తులున్నట్టు వెల్లడించారు. ఆ తర్వాత మణేంద్రగఢ్ స్థానంలో పోటీ చేస్తున్న రమేశ్ సింగ్ రూ.73 కోట్ల పైచిలుకు ఆస్తులు, రజిమ్‌లో పోటీ చేస్తున్న అమితేశ్ శుక్లా రూ.48 కోట్ల పైచిలుకు ఆస్తులున్నట్లు ప్రకటించారని వెల్లడించింది. కాంగ్రెస్‌కు చెందిన 70 మంది అభ్యర్థుల్లో 60 (86%)మంది, బిజెపికి చెందిన 70 మంది అభ్యర్థుల్లో 57 (81%)మంది, జనతా కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్ (జే)కి చెందిన 62 మందిలో 26 (42%) మంది, ఆప్‌నకు చెందిన 44 మందిలో 19 (43%) మంది అభ్యర్థులు రూ.1 కోటి కంటే ఎక్కువ ఆస్తులున్నట్లు ప్రకటించారని వివరించింది.

ఆస్తులే లేవన్న ముగ్గురు అభ్యర్థులు

భట్‌గావ్ సీటుకు పోటీ చేస్తున్న కళావతి సార్థి, బెల్టారాలో పోటీ చేస్తున్న గౌతమ్ ప్రసాద్ సాహు అనే స్వతంత్ర అభ్యర్థులు, ఖర్సియాలో పోటీలో ఉన్న జోహార్ ఛత్తీస్‌గఢ్ పార్టీకి చెందిన యశ్వంత్ కుమార్ నిషాద్ తమకు ఎలాంటి ఆస్తులు లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు ఎడిఆర్ తెలిపింది. అదేవిధంగా, రెండో విడత ఎన్నికల బరిలో ఉన్న ముగ్గురు అభ్యర్థులు అతి తక్కువగా ఆస్తులున్నట్లు అఫిడవిట్‌లో వెల్లడించారు. ముంగేలి ఎస్‌సి రిజర్వుడు సీటుకు పోటీ చేస్తున్న నేషనల్ యూత్ కాంగ్రెస్ అభ్యర్థి రాజ్‌రత్న ఉయికే తన వద్ద కేవలం రూ.500 ఉన్నట్లు తెలిపారు. రాయ్‌గఢ్‌లో ఆజాద్ జనతా పార్టీ టికెట్‌పై పోటీచేస్తున్న కాంతి సాహు రూ.1,000 మాత్రమే ఉన్నట్లు వెల్లడించారు. బెల్టారా బరిలో నిలిచిన ఆజాద్ జనతా పార్టీకే చెందిన ముకేశ్ కుమార్ చంద్రాకర్ రూ.1,500 ఉన్నట్లు వెల్లడించారని ఎడిఆర్ తెలిపింది.

మొత్తం అభ్యర్థుల్లో 499 (52 శాతం) మంది తమ విద్యార్హతలను 5 నుంచి 12వ తరగతి మధ్య ఉన్నట్లు తెలపగా మరో 405(42%) మంది గ్రాడ్యుయేషన్ ఆపైన చదువుకున్నట్లు వెల్లడించారని ఎడిఆర్ విశ్లేషించింది. 19 మంది అక్షరాస్యులమని మాత్రమే తెలపగా, ఆరుగురు నిరక్షరాస్యులమని తెలిపారు. ముగ్గురు అభ్యర్థులు విద్యార్హతలను పేర్కొనలేదు.

5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు 2023

కాంగ్రెస్‌కు పాల్వాయి స్రవంతి రాజీనామా

- బిఆర్‌ఎస్‌లో చేరిక!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ రాజ్యసభ సభ్యులు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె, మునుగోడు కాంగ్రెస్ కీలక నేత పాల్వాయి స్రవంతి ఆ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ నాలుగు పేజీల లేఖను శనివారం కాంగ్రెస్ అధ్యక్షుడికి పంపారు. మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థిగా కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డిని ప్రకటించడంతో ఆమె పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరిగింది. ఈ వార్తలు అవాస్తవమని ఇటీవల పాల్వాయి స్రవంతి కొట్టిపారేశారు. తాను కాంగ్రెస్‌లోనే ఉంటానని చెప్పారు. కాగా, బిఆర్‌ఎస్ నేతలు ఆమెను కలిసి రాజకీయ భవిష్యత్తుపై గ్యారెంటీ ఇవ్వడంతో ఆమె బిఆర్‌ఎస్‌లోకి వెళ్లేందుకు సిద్ధపడి కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. ఈ సందర్భంగా శనివారం ఆమె సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. భావోద్వేగానికి గురయ్యారు. కార్పొరేట్, బ్రోకర్ పార్టీగా కాంగ్రెస్ మారిపోయిందని ఆరోపించారు.

ఒక్క కుటుంబం కోసం పోలింగ్ కేంద్రం..

బర్మేర్: రాజస్థాన్‌లోని భారత్-పాకిస్థాన్ సరిహద్దున గల బర్మేర్ జిల్లా 'బర్మేర్ కా పార్' గ్రామంలోని ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం 20 కిలోమీటర్లు వెళ్లి ఓటు వేయాలి. వాళ్లకు ఎలాంటి రవాణా సౌకర్యాలు లేవు. అక్కడి నుంచి నడిచి వెళ్లాలి.. లేదంటే ఒంటెలను ద్వారా వెళ్లాలి. ఈ క్రమంలో గ్రామస్థులు చాలా మంది ఓటు వేసేవారు కాదు. కొందరు పురుషులు ఓటేసి వచ్చేవారు. తాజాగా ఇసిఐ తీసుకున్న నిర్ణయంతో అధికారులు ఆ గ్రామంలో ఓ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ గ్రామంలో మొత్తం 35 ఓట్లు ఉండగా.. అందులో మహిళలు 17 మంది, పురుషులు 18 మంది ఉన్నారు. వీళ్లంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం గమనార్హం. పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఆ గ్రామస్థుల్లో జోష్ నింపింది. ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా వేస్తామని వారు చెబుతున్నారు.

లాడ్లీ బెహన్ లబ్ధిదారులకు ఇళ్లు

- ఐఐటి, ఎయిమ్స్ వంటి సంస్థల ఏర్పాటు
- మధ్యప్రదేశ్‌లో బిజెపి మేనిఫెస్టో విడుదల

భోపాల్ : మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శనివారం బిజెపి తన మేనిఫెస్టోను విడుదల చేసింది. సంకల్ప పత్ర పేరుతో ఈ మేనిఫెస్టోను బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఇతర నాయకులు విడుదల చేశారు. మధ్య ప్రదేశ్ ప్రభుత్వ పథకం లాడ్లీ బెహన్ యోజనలో 1.30 కోట్ల మంది లబ్ధిదారులకు కాంక్రీట్ ఇళ్లు ఇస్తామని బిజెపి తన మేనిఫెస్టోలో వాగ్దానం చేసింది. లాడ్లీ బెహనా, కేంద్రం ఉజ్వల యోజన లబ్ధిదారులకు రూ.450కే ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్‌ను ఇస్తామని పేర్కొంది. గోధుమల మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,700, వరి క్వింటాల్‌కు రూ.3,100కు పెంచుతామని తెలిపింది. రాష్ట్రంలో ప్రతి డివిజన్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ (ఐఐటి) తరహాలో మధ్యప్రదేశ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పేరుతో ఒక ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొంది. రాష్ట్రంలో ప్రతి డివిజన్‌లోనూ ఎయిమ్స్ తరహాలో మధ్యప్రదేశ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అనే మెడికల్ కాలేజ్‌ను ఏర్పాటు చేస్తామని, అటల్ మెడిసిటీ పేరుతో ఒక మెడికల్ సిటీని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న (బిపిఎల్) కుటుంబాలకు చెందిన బాలికలకు కెజి నుంచి పిజి వరకూ ఉచిత విద్యను, బుందేల్‌ఖండ్ డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేస్తామని బిజెపి హామీ ఇచ్చింది. రాష్ట్రంలో 21 శాతం ఉన్న గిరిజనుల అభివృద్ధికి రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌ను వ్యయం చేస్తామని తెలిపింది. రాష్ట్రంలో ఆరు కొత్త ఎక్స్‌ప్రెస్‌వేలను అభివృద్ధి, గిగ్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని బిజెపి హామీ ఇచ్చింది. ప్రతి ఇంటికి రూ.100కు 100 యూనిట్ల విద్యుత్ ఇస్తామని బిజెపి వాగ్దానం చేసింది.

అసోంలో కాంగ్రెస్ పార్టీకి ఇద్దరు నేతల రాజీనామా

గువహతి : అస్సాంలో ఇద్దరు కాంగ్రెస్ నేతలు తమ పదవులకు శనివారం రాజీనామా చేశారు. అసోం ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పొరితుష్ రాయ్, నాగోన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు సురేష్ బోరాలు తమ పదవులకు రాజీనామా చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. నాగోన్ జిల్లా అధ్యక్షునిగా పనిచేయడం గౌరవంగా ఉందని సురేష్ బోరా రాజీనామా లేఖలో పేర్కొన్నారు. తనకు అవకాశాలు, మద్దతు అందించిన పార్టీ సభ్యులకు కతజ్ఞతలని అన్నారు.

ఐస్‌లాండ్‌లో 24గంటల్లో 800కి పైగా ప్రకంపనలు

- అత్యవసర పరిస్థితి విధించిన ప్రభుత్వం

రీక్‌జవిక్ (ఐస్‌లాండ్) : ఐస్‌లాండ్‌లో గత 24గంటల్లో 800కిపైగా భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. వీటిల్లో 500కి పైగా ప్రకంపనలు నాలుగు కన్నా ఎక్కువ తీవ్రతతోనే వచ్చాయని అధికారులు చెప్పారు. ఇన్నిసార్లు భూమి కంపిస్తోందంటే త్వరలోనే రాజధానికి సమీపంలో గల అగ్నిపర్వతం బద్దలయ్యే అవకాశం వుందంటూ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐస్‌లాండ్‌లో అగ్నిపర్వతాలు చాలా ఎక్కువ, మొత్తంగా 33 అగ్నిపర్వతాలు వున్నాయి, ఇది యూరప్‌లోనే అధికం. భూకంపాలు కూడా ఎక్కువే. దీంతో అక్కడ తరచూ భూమి కంపిస్తూ వుంటుంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో దేశంలో అత్యవసర పరిస్థితి విధించారు. రాజధాని రీక్‌జవిక్‌కు సమీపంలో గల చిన్న పట్టణం నుండి దాదాపు నాలుగు వేల మంది ప్రజలను రాత్రికి రాత్రే తరలించారు. ఆ గ్రామంలో వందలాదిగా ప్రకంపనలు వస్తూనే వున్నాయి. ప్రజాదరణ పొందిన పర్యాటక కేంద్రమైన బ్లూ లాగూన్ జియోథర్మల్ స్పా రిసార్ట్‌కు సమీపంలోనే ఈ గ్రామం వుంది. ముందు జాగ్రత్తగా పర్యాటక కేంద్రాన్ని కూడా మూసివేశారు. అగ్నిపర్వతం బద్దలైందంటే కొన్ని గంటలు కాదని, కొన్ని రోజులు దాని ప్రభావం వుంటుందని, శుక్రవారం రాత్రి కొన్నిచోట్ల లావా ఉబికివస్తున్నట్లు కనిపిస్తుందని, అంటే త్వరలోనే అగ్నిపర్వతం పేలుతుందని ఐస్‌లాండ్ వాతావరణ కార్యాలయం ప్రకటించింది. ఇలాంటి దశలో ఎక్కడ, ఎప్పుడు ఎలా లావా ఉబికివస్తుందో కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదని పేర్కొంది.

నిమిషాల దూరంలో పొంచిన మృత్యువు

- అల్ షిఫా ఆస్పత్రిలో దయనీయ పరిస్థితులు
- విద్యుత్ లేక నవజాత శిశువు మృతి, మరో 45మందీ అదే పరిస్థితి

గాజా : గాజాలో ఆస్పత్రులను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ బాంబు దాడులు కొనసాగిస్తున్న నేపథ్యంలో అనేక ఆస్పత్రుల్లో ఇంధన నిల్వలు హరించుకుపోవడంతో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారిందని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. విద్యుత్ లేకపోవడంతో గాజా నగరంలోని అతిపెద్ద ఆస్పత్రిలో అల్ షిఫా ఆస్పత్రిలో ఆపరేషన్లు నిలిచిపోయాయి. "ఫలితంగా, ఇంక్యుబేటర్‌లోని మా నవజాత శిశువు కన్నుమూసింది. ఇంకా అక్కడ 45మంది శిశువులు వున్నారు." అని ఆరోగ్య శాఖ ప్రతినిధి అష్రఫ్ అల్ కిద్రా తెలిపారు. కేవలం నిముషాల దూరంలోనే మృత్యువు పొంచి వుందని ఆస్పత్రి హెడ్ మహ్మద్ అబూ సాల్మియా వ్యాఖ్యానించారు. నిముషాల వ్యవధిలో రోగులు మరణిస్తున్నారని ఆయన మీడియాకు తెలిపారు.

శుక్రవారం కూడా ఆస్పత్రిపై క్షిపణి దాడులు జరిగాయని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. "ప్రాణాలు కోల్పోవడం ఆరంభమైందని మాత్రమే మేం చెప్పగలం. గాయపడినవారు కూడా సరైన చికిత్స లేక కన్నుమూస్తున్నారు. ఇంక్యుబేటర్లలో చిన్నారుల పరిస్థితి కూడా అలాగే వుంది. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న యువకుడు మరణించాడు. ఆస్పత్రి ఆవరణ మొత్తంగా చుట్టుముట్టారు. భవనాలను లక్ష్యంగా చేసుకున్నారు. ఆవరణలో ఏ వ్యక్తి అయినా తిరుగుతుంటే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఎవరినీ కదలనివ్వకుండా బయట ఇజ్రాయిల్ బలగాలు కాపలా కాస్తున్నాయి" అని ఆయన చెప్పారు. మొత్తంగా ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయయని అన్నారు. మృత్యువు అనివార్యంగా కనిపిస్తోందన్నారు.

అల్-షిఫా ఆస్పత్రికి సమీపంలో 50వేల మందికి పైగా ఆశ్రయం పొందుతున్నారు. ఆస్పత్రిలో విద్యుత్, ఇంటర్‌నెట్, వైద్య సరఫరాలు, ఔషధాలు అన్నీ అయిపోయాయని అధికారులు చెప్పారు. ఆస్పత్రిలోని దృశ్యాలు, పరిస్థితులు, వార్తలు చూస్తుంటే అత్యంత దిగ్భ్రాంతికరంగా, దయనీయంగా వున్నాయని అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ కమిటీకి చెందిన రాబర్ట్ మార్టిన్ వ్యాఖ్యానించారు. భరించలేని రీతిలో వున్న అక్కడి పరిస్థితులను ఇంకా దిగజారకుండా తక్షణమే ఆపాలని కోరారు. జనరేటర్లు ఆపిన తర్వాత ఐదుగురు రోగులు చనిపోయారని అధికారులు తెలిపారు.

మాటలు కాదు, చేతలు కావాలి

గాజాపై చర్యలు తీసుకునే సమయం ఆసన్నమైందని ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసి అన్నారు. గాజాపై కేవలం మాటలు చెబితే సరిపోదు, తక్షణమే కార్యాచరణకు దిగాల్సిన ఆవశ్యకత నెలకొందని అన్నారు. రియాద్‌కు వెళ్లేముందు టెహరాన్ విమానాశ్రయంలో ఆయన మాట్లాడారు. ఇస్లామిక్ దేశాల ఐక్యత ఈనాడు చాలా ముఖ్యమన్నారు. కాల్పుల విరమణను అడ్డుకునేది అమెరికానే, యుద్ధ అవకాశాలను విస్తరిస్తున్నది కూడా అమెరికానే అని విమర్శించారు.

పాలస్తీనా హక్కుల ప్రాతిపదికనే పరిష్కారం వుండాలి

మూడు అంశాల ప్రాతిపదికన సమస్యకు పరిష్కారం కనుగొనాలని హమాస్ ప్రతినిధి ఒసామా హమ్దాన్ పేర్కొన్నారు. మొదటగా, పాలస్తీనియన్లపై మారణహోమాన్ని ఆపాలి, రెండవది, మానవతా సాయం, వైద్య సాయం, ఇంధనం అందచేయాలి, మూడవది, అత్యంత ముఖ్యమైన పాయింట్ అని, దీనిపై అందరూ ముక్తకంఠంతో మాట్లాడాలని అన్నారు. పాలస్తీనియన్ల హక్కుల ప్రాతిపదికనే పాలస్తీనా సమస్య పరిష్కారం కావాలన్నది మూడవ అంశమని హమ్దాన్ చెప్పారు.

అత్యవసరంగా సమావేశమైన అరబ్ నేతలు

ఇతర దేశాలకు విస్తరించకుండా ఈ ఘర్షణను ఇక్కడే అంతం చేయడానికి గల అవకాశాలపై చర్చించేందుకు శనివారం రియాద్‌లో అరబ్ నేతలు, ఇరాన్ అధ్యక్షుడు సమావేశమయ్యారు. గాజా, పాలస్తీనా ప్రాంతాల్లో అత్యంత ప్రమాదకరమైన, అనూహ్యమైన పరిణామాలపై సమిష్టి వైఖరిని రూపొందించాల్సిన ప్రాముఖ్యతను ఈ చర్య తెలియచేస్తోందని అధికార సౌదీ పత్రికా సంస్థ వ్యాఖ్యానించింది. పాలస్తీనియన్లపై నేరాలకు ఇజ్రాయిల్‌దే బాధ్యత అని అరబ్ నేతలు స్పష్టం చేశారు. ఈ సదస్సులో ఇరాన్, టర్కీ, సిరియా అధ్యక్షులు, కతార్ రాజు పాల్గొన్నారు. సౌదీ యువరాజు బిన్ సల్మాన్, ఇజ్రాయిల్ చర్యలను తీవ్రంగా ఖండించారు. తన చట్టబద్ధమైన, నైతిక బాధ్యతలను నిర్వహించడంలో అంతర్జాతీయ సమాజం విఫలమైందని కతార్ నేత వ్యాఖ్యానించారు.

ప్రతి పది నిమిషాలకొక చిన్నారి బలి

- డబ్ల్యుహెచ్‌ఓ చీఫ్ వెల్లడి

న్యూఢిల్లీ: గాజాలో ఇజ్రాయిల్ హంతక దాడుల్లో ప్రతి 10 నిమిషాలకొక చిన్నారి చనిపోతోంది. ఈ విషయం ఇజ్రాయిల్ అంటే గిట్టనివారు చెప్పింది కాదు. సాక్షాత్తు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) చీఫ్ టెడ్రోస్ అధనామ్ గెబ్రెయేసస్ తెలిపారు. గాజాలో ఆరోగ్య వ్యవస్థ అత్యంత దారుణంగా ఉంది. అక్టోబర్ 7 నుంచి గాజాలోని ఆరోగ్య కేంద్రాలపై దాదాపు 250 దాడులు జరిగాయి. ఇజ్రాయెల్ దాడుల్లో సుమారు 100 మంది ఐరాస ఆరోగ్య కార్యకర్తలు మరణించారని ఆయన చెప్పారు. గాజాలో ఎవరూ సురక్షితంగా లేరని ఆయన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి నివేదించారు. శనివారం ఇజ్రాయెల్ దళాలు గాజాలోని నాలుగు ఆసుపత్రులను చుట్టుముట్టాయి. అవి హమాస్ కేంద్రంగా ఉన్నాయని నిందించాయి. అల్ రాంటిసి చిల్డ్రన్స్ హాస్పిటల్, అల్ నాసర్ హాస్పిటల్, గవర్నమెంట్ ఐ హాస్పిటల్ , మెంటల్ హెల్త్ సెంటర్లను సైన్యం చుట్టుముట్టింది.

కాల్పుల విరమణకు పాశ్చాత్య దేశాలు గొంతెత్తాలి

- పాలస్తీనా రాయబారి పిలుపు

జెనీవా: ఐక్యరాజ్యసమితి (యుఎన్)లోని పాలస్తీనా రాయబారి ఇబ్రహీం ఖ్రైషి శుక్రవారం నాడిక్కడ దౌత్యవేత్తలు, విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గాజాలో కాల్పుల విరమణకు పాశ్చాత్య దేశాలు గొంతెత్తాలని పిలుపునిచ్చారు గాజాలో ఇజ్రాయిల్ దాడుల్లో చనిపోయిన వేలాది మంది పౌరులకు, అసాధారణంగా చనిపోయిన ఐరాస సిబ్బందికి సంతాప సూచకంగా ఒక నిమిషం మౌనం పాటించిన తర్వాత ఇబ్రహీం ఖ్రైషి 40 మందికి పైగా రాయబారులతో కలిసి ప్రసంగించారు. ఇజ్రాయెల్ దళాల గాజా ఆక్రమణను అంతం చేయాలని ఖ్రైషి పిలుపునిచ్చారు సంక్షోభాన్ని పరిష్కరించడానికి మానవతా సహాయాన్ని అందించడం ఒక్కటే చాలదన్నారు. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఇంతకుముందు చేసిన ప్రకటనను ఖ్రైషి ప్రస్తావించారు, గాజాలో పరిస్థితి మానవతా సంక్షోభ నిర్వచనాన్ని మించిపోయింది. ఇది మానవాళి ప్రాథమిక సూత్రాలనే సవాలు చేస్తోందని అన్నారు. . ఇజ్రాయెల్‌కు ప్రతిస్పందించే హక్కు ఉందని చెప్పడానికి పశ్చిమ దేశాలు ఎక్కడలేని ఆతృతను చూపుతున్నాయి. పౌర ప్రాణనష్టాలను తగ్గించడానికి జాగ్రత్త వహించాలని పిలుపునివ్వడానికే పరిమితమవుతున్నాయని ఖైసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమానికి మధ్యప్రాచ్య, ఆసియా ఆఫ్రికా దేశాలకు చెందిన రాయబారులే ఎక్కువగా హాజరయ్యారు. నెదర్లాండ్స్ మినహా మిగతా ఏ పశ్చిమ దేశ రాయబారి కూడా హాజరుకాకపోవడం గమనార్హం.గాజా సంక్షోభంపై చర్చించేందుకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి ఈ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ ఊచకోత ఆపాలి

- ఐదు వామపక్షాల డిమాండ్

న్యూఢిల్లీ : పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ మారణకాండను తక్షణమే ఆపాలని ఐదు వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సిపిఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ఎఐఎఫ్‌బి ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్, సిపిఐ (ఎంఎల్)-లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్‌ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య ఒక ప్రకటన విడుదల చేశారు. కాల్పుల విరమణ జరిపి, మారణకాండను ఆపితేనే పరిష్కార మార్గం దొరుకుతుందని వారు స్పష్టం చేశారు. అమెరికా-ఇజ్రాయిల్ జరుపుతున్న ఊచకోతను సమర్థించడాన్ని ఆపాలంటూ వామపక్ష పార్టీలు మోడీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. అమెరికా, భారత్ విదేశాంగ, రక్షణ మంత్రులు జరిపిన ముఖాముఖి చర్చల్లో గాజాకు మానవతా సాయం అందించడం కోసం కాల్పులకు విరామం ఇవ్వాలంటూ కోరారు. రెండు దేశాల ఏర్పాటే పరిష్కార మార్గమని భారత్ ఆ సమావేశాల్లో పునరుద్ఘాటించింది. అయితే, ఈ సమావేశాల్లో కాల్పుల విరమణకు పిలుపివ్వకుండా విరామం కోసం పిలుపివ్వడమంటే ఇప్పటికే కొనసాగుతున్న ఇజ్రాయిల్ మారణకాండను చట్టబద్ధం చేయడమే అవుతుందని వామపక్షాల నేతలు పేర్కొన్నారు. 35 రోజులుగా ఏకధాటిగా ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో ఇప్పటికే 11వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. వారిలో దాదాపు సగం మంది చిన్నారులే, అసుపత్రులపైన అత్యంత ఆటవికమైన, క్రూరమైన రీతిలో దాడులు జరుగుతున్నాయి. తక్షణమే కాల్పుల విరమణ జరపాలని వామపక్షాల నేతలు డిమాండ్ చేశారు.

తెలంగాణలో ఎం-3 ఇవిఎంల వినియోగం

ప్రజాశక్తి-హైదరాబాద్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు... ఓటు వేసేందుకు ఉపయోగించే మెషిన్లు. ఎన్నికలంటే బ్యాలెట్ పేపర్లు, వాటిని దాచిఉంచే బాక్స్‌లు, స్వస్తిక్ గుర్తు. ఇప్పుడీ పరిస్థితి మారింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ముందుకొచ్చిన నేపథ్యంలో ఇసిఐఎల్ సంస్థ ఇవిఎంలను తయారుచేసింది. గత ఎన్నికల్లో రూ.80 వేలతో తయారు చేసిన ఎం-2 ఇవిఎంలను వాడగా, తాజా ఎన్నికల్లో కేవలం రూ.20 వేలతో ఉత్పత్తి చేసిన ఎం-3 ఈవీఎంలను వినియోగిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం మరింత వృద్ధి చేశారు. ఒక్కో ఇవిఎం 15 ఏళ్లపాటు పనిచేస్తుంది. ఓట్లు వేశాక 45 రోజులపాటు చెక్‌చెదరకుంటా ఉంటాయి. ఒక్కసారి వినియోగించాక రీసెట్ నొక్కితే మళ్లీ వాడుకోవచ్చు. ఒక్కో ఇవిఎంలో 2000 ఓట్లు నమోదవుతాయి. ఈవీఎంలతోపాటు రాష్ట్రంలో వీవీప్యాట్లను సైతం ఉపయోగిస్తున్న సంగతి తెలిసిందే. బెంగళూరు నుంచి వీటిని తెప్పించారు. ఒక్కో ఇవిఎంలో 16 మంది నుంచి 64 మంది అభ్యర్థుల పేర్లు నమోదుచేసే అవకాశముంది. రాష్ట్రంలో 52,574 ఈవీఎంలు, 44 వేల వీవీప్యాట్లను వినియోగిస్తున్నారు. వీటికి తోడు 30 శాతం అదనంగా రిజర్వులో పెట్టారు.

పుల్వామాలో ఎన్‌కౌంటర్

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో పుల్వామా జిల్లాలో భద్రతా సిబ్బంది, ఉగ్రవాదులకు మధ్య శనివారం ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం రాత్రి వరకూ కూడా ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. భద్రతా బలగాలు ఈ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. శనివారం ముందుగా జిల్లాలోని పరిగాం ప్రాంతంలో ఉగ్రవాదులు దాక్కుని ఉన్నారనే సమాచారంతో సైన్యం, పోలీసులు సంయుక్తంగా భారీ ఎత్తున కార్డన్, సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. దీంతో భద్రతా సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఈ ఎన్‌కౌంటర్ ప్రారంభమయింది. ఈ ప్రాంతంలో కనీసం ముగ్గురు ఉగ్రవాదులు దాక్కుని ఉన్నారని అనుమానిస్తున్నారు.

ఇటీవల జమ్ముకాశ్మీర్‌లోని షోపియాన్‌లో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో భద్రతా బలగాలు ఒక ఉగ్రవాదిని హతమార్చాయి. ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ప్రాంతంలో ఉగ్రవాద కార్యకలాపాల గురించి సమాచారం అందడంతో, సైన్యం, పోలీసు సిబ్బంది సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించినప్పుడే ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాల కదలికలను చూసిన ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించారు. భద్రతా సిబ్బంది తిరిగి కాల్పులు చేయడంతో ఈ ఎన్‌కౌంటర్ ప్రారంభమయింది.

కుల్గామ్‌లో ఇద్దరు మిలిటెంట్లు మృతి

గత నెల అక్టోబరు 4న జమ్ముకాశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మిలిటెంట్లు మరణించారు. మిలిటెంట్లు సామాన్యులను బందీగా చేసుకున్నట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి, కాల్పులు జరపడంతో వారు చనిపోయారు. వారిద్దరూ హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందినవారు.

రాజస్థాన్‌లో దారుణం

- నాలుగేళ్ల బాలికపై ఎస్ఐ అత్యాచారం
- పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన స్థానికులు

జైపూర్ : నాలుగేళ్ల బాలికపై ఒక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ అత్యాచారానికి పాల్పడిన దారుణఘటన రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో జరిగింది. లాల్సోత్ ప్రాంతంలో ఎన్నికల విధుల్లో ఉన్న ఎస్ఐ భూపేంద్రసింగ్ ఈ దారుణానికి పాల్పడినట్లు ఎఎస్‌పి రామచంద్ర సింగ్ నెహ్రా శనివారం తెలిపారు. ఈ నెలలో రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికల జరగనున్న సంగతి తెలిసిందే. శుక్రవారం మధ్యాహ్నం ఏదో ఒక కారణంతో తన గదికి మైనర్ బాలికను పిలిపించుకుని ఎస్ఐ అత్యాచారం చేశాడని ఎఎస్‌పి వెల్లడించారు. నిందితుడి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. దౌసా ఎస్‌పి వందిత రాణా మాట్లాడుతూ బాలిక వయస్సు నాలుగు నుంచి ఐదేళ్ల లోపు ఉంటుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. అత్యాచార వార్త తెలిసిన వెంటనే రాహువాస్ పోలీస్ స్టేషన్‌ను స్థానికులు ముట్టడించారు. ఎస్ఐను అరెస్టు చేయడానికి ముందు ఎస్ఐపై దాడికి దిగారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

దాల్ సరస్సు వద్ద అగ్ని ప్రమాదం

- ముగ్గురు పర్యాటకులు సజీవ దహనం
- ఐదు హౌస్ బోట్ల దగ్ధం

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ఉన్న దాల్ సరస్సు వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు ప్యాటకులు సజీవ దహనమయ్యారు. ఐదు హౌస్‌బోట్లు దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదం జరిగిన కొన్ని గంటల తరువాత దగ్ధమైన సఫీనా అనే హౌస్‌బోట్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన ముగ్గురు పర్యాటకుల మృతదేహాలను గుర్తించారు. దాల్ సరస్సులోని ఘాట్ నంబర్ 9 సమీపంలోని ఒక హౌస్‌బోట్‌లో ముందుగా మంటలు చెలరేగాయని, చాలా వేగంగా ఇతర బోట్లను చుట్టుముట్టాయని పోలీసులు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

గాజాలో నరమేధాన్ని ఇజ్రాయెల్ ఆపాలి : మాక్రాన్

పారిస్: గాజాపై బాంబులు వేసి పౌరులను చంపడం ఇజ్రాయెల్ ఆపాలని ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మానియెల్ మాక్రాన్ కోరారు. హమాస్ ఉగ్రవాద చర్యలను ఫ్రాన్స్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇజ్రాయెల్ ఆత్మరక్షణ హక్కును గుర్తిస్తూ, గాజాలో దాడిని ముగించాలని అది వారిని కోరింది.

కాల్పుల విరమణ జరగాలని మీరు కోరుకుంటున్నారా అని అడిగిన ప్రశ్నకు, మాక్రాన్ ఇలా బదులిచ్చారు.

బాంబు దాడికి ఎలాంటి సమర్థన లేదని, కాల్పుల విరమణ ఇజ్రాయిల్‌కు మేలు చేస్తుందని బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాక్రాన్ అన్నారు. శుక్రవారం రాత్రి అల్ షిఫా ఆసుపత్రి ఆవరణలో వరుస దాడులు జరిగాయి.

గురువారం రాత్రి నుంచి జరిగిన పలు వైమానిక దాడుల్లో 13 మంది చనిపోయారు. అల్-షిఫా ఆసుపత్రి కింద హమాస్ సైనిక నియంత్రణ కేంద్రం, భూగర్భ సొరంగాలు ఉన్నాయని ఇజ్రాయెల్ ఆరోపించింది.ఫ్రాన్స్ అధ్యక్షుడు పౌరులపై బాంబు దాడి అన్యాయమని, మరణాలు బాధాకరమని అన్నారు.

మందుల కొరత

గాజా ఆసుపత్రులపై ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం కావడంతో ఔషధాల కొరత మరింత తీవ్రమవుతోంది. ఇండోనేషియా ఆసుపత్రిలోని ఒక వైద్యుడు ఔషధాల కొరత తీవ్రంగా ఉందని నివేదించినట్లు అల్ జజీరా నివేదించింది.గాజాలోని ఆరోగ్య కార్యకర్తలు కూడా భారీ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఇజ్రాయెల్ బాంబు దాడుల్లో చాలా మంది ఆరోగ్య కార్యకర్తల కుటుంబ సభ్యులు మరణించారు. కొంతమంది కుటుంబ సభ్యులు ఉత్తర గాజా నుండి దక్షిణ ప్రాంతాలకు పారిపోతున్నారు, అక్కడ వారు వారంలో ప్రతిరోజూ పని చేస్తారు. రెండు గంటలు మాత్రమే విశ్రాంతి. ఇజ్రాయెల్ గాజాపై దాడిని తీవ్రతరం చేయడంతో వెంటనే తిరిగి విధుల్లోకి రావాల్సి వస్తోందని డాక్టర్ చెప్పారు. అయితే మందుల కొరత దీనికంటే పెద్ద సమస్య. అత్యవసర సమయాల్లో వాడాల్సిన మందులకు సైతం కొరత ఏర్పడిందని వైద్యులు తెలిపారు.

మీ కోసం

దీపాలు వెలిగించడానికి అరగంట ముందు ప్రమిదలకు రెండువైపులా నూనె రాసినట్లయితే అవి నూనెను పీల్చుకోవు. అలాగే దీపాలు వెలిగించాక ప్రమిదల్లోని నూనెలో రెండు చుక్కల జాస్మిన్ ఆయిల్ వేస్తే ఇల్లంతా మంచి సువాసన వెదజల్లుతాయి.

జీవన సౌరభం

ఒక్కొక్క దీపాన్ని వెలిగిస్తూ
చీకట్లను పారదోలినట్లు..
ఒక్కొక్క మార్పు
సాధించుకుంటూ గొప్ప
జీవితాన్ని నిర్మించుకుందాం.

వెలుగుల దీపావళి

పాపాయి ఏడ్చింది
టపాకాయలు అడిగింది

వద్దమ్మ.. వద్దని
అమ్మమ్మ చెప్పింది

పాపాయి అలిగింది
మంకు పట్టు పట్టింది

గాయాలు అవుతాయని
నానమ్మ చెప్పింది

పాపాయి ఒప్పుకోక
బుంగమూతి పెట్టింది

కాలుష్యమవుతుందని
తాతయ్య చెప్పాడు

పాపాయి ఊరుకోక
మారాము చేసింది

మామయ్య వచ్చాడు
ప్రమిదలు వెలిగించాడు

కాంతులు విరచిమ్మింది
పాపాయి నవ్వింది!

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
94417 81239.



టపాకాయల లెక్క తేల్చండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన టపాకాయలను అంకెలుగా గణించి లెక్క చేశాం. చివరి వరుస సమాధానం మీరు రాబట్టండి చూద్దాం.

69 : ∂ƆɐɯƎ

నేను గీసిన బొమ్మ

బి. చక్రిక,
5వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అందరూ బాగుండాలనే ఆచరణే దీపావళి

జీవితమంటేనే చీకటి వెలుగుల సమాహారం. దీపావళి నేర్పిన పాఠం అదే. తిమిర అంధకారాలను పారద్రోలే దీపకాంతుల వలె ప్రతి మనిషి జీవన ప్రయాణం అజ్ఞానాన్ని పారద్రోలే చైతన్యకాంతుల దిశగా సాగిపోవాలి. ఆత్మీయతలు, అనుబంధాల వేడుకగా అజ్ఞానం నశించి జ్ఞానకాంతులు వెదజల్లేదిగా ఈ దీపావళి నిలిచిపోవాలి.

ఒకప్పటి దీపావళి వెలుగులు ఎన్నో ఆనందాల లోగిళ్లకు ఆనవాలు. బంధాలు, అనుబంధాలకు పట్టుకొమ్మలు. పండుగలెన్ని ఉన్నా దీపావళి పండుగను ఎంతో ప్రత్యేకంగా చేసుకునేవారు. కానీ రానురాను పండగ రూపం మారింది. ఆత్మీయతల స్థానంలో ఆడంబరాలు వచ్చాయి. మట్టి ప్రమిదలు పోయి విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. కాకరపువ్వొత్తులు, తాటాకు బాంబులు, మతాబులు, హవ్వాయి జువ్వాయిలు వంటివి పోయి చెవులు దద్దరిల్లే టపాసులు తయారయ్యాయి. ఆకాశంలో నక్షత్రాల మాదిరి కాంతులు వెదజల్లే తారజువ్వల స్థానంలో కళ్లు మిరుమిట్లు గొలిపే భీకర శబ్దం చేసే టపాసులు నింగినంటుతున్నాయి. కాలుష్య కారకాలతో ప్రకృతి నాశనానికి మనిషి ఎప్పుడూ ఒకడుగు ముందే ఉంటున్నాడు. వాయుకాలుష్యం, జలకాలుష్యం పేరుతో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నాడు.

చీకటి చుట్టుముట్టినప్పుడు చేసే చిన్న ప్రయత్నం మనల్ని విజయమనే వెలుగు వైపు అడుగులు వేయిస్తుంది. జీవితంలో ఎప్పుడు ఎక్కడ ఒక ముందడుగు వేయాలన్నా ఈ ప్రయత్నమే మనకు ఓ పెద్ద పాఠం. ఎప్పుడు ఎలాంటి విపత్తు విరుచుకుపడినా ఇలాంటి ప్రయత్నం ఒకటి చేయాల్సి ఉంటుంది. చీకటి శాశ్వతం కాదు; వెలుగు నిత్యం కాదు. ఒకదాని వెంట ఒకటి వస్తాయి. పోతాయి. వచ్చిన దానిని వచ్చినట్టు ఒప్పుకోవడం అలవర్చుకోవాలి. తట్టుకొని నిలబడాలి. ఇదే దీపావళి ఇచ్చే విలువైన సందేశం.

ప్రకృతి మనకు ఎన్నో పాఠాలు నేర్పుతుంది. మనుగడ పాఠం మొదలయ్యేది అక్కడి నుంచే. చెట్టును, పుట్టను, నింగిని, నేలను, నీటిని ఆరాధించడం మొదలుపెట్టిన మనిషి క్రమంగా వాటిని నాశనం చేసే వైపు అడుగులు వేస్తున్నాడు. పర్యావరణ హితులు ఎంత మొత్తుకున్నా పండుగల నాడు చేసే కాలుష్యానికి అదుపు ఉండడం లేదు. పండుగైనా, పర్వదినమైనా, జాతరైనా, ఉత్సవమైనా నాటి సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. పండుగ పరమార్థం ఆవిరైపోతోంది.

ఏ పండుగైనా మతానికి సంబంధించిన వ్యవహారం కాదు. అనేక మనుషుల, ప్రదేశాల, సంస్కృతుల సమ్మేళనమే పండుగలు. దేశవిదేశాల్లో సైతం భారతీయ పండుగలు జరుపుకోవడం అందుకు పెద్ద ఉదాహరణ. ఫలాన మతం వారు ఫలానా పండుగే చేసుకోవాలి. ఫలానా పండుగ చేసుకునేవారు ఫలాన మతం వారు అన్న ముద్ర లేకుండా ప్రపంచవ్యాప్తంగా భారతీయులు ఎక్కడున్నా ఆయా దేశాల సమూహాలతో కలసి పండుగలు నిర్వహించుకోవడం వసుదైక కుటుంబానికి గొప్ప చిహ్నం. కానీ ఆ స్పృహ లేకుండా వ్యవహరించడం కొంతమంది అజ్ఞానానికి పరాకాష్టగా మారుతోంది. మతాల పేరుతో చిచ్చుపెట్టడం పండుగ స్ఫూర్తిని దెబ్బతీస్తోంది.

ఈ మూడేళ్ల కాలం మనకు ఎన్నో పాఠాలు నేర్పింది. కరోనా ఉపద్రవంతో ప్రతిఒక్కరికి ఆరోగ్యస్పృహ, పర్యావరణ రక్షణపై అవగాహన వచ్చింది. పొదుపు పాఠాలు అలవర్చుకుంటున్నారు. బిడ్డల చదువు, భవిష్యత్తుతో పాటు కుటుంబ ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు. కరోనా చీకటి తరువాత వచ్చిన వెలుగు స్పృహ ఇది. ప్రకృతి నాశనం నేర్పిన పెద్ద గుణపాఠం నుండి నేర్చుకున్న జ్ఞానపాఠం ఇది.

మట్టి ప్రమిదల్లో కాసింత చమురు వేసి పత్తిఒత్తితో ఇంటినిండా వెలుగు నింపడం నిజమైన దీపావళి. చిట్టి చిట్టి పాపల ముసిముసి నవ్వుల వెలుగులో ప్రతి ఇల్లూ నిండిపోవాలి. అమ్మ చేతి మిఠాయిల తీపితో నోరంతా తియ్యదనం రావాలి. చీకటికి భయపడే పిల్లలంతా దీపాల కాంతుల్లో కేరింతలు కొట్టాలి. అమ్మ కొంగు పట్టుకుని వ్రేలాడే గడుగ్గాయలకు ఈ దీపావళి ఓ మధురానుభూతి కావాలి.

పిల్లలూ, పెద్దలూ ఏకమై ఈ దీపావళి సంబురంగా చేసుకోవాలి. పండుగరోజు ఆఫర్లు, ఎక్చేంజుల బాట పట్టకుండా కుటుంబమంతా ఒక్కచోట చేరి ఆనందాల డోలీల్లో ఊయలలూగాలి. చదువుల పేరుతో దూరతీరాలు చేరిన కన్నబిడ్డల రాకతో ఈ పండుగనాడు ప్రతి అమ్మానాన్న హృదయం పలవరించాలి. పేద, ధనిక తారతమ్యం లేకుండా ప్రతి ఒక్క ఇల్లు వెలుగులతో నిండిపోవాలి.

ప్రకృతిని ప్రేమిస్తూ, పర్యావరణాన్ని రక్షిస్తూ ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలి. స్వార్థం, అవినీతి, అత్యాశ, కోపం, ద్వేషమనే అజ్ఞాన చీకట్లను పారద్రోలి ప్రేమ, ఆప్యాయత, స్నేహం, సౌభ్రాతృత్వం, మతసామరస్యమనే వెలుగువైపు పయనించే రోజుకు ఈ దీపావళి నాంది పలకాలి.

వెండితెరపై చంద్రమోహనం!

చంద్రమోహన్ ... కాకతాళీయంగా సినీ పరిశ్రమలోకి అడుగు పెట్టి, తన సహజ నటనతో సినీ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. తెలుగు సినిమా స్వర్ణయుగపు మేలి గురుతుగా ఆయన నిలిచిపోతారు. కె.విశ్వనాథ్, బాపు వంటి దర్శకుల చిత్రాల్లో నటించిన ఆయన కెరీర్‌లో ఎన్నో ఎత్తు పల్లాలను చూశారు. దాదాపుగా ఐదు దశాబ్దాలపాటు తెలుగు సినిమా పరిశ్రమలో ఆయన దిగ్గజ హీరోగా తన సినీ ప్రస్థానాన్ని కొనసాగించారు. కృష్ణాజిల్లా పమిడిముక్కల గ్రామంలో 1942, మే 23న మల్లంపల్లి వీరభద్రశాస్త్రి, శాంభవి దంపతులకు ఆయన జన్మించారు. బాపట్లలోని వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ పూర్తిచేసిన ఆయన అనంతరం కొంతకాలం ఏలూరులోని వ్యవసాయ కళాశాలలో పనిచేశారు.

రంగులరాట్నంతో సినీ ప్రస్థానం

సినిమాల్లో నటించాలనే ఉత్సాహంతో మద్రాస్ (చెన్నై) వెళ్లారు. రంగులరాట్నం (1966) చిత్రంతో హీరోగా చంద్రమోహన్ సినీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత ఆయన చేసిన సుఖదు:ఖాలు, బాంధవ్యాలు చాలా పేరు తెచ్చిపెట్టాయి. 1978లో విడుదలైన పదహారేళ్ల వయసు చిత్రం అప్పట్లో సరికొత్త ట్రెండ్‌ను సెట్ చేసింది. ఆ తర్వాత హీరోగానే కాదు. సహ నటుడిగానూ, హాస్యనటుడిగానూ, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఇలా ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించారు. చనిపోయే వరకూ వయస్సుకు తగ్గ పాత్రలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తూ వచ్చారు. అప్పట్లో సినిమా ఇండస్ట్రీకి మంచి నటుడు దొరికాడనే చర్చ కూడా సాగింది. ఏ పాత్రలోనైనా అవలీలగా పోషించల గల నటుల్లో చంద్రమోహన్ ముందు వరుసలో ఉండేవారు. రంగుల రాట్నంలో చంద్రమోహన్ నటనను ఎన్టీఆర్, ఎస్వీఆర్ వంటి వారు కూడా ప్రశంసించారు.

బాంధవ్యాళు సినిమాలో దాదాపుగా హీరో పాత్రను ఇచ్చి ప్రోత్సహించారు. పోషించిన ఏ పాత్రకైనా ప్రాణప్రతిష్ట చేస్తారనే నానుడి అప్పట్లో ఉండేది. 1980వ దశకంలో చిరంజీవి లాంటి హీరోలు వచ్చిన తర్వాత కూడా చంద్రమోహన్ హీరోగానే చేస్తూనే వచ్చారు. విశ్వనాథ్, బాపు లాంటి కొత్త తరహా ఆలోచనలతో ముందుకొచ్చిన దర్శకులు చంద్రమోహన్‌ని



పదహారేళ్ల వయస్సు సినిమాలో...

మండేగుండెలు

సెక్రటరీ సినిమాలో..

అవార్డుతో..

నటుటడిగా పెట్టి, ప్రయోగాలు చేశారు. విశ్వనాథ్, ఎస్వీ బాలసుబ్రహ్మణ్యంలతో బంధుత్వం కూడా ఉండటంతో వారు తీసిన అనేక చిత్రాల్లో అవకాశాలు వచ్చేవి. దర్శకుడి అంతరంగాన్ని ఎరిగి నటించే నటుడు అని పరిశ్రమలు పెద్దలు చంద్రమోహన్ గురించి చెబుతారు.

జోడీ కట్టిన హీరోయిన్లకు అగ్రస్థానం

చంద్రమోహన్ నరసన నటించే కొత్త హీరోయిన్ ఎవరైనా ఇండస్ట్రీలో పాతుకుపోతారనే సెంటిమెంట్ అప్పట్లో ఉండేది. హీరో పాత్రల నుంచి తండ్రి పాత్రలకు తేలిగ్గా బదిలీ అయిన చంద్రమోహన్ అక్కడ కూడా తనదైన శైలితో ప్రత్యేకత చాటారు. తనతో సహ కథానాయకుడిగా నటించిన చిరంజీవికి తండ్రిగా కూడా తన నట వైదుష్యాన్ని నిరూపించుకున్నారు. పదహారేళ్ల వయస్సు సినిమాలో చంద్రమోహన్–శ్రీదేవి జంటగా నటించారు. ఈ సినిమా సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ఆ తర్వాత నుంచి శ్రీదేవి కెరీర్ దూసుకుపోయింది. వేటగాడు, కొండవీటి సింహం, జస్టిస్ చౌదరి తదితర స్టార్ హీరోల సినిమాల్లో శ్రీదేవి నటించింది. అదే ఏడాది జయసుధతో కలిసి ప్రాణం ఖరీదులో నటించగా ఆమె కూడా తిరుగులేని స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. పెళ్లిచూపులు సినిమాలో చంద్రమోహన్–విజయశాంతి కలిసి నటించారు. ఆ తర్వాత శోభన్‌బాబు,నాగేశ్వరరావు, చిరంజీవి లాంటి స్టార్ హీరోలతో అవకాశాలు దక్కాయి. విజయనిర్మల దర్శకత్వం వహించిన అన్ని సినిమాల్లోనూ, మోహన్‌బాబుతోను చంద్రమోహన్ నటించారు.

900కుపైగా చిత్రాల్లో నటన

శుభోదయంలో పనిదొంగగా, బద్ధకానికి నిలువెద్దు నిదర్శనంగా కనిపించే పాత్రల్లో అద్భుత నటనకు మంచి పేరొచ్చింది. బంగారుపిచ్చుకలో చంద్రమోహన్ చేసిన బంగార్రాజు పాత్ర నేటికీ కుర్రకారును మెప్పిస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. చిరంజీవి తొలిచిత్రం ప్రాణంఖరీదులో మూగ చెవిటి వాడిగా చంద్రమోహన్ నటన చిత్ర సీమలోనే సరికొత్త రికార్డులను నెలకొల్పింది. నటించిన 900 పై చిలుకు సినిమాల్లో 175 సినిమాల్లో హీరోగా నటించారు. వాటిలో 108 చిత్రాలు చంద్రమోహన్ ప్రతిభాపాటవాలకు గీటురాయిగా నిలిచాయి.

మార్ష్ మోత

- అజేయంగా 177 బాదిన మిచెల్ మార్ష్
- బంగ్లాదేశ్‌పై ఆస్ట్రేలియా ఘన విజయం
- గ్రూప్ దశలో ఏడో విజయంతో సెమీస్‌కు
- ఐసీసీ 2023 ప్రపంచకప్

పుణె : ప్రపంచకప్ గ్రూప్ దశను ఆస్ట్రేలియా అద్భుతంగా ముగించింది. పుణెలో శనివారం జరిగిన గ్రూప్ దశ చివరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై 8 వికెట్ల తేడాతో అదిరే విజయం సాధించింది. 307 పరుగుల లక్ష్యాన్ని 44.4 ఓవర్లలో మరో 32 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. గ్రూప్ దశలో ఏడు విజయాలతో పాయింట్ల పట్టికలో టాప్–3లో నిలిచింది. ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికాతో సెమీఫైనల్ పోరుకు రంగం సిద్ధం చేసుకుంది. ఛేదనలో టాప్ ఆర్డర్ బ్యాటర్ మిచెల్ మార్ష్ (177 నాటౌట్, 132 బంతుల్లో 17 ఫోర్లు, 9 సిక్స్‌లు) అజేయ శతకంతో చెలరేగాడు. స్టీవ్ స్మిత్ (63 నాటౌట్, 64 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), డేవిడ్ వార్నర్ (53, 61 బంతుల్లో 6 ఫోర్లు) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 306 పరుగులు చేసింది. తౌహిద్ హృదయ్ (74, 79 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), నజ్ముల్ శాంటో (45, 57 బంతుల్లో 6 ఫోర్లు) రాణించారు. గ్రూప్ దశలో ఏడో పరాజయంతో పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచిన బంగ్లాదేశ్ సెమీఫైనల్స్‌కు దూరమైనా.. ఐసీసీ 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించనుంది. ఆసీస్ బ్యాటర్ మిచెల్ మార్ష్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

మార్ష్ ధనాధన్ : అఫ్గనిస్థాన్‌పై అసమాన విజయం ఉత్సాహంలో ఉన్న ఆస్ట్రేలియా.. బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించింది. సెమీస్ బెర్త్ ఖాయం కావటంతో గ్రూప్ దశ చివరి మ్యాచ్‌లో మోత మోగించింది. ధనాధన్ ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (10) నిరాశపరిచినా.. డ్యాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ (53)తో కలిసి మిచెల్ మార్ష్ (177 నాటౌట్) అదరగొట్టాడు. వార్నర్, మార్ష్ జోడీ రెండో వికెట్‌కు 120 పరుగులు జోడించింది. ఆరు ఫోర్లతో వార్నర్ 52 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించగా.. మిచెల్ మార్ష్ ఆరు ఫోర్లు, మూడు సిక్సర్లతో 37 బంతుల్లోనే ఫిఫ్టీ మార్క్ చేరుకున్నాడు. డేవిడ్ వార్నర్ నిష్క్రమించినా.. స్టీవ్ స్మిత్ (63 నాటౌట్) జతగా పని ముగించాడు. 11 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 87 బంతుల్లోనే సెంచరీ బాదిన మార్ష్.. 150 మార్క్‌ను 16 ఫోర్లు, ఏడు సిక్సర్ల సాయంతో 117 బంతుల్లోనే అందుకున్నాడు. మరోవైపు స్మిత్ సైతం మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 55 బంతుల్లో అర్ధ సెంచరీ నమోదు చేశాడు. మూడో వికెట్‌కు స్మిత్, మార్ష్ జోడీ అజేయంగా 175 పరుగులు జోడించారు. మిచెల్ మార్ష్ దెబ్బకు బంగ్లాదేశ్ బౌలర్లు బెంబేలెత్తారు. టస్కిన్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహమాన్‌లు చెరో వికెట్ పడగొట్టారు.

హృదయ్ మెరువగా : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లాదేశ్ మంచి స్కోరు సాధించింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు అందరూ సమిష్టిగా పరుగులు జోడించారు. ఓపెనర్లు హసన్ (36), లిటన్ దాస్ (36) సహా నజ్ముల్ (45), మహ్మదుల్లా (32) మెరిశారు. తౌహిద్ హృదయ్ (74) అర్ధ సెంచరీతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. టాప్–5 బ్యాటర్లు మెరిసినా.. లోయర్ ఆర్డర్‌లో ఆశించిన ప్రదర్శన రాలేదు. ముష్ఫికర్ (21), మెహిది మిరాజ్ (29) వేగంగా ఆడలేకపోయారు. 330–340 పరుగులు చేసేలా కనిపించిన బంగ్లాదేశ్ చివరి పది ఓవర్లలో కాస్త నెమ్మదించింది. 306 పరుగులతో సరిపెట్టుకుంది. ఆసీస్ బౌలర్లలో సీన్ అబాట్, ఆడం జంపా చెరో రెండు వికెట్లు పడగొట్టగా.. మార్కస్ స్టోయినిస్ ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. మార్నస్ లబుషేన్ రెండు మెరుపు రనౌట్లతో బంగ్లాదేశ్ టాప్ ఆర్డర్ దూకుడుకు బ్రేక్ వేయగా.. అబాట్ సైతం ఓ రనౌట్‌లో భాగం పంచుకున్నాడు.

నెదర్లాండ్స్‌తో భారత్ ఢీ నేడు

తొమ్మిదో విజయంపై భారత్ గురి
శుభ్‌మన్ గిల్, సూర్యపై ఫోకస్

బెంగళూర్ : 2023 ఐసీసీ ప్రపంచకప్ వేటను అద్భుతంగా సాగిస్తున్న టీమ్ ఇండియా.. గ్రూప్ దశ చివరి మ్యాచ్‌లో నేడు పసికూన నెదర్లాండ్స్‌తో తలపడనుంది. అగ్ర జట్లను పిండి చేసి సగర్వంగా సెమీఫైనల్లో అడుగుపెట్టిన భారత్ నేడు నామమాత్రపు మ్యాచ్‌లో పరుగుల వరదపై దృష్టి నిలిపింది. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్, ఎక్స్ ఫ్యాక్టర్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్‌లు పరుగుల వేటలో మెరువాలని జట్టు మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. బుమ్రా, కుల్దీప్‌లకు విశ్రాంతి లభించనున్న తరుణంలో అశ్విన్, ప్రసిద్ కృష్ణలు చిన్నస్వామిలో బంతి అందుకునే అవకాశం కనిపిస్తోంది. దక్షిణాఫ్రికా, శ్రీలంకపై విజయాలు సాధించిన నెదర్లాండ్స్ ఇతర మ్యాచుల్లోనూ మెప్పించింది. నేడు భారత్‌తో మ్యాచ్‌లోనూ అభిమానుల హృదయాలకు హత్తుకునే ఆటతీరుతో రాణించాలని డచ్ శిబిరం ఆశిస్తోంది.

శుభ్‌మన్ దంచేనా..? : 2023 ఐసీసీ ప్రపంచకప్‌లో పరుగుల మోత మోగించిన టాప్–3 బ్యాటర్లలో శుభ్‌మన్ గిల్ ఉంటాడని అభిమానులు, క్రికెట్ పండితులు అంచనా వేశారు. ఈ ఏడాది వన్డే ఫార్మాట్‌లో భీకర ఫామ్‌లో ఉన్న గిల్ అదే జోరులో వరల్డ్‌కప్‌కు వచ్చాడు. కానీ ఆరంభంలోనే డెంగీ జ్వరం బారిన పడిన శుభ్‌మన్ గిల్ తొలి రెండు మ్యాచులకు దూరమయ్యాడు. డెంగీ జ్వరం కారణంగా బరువు తగ్గిన గిల్.. ఆరు ఇన్నింగ్స్‌ల్లో రెండు అర్ధ సెంచరీలే సాధించాడు. గిల్ నుంచి అభిమానులు, జట్టు మేనేజ్‌మెంట్ ఆశించింది ఇది కాదు. టాప్ ఆర్డర్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి పరుగుల వరదలో గిల్ వైఫల్యం పెద్దగా కనిపించటం లేదు. కానీ కీలక సెమీఫైనల్స్ ముంగిట శుభ్‌మన్ గిల్ తనదైన జోరు అందుకోవటం భారత్‌కు కీలకం. పరుగుల వేటలో గిల్ సైతం దంచికొట్టడం మొదలుపెడితే ప్రత్యర్థులకు పగలే చుక్కలు కనిపించటం ఖాయం. ఇక డచ్‌తో మ్యాచ్‌లో ప్రణాళికలు, వ్యూహం పరంగా టీమ్ ఇండియాలో ఎటువంటి మార్పులు ఉండబోవు. కానీ బౌలింగ్ విభాగంలో ఏమైనా మార్పులు చేసే అవకాశం లేకపోలేదు. రవిచంద్రన్ అశ్విన్, ప్రసిద్ కృష్ణలు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. సెమీఫైనల్ ముంగిట విలువైన మ్యాచ్ ప్రాక్టీస్‌కు దూరం కావటం సైతం అంతి మంచిది కాదు. బుమ్రా, షమి సహా కుల్దీప్ యాదవ్ విశ్రాంతి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. దీంతో నేడు భారత్ తుది జట్టు కూర్పుపై కాస్త ఆసక్తి నెలకొంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68